www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఈపీఎఫ్‌వో వేతన పరిమితి
రూ.21 వేలకు!
రూ.15వేల నుంచి పెంచే యోచనలో కేంద్రం 2

శుక్రవారం | 12-4-2024 | పేజీలు: 14 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 13

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: చవితి మ. 1.12 తదుపరి పంచమి; నక్షత్రం: రోహిణి రా 12.51 తదుపరి మృగశిర; వర్జ్యం: సా.5.06-6.39; దుర్ముహూర్తం: ఉ.8.33-9.22, మ.12.40-1.30; అమృతఘడియలు: రా.9.45-11.18; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.27 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

త్వరలో నేతలకూ నోటీసులు!



ట్యాపింగ్ కేసులో రాధాకిషన్ వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు వేగిరం

మొదట ఎవరికి నోటీసులు ఇవ్వాలనేదానిపై కసరత్తు

సాంబశివారెడ్డిని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించిన ప్రభుత్వం

రాజకీయ నాయకులకు నోటీసులపై త్వరలో వెల్లడి: సీపీ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా జరిగిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో సూత్రధారులైన రాజకీయ నాయకులపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. పాత్రధారులైన పోలీసు అధికారులు, మాజీ ఓఎస్డీలను విచారించిన తర్వాత వారి వాంగ్మూలాల మేరకు కొందరు రాజకీయ నాయకులు ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. ఈ కేసులో అరెస్టయిన పోలీసుల విచారణ పూర్తయిన నేపథ్యంలో.. ఇప్పుడు రాజకీయ నాయకులకు నోటీసులు జారీ చేసి, వారిని విచారించేందుకు దర్యాప్తు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఫోన్‌ట్యాపింగ్‌తోపాటు బెదిరింపులు, అక్రమ వసూళ్లకు సంబంధించి రాధాకిషన్‌రావు విచారణలో గత ప్రభుత్వ పెద్దలు ఎవరెవరు ఏయే పనులు చేయించుకున్నారు? ఎన్నికల సమయంలో ఎవరి కోసం పోలీసు వాహనాల్లో నగదు తరలించారు? ఎంత మొత్తంలో నగదు తరలింది? అనే వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా రాజకీయ నేతల ప్రమేయాన్ని గురించి వివరించినట్లు.. ఆ నాయకులను వరుసగా విచారణకు పిలవనున్నట్లు సమాచారం. న్యాయ నిపుణులతో చర్చించి, వారి సలహాలు, సూచనల మేరకు నోటీసులు జారీ చేసేందుకు దర్యాప్తు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ కోవలో.. గత ప్రభుత్వంలో కీలక నాయకులతోపాటు జిల్లా స్థాయి నేతలు కూడా ఉన్నట్లు తెలిసింది. అయితే ముందుగా ఎవరికి నోటీసులు ఇవ్వాలనే అంశంపైనా ఉన్నతాధికారులు సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ కీలక నేతలకు నోటీసులు ఇస్తే ఆ తర్వాత పరిణామాలు ఎలా ఉంటాయి? శాంతిభద్రతల పరంగా

మిగతా 3వ పేజీలో...



ఐఫోన్లపై నిఘా!

నిర్దేశిత వ్యక్తులపై పెగాసస్ తరహా మెర్సినరీ స్పైవేర్ దాడి

భారత్ సహా 92 దేశాల్లోని కొందరు వినియోగదారులకు యాపిల్ సంస్థ హెచ్చరిక

లాక్‌డౌన్ మోడ్ ఎనేబుల్ చేయండి

ఐఫోన్ యూజర్లకు సూచన 2



నీటి కుట్రలు?

హైదరాబాద్‌లో సరిపడా నిల్వలున్నా సరఫరా చేయని వైనం

ట్యాంకులు పొంగిపొర్లుతున్నప్పటికీ ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం..!

కొన్ని ప్రాంతాలకు అధికంగా.. మరికొన్నిచోట్లకు సరఫరా అసలే లేదు

జీఎం, డీజీఎం, మేనేజర్ల కనుసన్నల్లో లైన్‌మన్ల ఎత్తుగడలు

జలమండలికి ఝలక్ ఇస్తున్నవారిపై దృష్టి సారించిన విజిలెన్స్ విభాగం 3

అన్నదాతలకు చల్లని కబురు!

ఈసారి ముందే రానున్న నైరుతి

క్షీణిస్తున్న ఎల్‌నినో.. జూన్‌కల్లా లానినా

మంచి వర్షాలు కురుస్తాయంటున్న నిపుణులు

'నైరుతి'పై త్వరలోనే ఐఎండీ తొలి అంచనా

సీఎం చెప్పినా.. పెంచేదే లే!

ధాన్యం కొనుగోళ్లలో ట్రేడర్లు, మిల్లర్ల దందా



కనీస మద్దతు ధర కన్నా తక్కువకే కొనుగోలు

నాణ్యత ప్రమాణాల పేరుతో అడ్డగోలు కోత

క్వింటాకు రూ.500 నుంచి 600 దాకా కట్

సన్నరకాలకైతే రూ.700-800 దాకా కోత

పండుగలు, సెలవుల ధ్యాసలోనే అధికారులు

కొనుగోలు కేంద్రాల్లో పెరగని సేకరణ

మిల్లర్లు, ట్రేడర్లు, మార్కెట్ సిబ్బంది కుమ్మక్కు

జనగామ మార్కెట్‌లో అవే ధరలకు కొనుగోలు

బుధవారం కంటే క్వింటాకు రూ.30 అదనం

గత్యంతరం లేక అమ్ముకుంటున్న అన్నదాతలు

హైదరాబాద్, జనగామ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాత కష్టాన్ని సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తే సహించేది లేదంటూ వ్యాపారులు, మార్కెట్ కమిటీ అధికారులకు సీఎం రేవంత్ హెచ్చరికలు జారీ చేసినా.. ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిలో మార్పు రాలేదు! ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువకే వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినప్పటికీ.. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడం, వారంతా వరుస పండుగలు, సెలవుల ధ్యాసలో ఉండటంతో ఆ ప్రభావం రైతులపై పడుతోంది. ప్రైవేటు ట్రేడర్లు, రైస్‌మిల్లర్లు.. వారి కష్టాన్ని దోచుకుంటున్నారు. సాధారణ వడ్ల రకాలకు

మిగతా 13వ పేజీలో...

తక్కువ ధర చెల్లిస్తే సహించేది లేదు

13

ధాన్యం కొనుగోళ్ల పట్ల చిత్తశుద్ధితో ఉన్నాం

'జనగామ మార్కెట్' ఘటనపై సీఎం సీరియస్

'ఆంధ్రజ్యోతి' కథనాన్ని జోడిస్తూ రేవంత్ ట్వీట్

అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు అభినందన

ముగ్గురు ట్రేడర్లపై కేసులు, కార్యదర్శిపై వేటు

సీబీఐ వంతు..

కవితను అరెస్టు చేసిన దర్యాప్తు సంస్థ

సవాల్ చేస్తూ కోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు

కనీస సమాచారం లేకుండా అరెస్టు చేశారని వాదన

అత్యవసర విచారణ అవసరం లేదన్న న్యాయస్థానం

ఎలాంటి ఊరటా ఇవ్వలేమని చెప్పిన న్యాయమూర్తి

నేడు ఉదయం ప్రత్యేక కోర్టులో విచారణ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై.. తిహాడ్ జైల్లో ఉన్న కవితను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అరెస్టు చేసింది. ఈ విషయాన్ని గురువారం మధ్యాహ్నం ఆమె భర్త అనిల్‌కు తెలిపింది. ఆమె అరెస్టును సవాల్ చేస్తూ.. కవిత తరఫున న్యాయవాది మోహిత్‌రావు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులోని ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం 4.55 నిమిషాలకు ఆ పిటిషన్.. ప్రత్యేక న్యాయమూర్తి మనోజ్ కుమార్ ముందుకు వచ్చింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది నితేశ్ రాణా వర్చువల్‌గా వాదనలు వినిపించారు. ఆమెను అరెస్టు చేసే క్రమంలో సీబీఐ కనీస ప్రమాణాలు పాటించలేదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశాలు ఉన్నా.. సీబీఐ వాటిని పాటించలేదని తెలిపారు. ఆ సమయంలో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి మనోజ్‌కుమార్.. 'పిటిషన్‌పై వాదనలు వినాలా? వద్దా?' అనే దానిపై ఇంకా నిర్ణయమే జరగలేదని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి తన వద్ద ఎలాంటి సమాచారమూ లేదని తెలిపారు. "మీకేమైనా సమాచారం ఉందా?" అని సీబీఐ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను న్యాయమూర్తి ప్రశ్నించగా.. తనకూ ఎలాంటి

మిగతా 12వ పేజీలో...





ఈద్ ఇంటికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న షబ్బీర్ అలీ

సెవెన్ టూంబ్స్ వద్ద ముస్లింల ప్రార్థనలు

ఘనంగా ఈద్ వేడుకలు

షబ్బీర్ అలీ ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి

మహమూద్ అలీ నివాసానికి కేటీఆర్

మీరాలం ఈద్గాలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

భారీ సంఖ్యలో హాజరు

సత్యాగ్రహాలు కొనసాగించాలి: అసద్

హైదరాబాద్/చాదర్‌ఘాట్/ ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రంజాన్ (ఈదుల్ ఫితర్) సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి వచ్చిన సీఎంకు షబ్బీర్ అలీ సాదరంగా స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్,

మిగతా 13వ పేజీలో...

ఢిల్లీలో 'ఆప్‌కీ అదాలత్'లో పాల్గొన్న సీఎం రేవంత్

మజ్లిస్‌ది దుశ్శాసన పాత్ర



నిన్న బీఆర్ఎస్.. నేడు కాంగ్రెస్‌తో దోస్తీ

మజ్లిస్ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒప్పందం: కిషన్‌రెడ్డి

హెటిరో నుంచి కాంగ్రెస్ 300 కోట్లు కొట్టేసింది.. దగాకోర్లతో రీ సెటిల్‌మెంట్లు

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి 12

పదేళ్లు రేవంతే సీఎం!

ఆయన నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి కృషి

తెలంగాణలో పదేళ్లపాటు కాంగ్రెస్ సర్కారే

మా పార్టీలో గ్రూపుల్లేవు.. ఏక్‌నాథ్‌లూ లేరు

హరీశ్, మహేశ్వర్‌రెడ్డి.. మాటలు జాగ్రత్త

కుల మతాల మధ్య చిచ్చుకు బీజేపీ యత్నం

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 13

రేవంత్‌కు మద్దతివ్వడం కొందరికి నచ్చట్లేదు!

పనిచేస్తున్నారు కాబట్టే సపోర్టు చేస్తున్నా

నాకు ఖమ్మం టికెటిస్తే గెలిచినట్లే: వీహెచ్

ఉగ్రవాదులను.. వారి ఇలాకాలోనే చంపుతున్నాం!

పటిష్ఠ ప్రభుత్వంతోనే ఇది సాధ్యం: మోదీ 2

నన్నెంత బెదిరించినా అవినీతిపరులు జైలుకే

'గరీబీ హఠావో' నినాదానికే కాంగ్రెస్ పరిమితం

ఉత్తరాఖండ్, రాజస్థాన్‌లలో ప్రధాని ప్రచారం

ఆలయం కాదు.. ఆదాయం ముఖ్యం

సీఎస్‌డీఎస్ లోక్‌నీతి ప్రీపోల్ సర్వేలో ఓటర్ల మనోగతం



నిరుద్యోగం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్న 27 శాతం మంది

రామమందిరానికి 8% మంది మాత్రమే ఓటు

ధరల పెరుగుదలపైనా జనంలో ఆగ్రహం

నిమ్నాదాయ వర్గాల్లో కేంద్రంపై అసంతృప్తి

ఉన్నత, మధ్య తరగతి ప్రజల్లో సానుకూలత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేయడానికి ప్రాతిపదికగా తీసుకునే ప్రధాన అంశాలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, అభివృద్ధి అని 'సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్(సీఎస్‌డీఎస్) లోక్‌నీతి' నిర్వహించిన ప్రీపోల్ సర్వేలో వెల్లడైంది. బీజేపీ ఆశలు పెట్టుకున్న రామమందిరం అంశానికి ఓటర్లు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వటం లేదని ఈ సర్వే తెలిపింది. అంతేకాదు, అవినీతి అంశాన్ని కూడా జనం అంతగా పట్టించుకోవటం లేదని పేర్కొంది. సీఎస్‌డీఎస్ లోక్‌నీతి నిర్వహించిన ప్రీపోల్ సర్వే ఫలితాలను గురువారం వెల్లడించారు. భారత్‌లో నిరుద్యోగం పెరిగిపోతోందని అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదిక ఇప్పటికే హెచ్చరించగా.. సీఎస్‌డీఎస్ సర్వే ఫలితాలు కూడా దీనిని బలపరిచేలా ఉన్నాయి. నిరుద్యోగం తమను తీవ్రంగా ఆందోళనపరుస్తున్న అంశమని సర్వేలో పాల్గొన్న వారిలో పలువురు చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు కూడా

మిగతా 2వ పేజీలో...



గిగ్ వర్కర్లకు భద్రతేది?

అమలు కాని 5 లక్షల రూపాయల ప్రమాద బీమా

సర్కారుకు సహకరించని ఆయా కంపెనీలు

గిగ్ వర్కర్ల వివరాలు ఇవ్వకుండా అలసత్వం

రాష్ట్రంలో 3 నెలల్లోనే 12 మంది మృత్యువాత

కంపెనీల నిర్లక్ష్యం వల్ల అందని పరిహారం 14

ఓ ఫుడ్ డెలివరీ యాప్ కంపెనీలో డెలివరీ పార్ట్‌నర్‌గా పని చేస్తున్న అనంత్ (22) గత జనవరిలో ఉప్పల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. చదువుతూ కుటుంబాన్ని పోషిస్తున్న అనంత్ మృతితో.. అతని కుటుంబానికి ఆర్థిక కష్టాలు రెట్టింపయ్యాయి. కంపెనీ నుంచి పైసా రాకపోగా.. సర్కారు 5 లక్షలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా ఆ కంపెనీ సహకరించట్లేదు.

ఓ ట్రాన్స్‌పోర్టు యాప్ కంపెనీలో డ్రైవర్‌గా ఉన్న రాజు (45) ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదంలో తుదిశ్వాస విడిచాడు. అతడి మృతితో ఆ కుటుంబం వీధిన పడింది. ఆ కంపెనీ నుంచి పైసా పరిహారం అందలేదు.

ఇజ్రాయెల్‌పై ఏ క్షణాన్నైనా ఇరాన్ దాడి!

అమెరికా, ఇజ్రాయెల్ నిఘా సంస్థల వెల్లడి

సిరియాలో ఇరాన్ కమాండర్ల మృతికి ప్రతీకారంగానే..

ఇజ్రాయెల్‌కు శిక్ష పడాల్సిందే: ఖమేనీ

దీటుగా ఎదుర్కొంటామన్న ఇజ్రాయెల్

ఇజ్రాయెల్‌కు అండగా ఉంటాం: అమెరికా 2

రూ. 3.6 లక్షల కోట్ల భారీ మోసం

మహిళా 'రియల్' వ్యాపారికి మరణశిక్ష

వియత్నాం న్యాయస్థానం సంచలన తీర్పు

దిగ్గజ రియల్టర్‌కు మరణ శిక్ష


- వియత్నాంలో రూ.3.6 లక్షల కోట్ల బ్యాంకింగ్ కుంభకోణం
- మహిళా వ్యాపారవేత్త ట్రూంగ్ దోషి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 : బ్యాంకింగ్ రంగంలోనే అతి పెద్ద కుంభకోణం కమ్యూనిస్టు పాలనలో ఉన్న వియత్నాంలో వెలుగు చూసింది. అంతేకాక, ఈ కేసులో విచారణ పూర్తయి.. దోషిగా తేలిన ఓ మహిళా వ్యాపారవేత్తకు అక్కడి న్యాయస్థానం మరణశిక్ష విధిస్తూ గురువారం సంచలన తీర్పు ఇచ్చింది. రూ.3.6 లక్షల కోట్ల కుంభకోణంకు సంబంధించిన ఈ వ్యవహారంలో వియత్నాంకు దిగ్గజ మహిళా రియల్టర్ ట్రూంగ్ మైలాన్(67) దోషి. వియత్నాంలోని సైగాన్ కమర్షియల్ బ్యాంకు(ఎస్‌సీబీ) నుంచి ట్రూంగ్ మైలాన్ 11 ఏళ్లలో 44 బిలియన్ డాలర్లు(దాదాపు రూ.3.68 లక్షల కోట్లు) రుణంగా తీసుకున్నారు. ఇందులో 27 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.2.25 లక్షల కోట్లు)ను ఆమె నుంచి రికవర్ చేయలేమని ప్రాసిక్యూటర్లు న్యాయస్థానానికి చెప్పారు. 2022లో వెలుగుచూసిన ఈ కుంభకోణం ఆ దేశాన్నే కుదిపేసింది. ఈ కేసుకు సంబంధించి ట్రూంగ్ మైలాన్ సహా 85 మందిని దర్యాప్తు సంస్థలు అప్పట్లోనే అరెస్టు చేశాయి. అరెస్ట్ అయిన వారిలో సెంట్రల్ బ్యాంకు మాజీ అధికారులు, మాజీ ప్రభుత్వ ఉద్యోగులు, ఎస్‌సీబీ మాజీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉన్నారు. కాగా, నిందితులపై విచారణ జరిపి మైలాన్‌ను దోషిగా తేల్చిన న్యాయస్థానం.. ఆమెతోపాటు మిగిలిన నిందితులకు కూడా శిక్షలు ఖరారు చేసింది.



ఎలా మోసం చేశారంటే.. ?

2011 నాటికి వియత్నాం రియల్ ఎస్టేట్ రంగంలో బడా వ్యాపారిగా ఎదిగిన ట్రూంగ్ మైలాన్.. దేశంలో నగదు కొరత ఉన్న మూడు బ్యాంకులను ఓ పెద్ద సంస్థగా విలీనం చేసేందుకు అనుమతి పొందారు. దాని ప్రకారం సైగాన్ కమర్షియల్ బ్యాంకు(ఎస్‌సీబీ)ని నెలకొల్పారు. స్థానిక నిబంధనల ప్రకారం ఓ వ్యక్తికి ఏ బ్యాంకులోనైనా 5% కంటే ఎక్కువ వాటాలు ఉండకూడదు. దీంతో వందలాది షెల్ కంపెనీలు, బినామీలను సృష్టించుకున్న ట్రూంగ్ మైలాన్ ఎస్‌సీబీలో 90% షేర్లు దక్కించుకున్నారు. అనంతరం తన సొంత మనుషులను బ్యాంకులో కీలక పదవుల్లో నియమించి ఆయాషెల్ కంపెనీలకు రుణాలు మంజూరు చేయించారు. ఇలా ఎస్‌సీబీ జారీ చేసిన రుణాల్లో మైలాన్ 93 శాతం తీసుకున్నారు. 2019 ఫిబ్రవరి నుంచి మూడేళ్లపాటు మైలాన్ తన డ్రైవర్‌తో బ్యాంకు నుంచి 4 బిలియన్ డార్లు(రూ.33 వేలు కోట్లు) విత్ డ్రా చేయించి రహస్య ప్రదేశానికి తరలించారని ప్రాసికూట్యర్లు కోర్టుకు తెలిపారు.



ఐఫోన్లపై నిఘా!

- నిర్ణీత వ్యక్తులపై పెగాసస్ తరహా మెర్సినరీ స్పైవేర్ దాడి
- పలువురు ఐఫోన్ యూజర్లకు యాపిల్ సంస్థ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: భారత్‌లోని పలువురు రాజకీయనాయకులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తల ఫోన్లపై గతంలో జరిగిన పెగాసస్ నిఘా గుర్తుందా? అలాంటి నిఘా సాఫ్ట్‌వేర్లను 'మెర్సినరీ స్పైవేర్'లుగా వ్యవహరిస్తారు. తాజాగా అదే తరహా మెర్సినరీ స్పైవేర్‌తో నిఘా ముప్పు పొంచి ఉందంటూ భారత్ సహా 92 దేశాల్లోని తన వినియోగదారులకు యాపిల్ గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఓ హెచ్చరిక సందేశాన్ని పంపింది. తన సందేశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కూడా అందులో సూచించింది. ఇవి సాధారణ సైబర్ క్రిమినల్ దాడులో, కన్స్యూమర్ మాల్‌వేర్ దాడులో కావని.. నిర్ణీత వ్యక్తులను (అంటే.. రాజకీయ నాయకులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలవంటివారిని) లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులని యాపిల్ పేర్కొంది. భారీ ఖర్చుతో కూడుకున్న ఇలాంటి స్పైవేర్ దాడులు సాధారణంగా ప్రభుత్వాలు చేయించేవేనని గత అనుభవాలు చెబుతున్నాయని గుర్తుచేసింది. ఈ నిఘా ముప్పు నుంచి తప్పించుకోవాలంటే వినియోగదారులు తమ ఐఫోన్‌లో లాక్‌డౌన్ మోడ్‌ను ఎనేబుల్ చేయాలని సూచించింది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. భారత్ సహా 60 దేశాల్లో ఈ ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో యాపిల్ ఈ థ్రెట్ నోటిఫికేషన్‌ను తన వినియోగదారులకు పంపడం గమనార్హం.

ఈపీఎఫ్‌వో వేతన పరిమితి రూ.21 వేలకు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో) పరిధిలోని ఉద్యోగుల వేతన పరిమితిని రూ.15వేల నుంచి రూ.21వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఉద్యోగులకు సామాజిక భద్రతను విస్తరించడంలో భాగంగా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. వేతన పరిమితిని పెంచాలనే డిమాండ్లు కొన్నేళ్లుగా ఉండగా, ఉద్యోగులు సైతం ఎప్పటినుంచో దీనికి అనుకూలంగా ఉన్నారు. ఈఎస్ఐసీ ఇప్పటికే వేతన పరిమితిని రూ.21వేలకు పెంచిన నేపథ్యంలో ఈపీఎఫ్‌ను కూడా ఆ మేరకు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. వేతన పరిమితిని చివరిగా 2014లో సవరించారు. అప్పట్లో ఈ పరిమితి రూ.6,500 ఉండగా దాన్ని కేంద్రం రూ.15,000కు పెంచింది. గరిష్ఠ వేతన పరిమితి పెంపుతో ఉద్యోగి, యాజమాన్యాలు చెల్లించే నెలవారీ చందా కూడా ఆ మేరకు పెరగనుంది. పీఎఫ్ ఖాతాకు జమయ్యే మొత్తం పెరగడంతో ఉద్యోగికి పదవీ విరమణ అనంతరం అధిక పెన్షన్ లభిస్తుంది.

స.హ చట్టం కింద ఎన్నికల బాండ్ల వివరాలివ్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు (సహ) చట్టం కింద ఎన్నికల బాండ్ల వివరాలను అందజేసేందుకు ఎస్‌బీఐ నిరాకరించింది. ఇప్పటికే ఆ వివరాలన్నీ ఈసీ వెబ్‌సైట్‌లో ఉన్నప్పటికీ.. డబ్బుకు సంబంధించిన వ్యక్తిగత సమాచారమైనందున బాండ్ల వివరాలను వెల్లడించలేమని ఎస్‌బీఐ తెలియజేయడం గమనార్హం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈసీకి సమర్పించిన ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలను డిజిటల్ రూపంలో అందజేయాలని సామాజిక కార్యకర్త లోకేశ్ బాత్రా సహ చట్టం కింద మార్చి 13న ఎస్‌బీఐని కోరారు. అలాగే సుప్రీంకోర్టులో బ్యాంకు తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది హరీశ్ సాల్వేకు చెల్లించిన రుసుము వివరాలనూ వెల్లడించాలన్నారు. అయితే ఎన్నికల బాండ్లలో వ్యక్తిగత సమాచారం ఉన్నందున.. ఆ వివరాలను అందజేయలేమని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. సాల్వే ఫీజు వివరాలను ఇచ్చేందుకూ నిరాకరించింది.

హరియాణాలో బడి బస్సు బోల్తా.. ఏడుగురి మృతి

- డ్రైవర్ మద్యం తాగి నడపడం వల్లే ప్రమాదం

చండీగఢ్, ఏప్రిల్ 11: హరియాణాలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. డ్రైవర్ మద్యం తాగి నడపడంతో ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు బోల్తా పడి ఏడుగురు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మరో 20 మంది చిన్నారులు గాయపడ్డారు. ఈ దుర్ఘటన హరియాణాలోని మహేంద్రగఢ్ జిల్లాలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీఎల్ పబ్లిక్ పాఠశాల బస్సు 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 30 మంది విద్యార్థులను పాఠశాలకు తరలిస్తోంది. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ధర్మేంద్ర బస్సును వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయాలని ప్రయత్నించాడు. ఈ క్రమంలో బస్సుపై నియంత్రణ కోల్పోయాడు. ఆ విషయం గ్రహించిన వెంటనే బస్సు నుంచి దూకేశాడు. దాంతో బస్సు ఓ చెట్టును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు మృతి చెందగా, 20 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గురువారం రంజాన్ సందర్భంగా అధికారిక సెలవు అయినప్పటికీ సదరు ప్రైవేట్ పాఠశాలలో తరగతులు నిర్వహించడంపై విచారణ జరుపుతున్నట్లు రాష్ట్ర విద్యామంత్రి సీమా త్రిఖా వెల్లడించారు. ఆ బస్సు ఫిట్‌నెస్ గడువు 2018లోనే తీరిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి డ్రైవర్ ధర్మేంద్రతో పాటు సదరు పాఠశాల ప్రిన్సిపాల్ దీప్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో నగ్న చిత్రాలకు చెక్.. కొత్తగా బ్లర్ ఫీచర్

లండన్, ఏప్రిల్ 11: సోషల్ మీడియాలో యువతుల నగ్న ఫొటోలు షేర్ చేస్తామని బెదిరించడం.. ఆపై వారిని లైంగికంగా వేధించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి చర్యలకు చెక్ పెట్టే విధంగా ప్రముఖ సోషల్ మీడియా సంస్థ ఇన్‌స్టాగ్రామ్ సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుల్లో ఎక్కడైనా నగ్నత్వం కనిపిస్తే దాన్ని 'బ్లర్' (మసకబార్చడం) చేసేలా కొత్త ఫీచర్‌ను ప్రారంభించింది. లైంగిక నేరాలు, ఫొటోల దుర్వినియోగాన్ని ఎదుర్కొనేందుకు నేరస్థులు యువతను టార్గెట్ చేయకుండా అరికట్టడానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని, దీనిలో భాగంగా ఈ కొత్త ఫీచర్లను పరీక్షిస్తున్నామని ఇన్‌స్టాగ్రామ్ గురువారం తెలిపింది. 18 ఏళ్లలోపు వయసున్న వారికి ఈ ఫీచర్ డీఫాల్ట్‌గా ఆన్ అవుతుందని, 18 ఏళ్లు నిండిన వినియోగదారులకు మాత్రం దీన్ని యాక్టివేట్ చేసుకోవాల్సిందిగా నోటిఫికేషన్ వస్తుందని పేర్కొంది. ఈ ఫీచర్‌తో నగ్నత్వం ఉన్న ఫొటోలు బ్లర్‌గా కనిపిస్తాయి. వాటిని పంపిన వ్యక్తిని బ్లాక్ చేయడానికి అవకాశం ఉంటుంది.

సూర్యగ్రహణ సమయంలో నాసా రాకెట్ల ప్రయోగం

- మిషన్‌కు ప్రవాస భారత పరిశోధకుడు ఆరోహ్ సారథ్యం



ముంబై, ఏప్రిల్ 11: ఈ నెల 8న ఉత్తర అమెరికాలో ఏర్పడిన సంపూర్ణ సూర్యగ్రహణం సందర్భంగా అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా మూడు సౌండింగ్ రాకెట్లను ప్రయోగించింది. ఈ మిషన్‌కు భారత సంతతికి చెందిన పరిశోధకుడు ఆరోహ్ బర్జాత్య సారథ్యం వహించడం విశేషం. సూర్యగ్రహణం సందర్భంగా భూమి ఎగువనున్న వాతావరణం ఏవిధంగా ప్రభావితం అవుతుందో అధ్యయనం చేయడానికి ఈ రాకెట్లను ప్రయోగించారు. ఆరోహ్ హైదరాబాద్‌లో చదువుకున్నారు. షోలాపూర్‌లోని వాల్చంద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 2001లో అమెరికా వెళ్లారు.

భారత్‌కు ఇబ్బంది కలిగినా సరే.. కెనడా పౌరుల హక్కులను పరిరక్షిస్తాం: ట్రూడో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత్‌పై మరోసారి నోరు పారేసుకున్నాడు. ఢిల్లీలోని మోదీ ప్రభుత్వానికి ఇది ఇబ్బంది కలిగించినా.. తమ దేశ పౌరుల మాట్లాడే హక్కును తమ ప్రభుత్వం పరిరక్షిస్తుందని వ్యాఖ్యానించారు. అలాగే కెనడాలోని గత కన్జర్వేటివ్ ప్రభుత్వం మోదీ, ఆయన మంత్రివర్గంతో స్నేహంగా వ్యవహరించిందని కూడా ట్రూడో ఆరోపించారు. ఒక చర్చాకార్యక్రమంలో అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ట్రూడో ఈ వ్యాఖ్యలు చేశారు. 'కెనడాలోని మైనారిటీలను ఎవరు ఇబ్బంది పెట్టినా సరే వారి కోసం మాట్లాడే వారి హక్కులను కాపాడేందుకు మా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. ఇది వారి స్వదేశాల్లోని వారిని ఇబ్బంది పెట్టినా సరే మేం కెనడియన్లకు మద్దతుగా ఉంటాం' అని ఖలిస్థానీ మద్దతుదారులను ఉద్దేశించి ట్రూడో అన్నారు.

ఉగ్రవేట.. వారి ఇలాకాలోనే

- ఇళ్లలోకి చొరబడి మట్టుబెడుతున్నాం
- పటిష్ఠ ప్రభుత్వంతోనే ఇది సాధ్యం: మోదీ
- ఉత్తరాఖండ్, రాజస్థాన్‌లలో ప్రచారం

జైపూర్/రిషికేశ్, ఏప్రిల్ 11: కేంద్రంలో శక్తిమంతమైన బీజేపీ ప్రభుత్వం ఉందని.. అందుకే మన సైనిక బలగాలు ఉగ్రవాదులను వారి నేలపైనే మట్టుబెడుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. వారి ఇళ్లలోకి చొచ్చుకెళ్లి మరీ చంపుతున్నాయని చెప్పారు. దేశాన్ని లూటీ చేయకుండా అవినీతిపరులను అడ్డుకున్నానని.. దీంతో తనపై వారి కోపం పతాకస్థాయికి చేరిందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్, రాజస్థాన్‌లోని కరౌలీల్లో జరిగిన సభల్లో ఆయన ప్రసంగించారు. గతంలో అస్థిర, బలహీన ప్రభుత్వాలు ఉన్నప్పుడు శత్రువులు ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేశారని.. ఇప్పుడు జాతీయ భద్రతకు కట్టుబడిన, యుద్ధక్షేత్రాల్లోనూ దృఢంగా ఉన్న బలమైన సర్కారు కేంద్రంలో ఉందని, మన బలగాలు శత్రువుల ఇళ్లలోకి చొరబడి చంపేస్తున్నాయని చెప్పారు. అవినీతిపరులు ఏ పరిస్థితుల్లోనూ జైలుకే వెళ్తారని.. ఇది తన గ్యారెంటీ అని పేర్కొన్నారు. తననెంత బెదిరించినా వెనక్కి తగ్గేది లేదన్నారు. 'దేశవ్యాప్తంగా అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అందుకే నాకు వ్యతిరేకంగా విపక్షాలు ఇండీ కూటవిని ఏర్పాటుచేశాయి. 2024 ఎన్నికలు ఎవరు ఎంపీ అవుతారు.. ఎవరు కారన్నది తేల్చడానికి కాదు.. వికసిత్ భారత్ సంకల్పానికి కొత్త శక్తి ఇచ్చేందుకే ఈ ఎన్నికలు. గరీబీ హటావో అని కాంగ్రెస్ దశాబ్దాల పాటు నినాదం చేసింది. కానీ 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేయడానికి నేను కృషిచేశాను' అని అన్నారు. తన జీవితంతో ప్రతి క్షణం దేశానికే అంకితమని చెప్పారు. విశ్రాంతి తీసుకోవడానికో, వినోదానికి మోదీ పుట్టలేదు. మోదీకి దేశ ప్రజలకు సంబంధించిన పెద్ద పెద్ద లక్ష్యాలు ఉన్నాయి. వాటి సాధనకు కష్టపడుతున్నాడు' అని వ్యాఖ్యానించారు.



రాముడి ఉనికినే ప్రశ్నించింది..

కాంగ్రెస్ శ్రీరాముడి ఉనికినే ప్రశ్నించిందని.. రామాలయ నిర్మాణాన్ని వ్యతిరేకించిందని, పైగా అనేక అడ్డంకులు సృష్టించిందని మోదీ ధ్వజమెత్తారు. అయినప్పటికీ ఆలయ నిర్మాణకర్తలు కాంగ్రెస్ పాపాలన్నీ క్షమించి ప్రాణప్రతిష్ఠకు ఆహ్వానిస్తే దానినీ బహిష్కరించిందని ఆక్షేపించారు. ఉత్తరాఖండ్ 'బ్రహ్మ కమల్'కు జన్మస్థానమని.. పోలింగ్ రోజున కమలం పువ్వు గుర్తుపై బటన్ నొక్కి అన్ని స్థానాలను బీజేపీ ఖాతాలో వేయాలని పిలుపిచ్చారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణ రద్దు తన ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయమని తెలిపారు.

బలమైన నేతకే భారతీయుల మద్దతు

భారతదేశంలోని ప్రజల్లో అత్యధికులు బలమైన నాయకుడిని తమ నేతగా కోరుకుంటున్నారని, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వ పని తీరుపై సంతృప్తికరంగా ఉన్నారని ఇంటర్నేషనల్ ఐడీఈఏ(ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ డెమొక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్) అనే సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. దేశంలోని 59% మంది కేంద్ర ప్రభుత్వ పనితీరుపై సంతృప్తికరంగా ఉన్నట్టు ఈ అధ్యయనం వెల్లడించింది. ప్రధాని మోదీ నాయకత్వంపై దేశంలోని ఇతర సర్వేలు కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వెల్లడించాయని పేర్కొంది.

మోదీ పిరికితనం పరాకాష్ఠకు!

- సరిహద్దు విషయంలో 'న్యూస్‌వీక్'తో మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: చైనాతో నెలకొన్న సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై అమెరికాకు చెందిన న్యూస్‌వీక్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యాఖ్యల ద్వారా ప్రధాని మోదీ పిరికితనం పరాకాష్ఠకు చేరినట్లయిందని కాంగ్రెస్ పేర్కొంది. భారత సార్వభౌమత్వంపై చైనా పదే పదే దాడులు చేస్తున్నా కూడా మోదీ మాత్రం ఇంటర్వ్యూలో ఆ దేశంతో సరిహద్దుల్లో సుదీర్ఘకాలంగా నెలకొన్న పరిస్థితులను వెంటనే పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని మాత్రమే పేర్కొన్నారని ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. చైనా విషయంలో మోదీ పేలవమైన ప్రతిస్పందన చైనాను ప్రోత్సహించినట్లుగానే ఉందని ఆరోపించారు. చైనా విషయంలో ప్రధాని స్పందన సిగ్గుచేటు అని, తన వ్యాఖ్యల ద్వారా మోదీ 2020లో సరిహద్దులోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వద్ద చైనా సైనికులతో నెలకొన్న ఘర్షణలో అమరులైన 20మంది భారత జవాన్ల త్యాగాన్ని అవమానించారని ఆరోపించారు.

సత్సంబంధాలనే కోరుకుంటున్నాం: చైనా

సరిహద్దు అంశాల మీద అమెరికాకు చెందిన న్యూస్‌వీక్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై చైనా స్పందించింది. మోదీ చెప్పినట్లుగానే ఇరుదేశాల సరిహద్దుల్లో సుదీర్ఘకాలంగా నెలకొన్న పరిస్థితులను వెంటనే పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇరుదేశాల ఉమ్మడి ప్రయోజనాల కోసం.. శాంతి సుస్థిరత, అభివృద్ధి కోసం భారత్‌తో ప్రాధాన్యంతో కూడిన దృఢమైన, సుస్థిరమైన సంబంధాలను కొనసాగించాలని కోరుకుంటున్నట్లు పునరుద్ఘాటించింది.

ఆలయం కాదు.. ఆదాయం ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

సీఎస్‌డీఎస్ లోక్‌నీతి ఇదే తరహా సర్వే జరుపగా.. నిరుద్యోగం ముఖ్యమైన అంశమని 11 శాతం మంది మాత్రమే చెప్పారు. ప్రస్తుత సర్వేలో ఈ సంఖ్య 27 శాతానికి పెరిగింది. తమకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని.. సర్వేలో పాల్గొన్న వారిలో 75 శాతం మంది స్పష్టం చేశారు. చదువుకున్న యువతీ యువకులలో చాలామంది నిరుద్యోగం తీవ్రమైన సమస్య అని చెప్పగా, అంతగా చదువుకోని వ్యక్తులు ధరల పెరుగుదలను ముఖ్యమైన అంశంగా పేర్కొన్నారు. మూడింట రెండొంతుల మంది గత ఐదేళ్లతో పోల్చితే ధరలు పెరిగాయని తెలిపారు. ముఖ్యంగా పేదలు, గ్రామీణ ప్రాంత వాసులు దీని గురించి అధికంగా ప్రస్తావించారు. ధరల పెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వాల కన్నా కేంద్రప్రభుత్వమే ఎక్కువ బాధ్యత వహించాల్సి ఉంటుందని సర్వేలో పాల్గొన్న వారిలో పలువురు చెప్పటం గమనార్హం. గత ఐదేళ్లలో తమ జీవితాలు ఎంతోకొంత మెరుగుపడ్డాయని దాదాపు సగం మంది భావించగా, మూడోవంతు మంది మాత్రం తమ జీవితం మరిన్ని సమస్యలతో అధ్వానంగా తయారైందని చెప్పారు. ఆర్థికంగా దిగువశ్రేణిలో ఉన్న ప్రజల్లో ఎక్కువ మంది.. తమ జీవితాల్లో మంచి రోజులు రాలేదని స్పష్టం చేశారు. ఉన్నతాదాయ వర్గాలు, మధ్యతరగతి ప్రజలు ఆదాయం పెరిగిందని, జీవన పరిస్థితులు మెరుగయ్యాయని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమాలు, పథకాల వల్ల సంపన్నులకే మేలు జరిగిందని దాదాపు 8 శాతం మంది అభిప్రాయపడ్డారు. కాగా, సర్వేలో పాల్గొన్నవారిలో కేవలం 8 శాతం మంది మాత్రమే రామమందిరం, అవినీతి అంశాలను ఓటు వేయటానికి అత్యంత ముఖ్యమైన విషయాలుగా పేర్కొన్నారని సీఎస్‌డీఎస్ లోక్‌నీతి తెలిపింది.

కేజ్రీవాల్ పీఎస్‌పై వేటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న కేజ్రీవాల్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ గురువారం డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. తాత్కాలిక నియమకాల విషయంలో కేంద్ర సివిల్ సర్వీస్ మార్గదర్శకాలను ఉల్లంఘించి బిభవ్‌ను వ్యక్తిగత కార్యదర్శిగా నియమించారని తెలిపింది. గతంలో ఆయన ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించారని, నియామకం సమయంలో ఆ విషయాన్ని వెల్లడించకుండా దాచిపెట్టారని ఆరోపించింది. 2007లో నోయిడాలో విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి మహేష్‌పాల్ 'విధులకు ఆటంకం కలిగించారం'టూ బిభవ్‌పై పెట్టిన కేసు పెండింగ్‌లో ఉందని, ఆయనను వ్యక్తిగత కార్యదర్శిగా నియమించే సమయంలో ఈ సమాచారాన్ని వెల్లడించని కారణంగా ఉద్యోగం నుంచి టర్మినేట్ చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో వివరించింది. ఈ మేరకు విజిలెన్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వైవీవీజే రాజశేఖర్ ఆదేశాలు ఇచ్చారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (టెంపరరీ సర్వీసెస్) రూల్స్-1965లోని రూల్-5ను పాటించనందున కాంపెటెంట్ అథారిటీగా తొలగింపు ఉత్తర్వులు ఇస్తున్నట్టు తెలిపారు. కాగా, ఈడీ సోమవారమే బిభవ్ కుమార్‌ను, ఆప్ ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్‌ను లిక్కర్ స్కామ్‌పై ప్రశ్నించింది. అది జరిగిన రెండు రోజులకే బిభవ్‌ను ఉద్యోగం నుంచి తొలగించడం గమనార్హం. మరోవైపు మంగళవారం తిహాడ్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను బిభవ్‌కుమార్ కలిశారు.

బిహార్లో ఎన్డీయేకే ఎదురీత!

తేజస్వి యాదవ్ సారథ్యంలో పుంజుకున్న ఆర్‌జేడీ-కాంగ్రెస్

- ఎన్డీయేకు 10 సీట్లు తగ్గే అవకాశం
- జేడీయూ-నితీశ్ ప్రతిష్ఠకే సవాల్

లోక్‌సభ ఎన్నికల్లో 400 స్థానాలు సాధించాలని బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇదంతా సులభం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా బిహార్లో కూటమి ఎదురీదుతోందని.. ఆర్‌జేడీ నేతృత్వంలోని ఇండియా కూటమి నుంచి గట్టి పోటీ ఇస్తోందని చెబుతున్నారు. రాష్ట్రంలో 40 లోక్‌సభ స్థానాలకు గాను 2019లో ఎన్డీయే (బీజేపీ-17, జేడీయూ-16, ఎల్‌జేపీ-6) 39 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ ఒక చోట విజయం సాధించింది. ఈసారి ఎన్డీయేకి ఏకపక్ష వాతావరణం లేదు. తేజస్వి యాదవ్ నేతృత్వంలో ఇండియా కూటమి గట్టి సవాల్ విసురుతోంది. ఆర్‌జేడీ 26, కాంగ్రెస్ 9, లెఫ్ట్ 5 (సీపీఐ-ఎంఎల్-3, సీపీఐ-1, సీపీఎం-1) చోట్ల పోటీచేయనున్నాయి. గత ఎన్నికల్లో ఆర్‌జేడీ-కాంగ్రెస్ కలిసి పోటీచేసి సుమారు 31% ఓట్లు పొందాయి. లెఫ్ట్ పార్టీలు వేరుగా పోటీచేశాయి. వాటికి 2.2% ఓటుబ్యాంకు ఉంది. మొత్తం కలిపితే 33.2% అవుతుంది. ఎన్డీయే 2019లో 53.25 శాతం ఓట్లు సాధించింది. ఈసారి ఎన్నికల్లో అన్ని ఓట్లు



రాకపోవచ్చని అంటున్నారు. తరచూ కూటములు మారుతున్న సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని జేడీయూపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అయినా జేడీయూకి బీజేపీ 16 స్థానాలు కేటాయించింది. తాను 17 చోట్ల, ఎల్‌జేపీకి 5, హిందూస్థానీ అవాం మోర్చా(హెచ్ఏఎం), ఆర్ఎల్ఎంకు చెరొకటి ఇచ్చింది. ఒకప్పుడు రాష్ట్రంలో ఎన్డీయేకి జేడీయూ సారథ్యం వహించేది. ప్రధాన పోటీ కూడా ఆర్‌జేడీ-జేడీయూ మధ్యే ఉండేది. ఇప్పుడు పగ్గాలు బీజేపీ చేపట్టింది. పోటీ ప్రధాని మోదీ, ఆర్‌జేడీ అగ్ర నేత తేజస్వి నడుమ అన్నట్లుగా మారింది. తేజస్వి సభలకు జనం పెద్దఎత్తున హాజరవుతున్నారు. ఈసారి తాము ఎక్కువ సీట్లు గెలవడం కష్టమేనని జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు నీరజ్‌కుమార్ కూడా అంగీకరించారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం, బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠపై పెద్దఎత్తున బీజేపీ ప్రచారం చేస్తున్నా.. బిహార్‌లో ఇలాంటి భావోద్వేగ అంశాలు ఫలితమివ్వవని ఆ పార్టీ అంతర్గత సర్వేల్లో తేలింది. అయితే బీజేపీకి చిరాగ్ పార్టీ ప్లస్ పాయింట్‌గా మారిందని విశ్లేషకులు అంటున్నారు. అయితే. ఈసారి ఎన్డీయేకు గతంతో పోలిస్తే కనీసం 8-10 స్థానాలు తగ్గవచ్చని బీజేపీ కూడా అంచనా వేస్తోంది.

- సెంట్రల్ డెస్క్

సామాజిక సమీకరణలే కీలకం

అయితే విపక్షాలు, విశ్లేషకుల అంచనాలను జేడీయూ తోసిపుచ్చుతోంది. నితీశ్ ప్రభ కాస్త మసకబారినా.. బిహార్లో సామాజిక సమీకరణలే కీలకమని స్పష్టం చేస్తోంది. ఆర్‌జేడీ ముస్లిం-యాదవ్ కూటమినే నమ్ముకుంది. కాంగ్రెస్ కూడా ఇంతే. లెఫ్ట్ పార్టీల బలం నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉంది. బీజేపీతో ఉన్నా నితీశ్‌కున్న లౌకికవాద ఇమేజ్ చెక్కుచెదరలేదని జేడీయూ నేతలు అంటున్నారు. పైగా రాష్ట్ర జనాభాలో 15% ఉన్న కుర్మీ, కొయిరీ కులాలు ఆయనకు అండగా ఉన్నాయని.. 36% ఉన్న 130కులాల మద్దతు కూడా ఆయనకేనని స్పష్టం చేస్తున్నారు. కులగణనతో నితీశ్ ప్రతిష్ఠ పెరిగిందని.. ఓబీసీలు(27.13%), ఈబీసీల జనాభా ఎంత ఉందో తేల్చారని.. ఈ ప్రకారం నిధుల పంపిణీ చేస్తున్నారని గుర్తుచేస్తున్నారు. ఈబీసీలు, ఎస్సీలు సంపూర్ణంగా ఎన్డీయేకే మద్దతిస్తారని బీజేపీ, జేడీయూ దృఢంగా విశ్వసిస్తున్నాయి.

బీజేపీకి రాజ్‌పుత్‌లు దూరం!

- ఎన్నికల్లో తమకు తగినన్ని టికెట్లు ఇవ్వటం లేదని విమర్శ
- పశ్చిమ యూపీలో పెరుగుతున్న వ్యతిరేకత
- మహాపంచాయత్‌లలో బీజేపీ వ్యతిరేక తీర్మానాలు


న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: దశాబ్దాలుగా బీజేపీకి మద్దతిస్తూ వస్తున్న రాజ్‌పుట్‌లు ఈసారి ఆ పార్టీపై కారాలు మిరియాలు నూరుతున్న విచిత్ర పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా యూపీ, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో రాజ్‌పుత్‌లు ఏకంగా బీజేపీని వ్యతిరేకిస్తూ బహిరంగ సభలు, సమావేశాలు, కుల పంచాయతీలు నిర్వహిస్తున్నారు. పశ్చిమ యూపీలోని సహారన్‌పూర్‌లో ఈ నెల 7వ తేదీన రాజ్‌పుత్‌లు మహా పంచాయత్ నిర్వహించారు. పశ్చిమ యూపీలో తమ జనాభా దాదాపు 10 శాతం ఉన్నప్పటికీ బీజేపీ తమకు కేవలం ఒక్క టికెటే (మొరాదాబాద్) కేటాయించి అవమానించిందని సదరు పంచాయత్‌లో పలువురు రాజ్‌పుత్ నేతలు విరుచుకుపడ్డారు. ఘజియాబాద్ నుంచి ఎంపీగా ఉన్న తమ సామాజికవర్గానికి చెందిన జనరల్ (రిటైర్డ్) వీకే సింగ్‌ను బీజేపీ ఈసారి పక్కనపెట్టి టికెట్‌ను మరొకరికి కేటాయించటంపైనా రాజ్‌పుత్‌లలో తీవ్ర ఆగ్రహం కలిగించింది. పశ్చిమ యూపీలో బీజేపీపై వ్యతిరేకత రాజ్‌పుత్‌లకే పరిమితం కాలేదు. త్యాగి, సైని వంటి ఇతర అగ్రకులాలు కూడా తమకు చాలా తక్కువగా టికెట్లు కేటాయించటంపై ఆగ్రహంతో ఉన్నాయి. అవి కూడా ఇటీవలి కాలంలో మహా పంచాయత్‌లను నిర్వహించి బీజేపీ వ్యతిరేక తీర్మానాలు చేశాయి. మరోవైపు, గుజరాత్‌లో కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలా ఇటీవల దళిత సామాజికవర్గంతో నిర్వహించిన ఓ ఎన్నికల సభలో మాట్లాడుతూ.. రాజులు, మహారాజులు బ్రిటిష్ వారితో లాలూచీ పడ్డారని, వారికి తమ కుమార్తెలను ఇచ్చి వివాహాలు చేశారని, దళితులు మాత్రం ఎన్ని అణిచివేతలు ఎదురైనా విలువలకు కట్టుబడి ఉన్నారని వ్యాఖ్యానించటంపై గుజరాత్‌తోపాటు పలు రాష్ట్రాల్లో రాజ్‌పుత్‌లు భగ్గుమన్నారు. తీవ్ర నిరసన తెలుపుతున్నారు. మంత్రి క్షమాపణ చెప్పినప్పటికీ.. వారు శాంతించటం లేదు. రాజ్‌కోట్ నుంచి రూపాల అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించాలని, లేదంటే బీజేపీని ఓడిస్తామని హెచ్చరిస్తున్నారు. రాజ్‌పుత్‌ల నాయకుడు ఠాకూర్ పూరన్‌సింగ్ దీనిపై స్పందిస్తూ.. 'మా చరిత్రను వక్రీకరించటం, ఆర్థికంగా బలహీన వర్గాలకు ఇచ్చే ప్రోత్సాహకాల్లో మాకు న్యాయం చేయకపోవటం, లోక్‌సభ ఎన్నికల్లో మాకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవటం వంటి అనేక పనులకు బీజేపీ పాల్పడుతోంది. మొత్తంగా రాజ్‌పుత్ సామాజికవర్గాన్నే అణచివేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలోనే బీజేపీకి గుణపాఠం చెప్పాలని మేం నిశ్చయించుకున్నాం' అని తెలిపారు. ఇతర సామాజికవర్గాలు సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నా వారికి ఎంపీ టికెట్ల పరంగా, మంత్రిపదవుల పరంగా ప్రాధాన్యం కల్పిస్తున్నారని, కానీ, తమను ఉద్దేశపూర్వకంగా తొక్కేస్తున్నారని ఆయన ఆరోపించారు. బీజేపీ సంప్రదాయ ఓటు బ్యాంకు అని ఓవైపు మమ్మల్ని భ్రమల్లో ముంచుతూనే మరోవైపు మోసగిస్తున్నారని, కాబట్టే, ఈసారి బీజేపీని ఓడించే పార్టీకే మద్దతివ్వాలని నిర్ణయించామని ఠాకూర్ పూరన్‌సింగ్ తెలిపారు.



ఈ నెల 7న సహరణ్‌పూర్‌లో రాజ్‌పుత్‌ల మహాపంచాయత్(ఫైల్)

ఇజ్రాయెల్‌పై ఏ క్షణాన్నైనా ఇరాన్ దాడి

- అమెరికా, ఇజ్రాయెల్ నిఘా సంస్థల వెల్లడి
- ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామన్న అమెరికా



టెల్‌అవీవ్/న్యూయార్క్, ఏప్రిల్ 11: పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడులతో సిరియాలో తమ కమాండర్లు మృతిచెందడంపై ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్ ఇప్పటికే యుద్ధానికి సిద్ధమని సంకేతాలను వెలువరించింది. ఇరాన్ ఏ క్షణాన్నైనా ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేయవచ్చని అమెరికా, ఇజ్రాయెల్ నిఘా సంస్థలు వెల్లడించినట్లు బ్లూంబెర్గ్ ఓ కథనాన్ని ప్రచురించింది. "ఇజ్రాయెల్ శిక్షను అనుభవించాల్సిందే..! శిక్ష అనుభవించి తీరుతుంది" అని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ బుధవారం ప్రకటించిన విషయం తెలిసిందే..! ఆ వెంటనే గల్ఫ్ ఆఫ్ ఒమాన్, హోర్ముజ్ జలసంధి సమీపంలో ఇరాన్ సైన్యం తమ క్షిపణులను పరీక్షించింది. ఏ క్షణాన్నైనా ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసే ప్రమాదముందని బ్లూంబెర్గ్ తన కథనంలో పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ నిఘా సంస్థల నుంచి అందిన అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు ఈ కథనాన్ని ప్రచురించినట్లు తెలిపింది. ఇరాన్ సుప్రీంలీడర్ ప్రకటనపై ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ తీవ్రంగా స్పందించారు. ఇరాన్ తన భూభాగం నుంచి దాడులను ప్రారంభిస్తే.. తాము కూడా ప్రతిదాడులకు సిద్ధంగా ఉన్నామంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇప్పటికే హమాస్, హిజ్బుల్లా ఉగ్రసంస్థలతో పోరాడుతున్న ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేస్తే.. పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటాయని అంతర్జాతీయ వ్యవహారాల విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హమాస్, హిజ్బుల్లా వంటి ఉగ్ర సంస్థలకు అండదండలు అందిస్తున్నది ఇరాన్ ప్రభుత్వమేనని, ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ కూడా ఆ దేశంపై ముందు నుంచి గుర్రుగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. కాగా.. ఇరాన్ ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కూడా తీవ్రంగా స్పందించారు. "ఇజ్రాయెల్‌కు ఉక్కు కవచంలా రక్షణ కల్పిస్తాం" అని ప్రకటించారు.

అన్నదాతకు చల్లని కబురు!

ఈ ఏడాది ముందే రానున్న నైరుతి రుతుపవనాలు.. క్షీణిస్తున్న ఎల్‌నినో.. జూన్‌కల్లా లానినా పరిస్థితులు

- మంచి వర్షాలు కురుస్తాయని నిపుణుల అంచనా
- 'నైరుతి'పై త్వరలోనే ఐఎండీ తొలి అంచనా విడుదల



విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి చల్లని కబురు... గతేడాది వాతావరణ శాఖ అంచనా వేసిన దానికంటే ఏడు రోజులు ఆలస్యంగా భారత్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ఈ సారి నిర్ణీత తేదీకంటే ముందుగానే రానున్నాయి. ప్రపంచంలో అనేక దేశాల వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపిన సూపర్ ఎల్‌నినో క్షీణత వేగంగా సాగుతుండడంతో.. వచ్చేనెల నాటికి తటస్థ పరిస్థితులు, జూన్‌కల్లా లానినా దశ ప్రారంభమవుతుందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశ వ్యవసాయ రంగానికి మేలు చేసే నైరుతి రుతుపవనాలు నిర్ణీత తేదీకంటే ముందే కేరళలో ప్రవేశించే అవకాశాలున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం పసిఫిక్, హిందూ మహాసముద్రాలలోని వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశిస్తాయని, మంచి వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో లానినా, హిందూ మహాసముద్రంలో ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐవోడీ) పాజిటివ్‌గా మారనుండడం నైరుతి రుతుపవనాలకు అనుకూలమని పేర్కొంటున్నారు. దీంతో దేశంలో అనేక ప్రాంతాల్లో మంచి వర్షాలు కురుస్తాయని వివరించారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదవుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ రెండు రోజుల క్రితం వెల్లడించిన విషయం తెలిసిందే. నైరుతి రాక, వర్షాల తీరుపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) త్వరలో తొలి అంచనా నివేదిక విడుదల చేయనుంది. దానికంటే ముందుగానే కొందరు నిపుణుల సానుకూల విశ్లేషణ వేసవి తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనంగా పేర్కొనవచ్చు.

వర్షాలకు అనువైన వాతావరణం

సాధారణంగా నైరుతి రుతుపవనాలపై పసిఫిక్, హిందూ మహాసముద్రాల్లో నెలకొనే వాతావరణం తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో సాధారణం కంటే ఎక్కువగా ఉన్న ఉపరితల ఉష్ణోగ్రతలు క్రమేపీ చల్లబడుతున్నాయి. వచ్చే నెలకు వేడి మరింత తగ్గి జూన్‌కల్లా చల్లబడతాయి. దీంతో పసిఫిక్ మహాసముద్రంలో లానినా ఏర్పడుతుంది. అదే సమయంలో రానున్న రెండు నెలల్లో హిందూ మహాసముద్రంలో ఐవోడీ పాజిటివ్‌గా మారుతుందని పలు మోడల్స్ అంచనా వేస్తున్నాయి. ఈ రెండింటి ప్రభావంతో జూలై నుంచి సెప్టెంబరు మధ్యకాలంలో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అనువైన వాతావరణం ఏర్పడనుంది. ఈ సమయంలో వరుసగా బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడి మధ్య, వాయవ్య భారతం వైపు పయనిస్తాయి. దీంతో ఇటు బంగాళాఖాతం అటు అరేబియా సముద్రం నుంచి తేమ రావడంతో పశ్చిమ తీరం, దానికి ఆనుకుని వాయువ్య భారతం ఇంకా కోర్ మాన్‌సూన్ ఏరియా (మధ్య భారతం పరిసరాలు)లో ఎక్కువ వర్షాలు కురుస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణం వేడెక్కడంతో దేశంలో అనేక ప్రాంతాలు ఉడుకుతున్నాయి. మరోవైపు వడగాడ్పులు కొనసాగుతున్నాయి. జూన్ వరకు గాడ్పులు, ఎండలు కొనసాగుతాయన్న ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో నిర్ణీత సమయం కంటే ముందే నైరుతి రుతుపవనాల వస్తాయని నిపుణులు అంచనా వేయడం నిజంగా చల్లని కబురే!

త్వరలో నేతలకూ నోటీసులు!

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు వస్తాయా? అనేదానిపైనా అంచనాలు వేస్తున్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేసు కావడంతో.. సాక్ష్యాధారాల విషయంలో అధికారులు పక్కాగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో దర్యాప్తు తీరుపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందజేసిన అధికారులు.. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలకు సిద్ధమవుతారని తెలుస్తోంది. అయితే.. ప్రభుత్వం కూడా ఈ అంశంపై సీరియస్‌గా ఉండడంతో.. దర్యాప్తు అధికారులకు పూర్తిస్వేచ్ఛనిస్తున్నట్లు సమాచారం.

అడిగిన వెంటనే స్పెషల్ పీపీ

ఈ కేసులో న్యాయపరమైన సవాళ్లను అధిగమించడానికి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) అవసరమని ఉన్నతాధికారులు భావించారు. రెగ్యులర్ పీపీ అయితే.. వారికి ఉండే వేర్వేరు



కేసుల ఒత్తిడి నేపథ్యంలో ట్యాపింగ్ కేసు విచారణపై పెద్దగా దృష్టి పెట్టే అవకాశాలుండవు. దీంతో.. స్పెషల్ పీపీ కావాలంటూ ప్రభుత్వాన్ని కోరారు. దర్యాప్తు అధికారుల అభ్యర్థనను వెను వెంటనే పరిశీలించిన ప్రభుత్వం స్పెషల్ పీపీగా సాంబశివారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే పంజాగుట్ట పోలీసులు ఈ కేసు విచారణ జరుగుతున్న నాంపల్లి కోర్టులో స్పెషల్ పీపీ నియామకంపై మెమో దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ జరిగే అవకాశాలున్నాయి.

నేతలకు నోటీసులపై త్వరలో వెల్లడి

- సీపీ శ్రీనివాస్ రెడ్డి

ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తొలిసారిగా స్పందించారు. గురువారం పాతనగరంలోని మీరాలం ఈద్గా వద్ద జరిగిన రంజాన్ ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోన్‌ట్యాపింగ్ అంశంపై మీడియా ఆయనతో మాట్లాడుతూ.. త్వరలో రాజకీయ నాయకులకూ నోటీసులు జారీ చేస్తారట కదా? అని ప్రశ్నించగా.. "ఈ అంశంపై త్వరలో వెల్లడిస్తాం. త్వరలో అన్ని విషయాలను తెలియజేస్తాం" అని సీపీ బదులిచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు పారదర్శకంగా కొనసాగుతోందని, క్రమ పద్ధతిలోనే విచారణ సాగుతోందని చెప్పారు.

నీటి కుట్రలు?



- హైదరాబాద్‌లో సరిపడా నిల్వలున్నా సరఫరా చేయని వైనం
- ట్యాంకులు పొంగిపొర్లుతున్నప్పటికీ.. ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం..!
- కొన్ని ప్రాంతాలకు అధికంగా.. మరికొన్నిచోట్లకు అసలే లేదు
- గంట నుంచి గంటన్నరకు గాను నలభై నిమిషాలతోనే సరి
- జీఎం, డీజీఎం, మేనేజర్ల కనుసన్నల్లో లైన్‌మన్ల ఎత్తుగడలు
- ప్రభుత్వాన్ని బద్‌నాం చేసేందుకు తెరవెనుక ప్రయత్నాలు
- జలమండలికి జలక్ ఇస్తున్నవారిపై విజిలెన్స్ కన్ను

నిరుడు మండు వేసవి నుంచి మొన్నటి ఫిబ్రవరి వరకు హైదరాబాద్ నగర వాసులకు జల మండలి రోజుకు 2,500 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసింది. ప్రస్తుతం 2,610 మిలియన్ లీటర్లను అందిస్తోంది. 110 మిలియన్ లీటర్లు అధికం సరఫరా చేస్తున్నా.. పలు ప్రాంతాలకు అరకొరగానే వస్తున్నాయి.

పలుచోట్ల వచ్చిన నీరు వచ్చినట్లుగా సరఫరా చేయకపోవడంతో ట్యాంకులు నిండిపోయి నీరంతా కిందకు దుముకుతున్నాయి. నాలుగు రోజుల క్రితం దుండిగల్ మల్లంపేట ట్యాంక్‌లోకి చేరిన నీటిని సరఫరా చేయనే లేదు. దాంతో పూర్తిగా నిండిపోయి గంటపైగా వృథాగా పోయాయి.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): .హైదరాబాద్‌లో కృత్రిమ కొరత సృష్టించి జలమండలిని తద్వారా ప్రభుత్వాన్ని బద్‌నాం చేసేందుకు 'నీటి కుట్రలు' పన్నిన్నట్లుగా తెలుస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాలకు సరిపడా నీళ్లున్నప్పటికీ సరఫరా చేయకపోవడం ఈ అనుమానాన్ని బలపరుస్తోంది. వివిధ జలాశయాల నుంచి రోజుకు 2,600 మిలియన్ లీటర్ల నీటిని తీసుకొస్తున్నప్పటికీ లోటు పడుతుండడంతో ఏం జరుగుతోందనే ప్రశ్నలు వస్తున్నాయి. కొందరు లైన్‌మెన్లు రాజకీయ పార్టీలకు పావుగా మారి.. ప్రభుత్వం మారిన నేపథ్యంలో నీటి కష్టాలు మొదలయ్యాయనే ప్రచారానికి ఊతమిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు అధికంగా సరఫరా చేస్తూ కాలనీలు, బస్తీలకు ఇవ్వడం లేదని తెలిసింది. మణికొండ, గచ్చిబౌలి సిద్ధిఖీనగర్, చందానగర్‌లోని కొన్ని చోట్ల, మెహదీపట్నం హిల్ కాలనీ, టోలీచౌకీలోని నదీంకాలనీ, ఎర్రగడ్డ ఇలా పలు ప్రాంతాలకు సక్రమంగా సరఫరా కావడం లేదు. వచ్చినా లో ప్రెజర్ ఉంటోంది. ఈ తంతు కొందరు జీఎంలు, మరికొందరు డీజీఎంలు, పలువురు మేనేజర్ల కనుసన్నల్లోనే సాగుతుందనే ఆరోపణలున్నాయి. ఇటీవల మణికొండ డివిజన్ జీఎంను బదిలీ చేశారు. ఆ స్థానంలో వచ్చిన జీఎంకు ఉద్యోగులెవరూ సహకరించలేదని తెలిసింది. పలు ప్రాంతాలకు సరఫరా కూడా నిలిపివేసి కొత్త తలనొప్పులు సృష్టించినట్లు సమాచారం. ఉన్నత స్థాయి ఒత్తిళ్లు, ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో చివరకు పాత జీఎంను కొనసాగించారు.

ఎవరికి వారిదే ఇష్టారాజ్యం

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని 1.30 కోట్ల జనాభాకు జల మండలి తాగు నీరు సరఫరా చేస్తోంది. భూగర్భ జలాలపై కాకుండా ఆధారపడకుండా వందల కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణా, మంజీరా, గోదావరి జలాలను తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తప్ప సరఫరాకు ఇబ్బందులుండవు. రోజు విడిచి రోజు గంట నుంచి గంటన్నర పాటు సరఫరా చేయాల్సి ఉండగా కొన్ని ప్రాంతాలకు 40 నిమిషాలు కూడా ఇవ్వడం లేదు. ఈ కృత్రిమ కొరతను జల మండలిలోని క్షేత్రస్థాయి ఉద్యోగులే సృష్టిస్తున్నారని విజిలెన్స్ గుర్తించినట్లు సమాచారం. వంద మిలియన్ లీటర్లు అధికంగా సరఫరా చేసినా నీళ్లొస్తలేవనే ఫిర్యాదులపై ఆరా తీయగా అసలు విషయం బయటపడిందని చెబుతున్నారు. వేసవిలో మెరుగ్గా పనిచేసి దాహార్తి తీర్చాల్సిన కొందరు అధికారులు, ఉద్యోగులు అందుకు భిన్నంగా రాజకీయాలు చేస్తున్నారని విజిలెన్స్ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. కాగా, జల మండలిలో 24 ఆపరేషన్ మెయింటెనెన్స్ డివిజన్లున్నాయి. వీటిలో నచ్చిన పోస్టింగ్ కోసం కొందరు జీఎంలు, డీజీఎంలు ఎమ్మెల్యేలకు పూర్తి విధేయులుగా మారారు. మరోవైపు గత ప్రభుత్వంలో తాగునీటి సరఫరా నిర్వహణ సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా తమకు పనికి వచ్చేవారిని కూర్చోబెట్టారు. ఇలా పదేళ్లుగా ఒకేచోట ఉన్నవారు 40 మంది వరకు ఉన్నారు. వీరి బదిలీకి ఉపక్రమించగానే కొందరు ఎమ్మెల్యేలు ఒత్తిళ్లు తెచ్చినట్లు తెలిసింది. ఏళ్ల తరబడి కొనసాగుతున్నవారిని మార్చాలని జలమండలి ఇంజనీర్స్ అసోసియేషన్ సీఎం రేవంత్‌రెడ్డికి రెండు నెలల క్రితం వినతిపత్రం ఇచ్చింది. అయినా ఏ ఒక్కరినీ కదిలించలేదు. ఈ నేపథ్యంలోనే నీటి సరఫరా ఆటంకాలకు కుట్రలు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, పలు ప్రాంతాల్లో పైపులైన్లు లీకవుతూ నీరు వృథాగా పోతున్నా.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వాటర్ బోర్డు ఎండీ సీరియస్ అయ్యే వరకు కొందరు జీఎంలు కదల్లేదు. దీన్నిబట్టే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లైన్‌మెన్లపై అదుపేది?

తాగు నీటి సరఫరాలో క్షేత్రస్థాయిలో లైన్‌మెన్లు కీలకం. వీరిలో చాలా మంది గత ప్రభుత్వంలో నియమితులయ్యారని చెబుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల అనుచరులుగా ఉన్నారని అంటున్నారు. నగరంలో నీటి సరఫరాను పూర్తిగా లైన్‌మెన్లకు వదిలేశారు. పలువురు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నివాసితుల నుంచి ప్రతి నెల డబ్బులు తీసుకుంటున్నచోట అధికంగా ఇస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.

సూర్యాపేట జాతీయ రహదారిపై ప్రమాదాల్లో ఐదుగురి మృతి

- కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు..
- డీసీఎంను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు



నవీన్, సాయితేజ(ఫైల్)

సూర్యాపేట రూరల్, కేతేపల్లి, ఏప్రిల్ 11: సూర్యాపేట జాతీయ రహదారిపై గురువారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు యువకులు దుర్మరణం పాలయ్యారు. నలుగురు గాయపడ్డారు. నల్లగొండ జిల్లా కేతేపల్లికి చెందిన చింతమళ్ల ధనుష్ ఈ నెల 10న సూర్యాపేటలో ఓ కారును అద్దెకు తీసుకున్నాడు. తన స్నేహితులు, కేతేపల్లికి చెందిన జటంగి సాయితేజ(17), అంతటి నవీన్(18), మారగొని మహేష్, గణేష్, శివ, ఉదయ్‌లను గురువారం ఉదయం ఆ కారులో ఎక్కించుకుని సూర్యాపేట వెళ్లాడు. అక్కడి నుంచి అందరూ కలిసి కేతేపల్లికి బయలుదేరారు. అయితే, వీరు ప్రయాణిస్తున్న కారు.. సూర్యాపేట మండలం రాయినిగూడెం శివారులో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై అదుపుతప్పి ఓ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జటంగి సాయితేజ (17), అంతటి నవీన్(18)అక్కడికక్కడే మృతి చెందారు. మారగోని మహేష్, గణేష్, శివకు గాయాలయ్యాయి. కారు నడుపుతున్న చింతమళ్ల ధనుష్, అతని పక్క సీట్లో ఉన్న ఉదయ్ భయంతో ఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు. ప్రమాదం జరిగిన కారులోని స్పీడో మీటర్ 170 కిమీల వద్ద ఆగి ఉండడంతో మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మరో ఘటనలో... సూర్యాపేట జమ్మిగడ్డ ప్రాంతానికి చెందిన నవీద్ (26) తన స్నేహితులైన రాకేశ్ (24), నిఖిల్ రెడ్డి (25), ఆదిత్యలతో కలిసి రంజాన్ పండుగ సందర్భంగా గురువారం రాత్రి భోజనం చేయడానికి తన కారులో బయటకు వచ్చారు. సూర్యాపేట నుంచి జనగామ రోడ్డు వైపు వెళ్తూ ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని వీరు ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన నవీద్, రాకేశ్, నిఖిల్ రెడ్డిలు ప్రమాద స్థలిలోనే చనిపోయారు. ఆదిత్యకు గాయాలయ్యాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాటలు-మర్మాలు

భారతదేశానికి చైనా ఎంతో ముఖ్యమైనదని, ఉభయదేశాల మధ్య స్థిరమైన, శాంతియుత సంబంధాలు నెలకొనాలని, ఆ శాంతి ఈ రెండింటికే కాక, యావత్ ప్రపంచానికి కీలకమైనదని ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యల మీద ఇప్పుడు విస్తృతమైన చర్చ జరుగుతోంది. రెండుదేశాలు ద్వైపాక్షిక చర్చలద్వారా, పరస్పర సహకారంతో సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, వివాదాలను పరిష్కరించుకోవాలని అమెరికాకు చెందిన న్యూస్‌వీక్ మేగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ వ్యాఖ్యానించారు. రెండుదేశాల మధ్య దౌత్య, సైనికస్థాయి చర్చలు జరుగుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తంచేయడంతో ఆగకుండా, మేము సరిహద్దుల్లో శాంతి పునరుద్ధరించి, కొనసాగించగలం అంటూ హామీ ఇవ్వడం చాలామందికి ఆశ్చర్యం కలిగిస్తున్నది. దాదాపు నాలుగేళ్ళుగా వాస్తవాధీనరేఖ రగులుతున్నా, చొరబాట్లు, కుమ్ములాటలు సాగుతున్నా వాటిని గుర్తించేందుకు, అంగీకరించేందుకు, వ్యాఖ్యానించేందుకు సిద్ధపడని ప్రధాని ఇప్పుడు ఉభయదేశాల మధ్య సుదీర్ఘకాలంగా రాజుకుంటున్న వేడి వెంటనే చల్లారాలని, శాంతినెలకొనాలని చెప్పడం విశేషమైన పరిణామమే.

ప్రధాని వ్యాఖ్యలు పేలవంగా, బలహీనంగా ఉన్నాయని కాంగ్రెస్ అంటోంది. ఈ మాటలతో మన చేయి కిందపడేట్టు చేశారని, దురాక్రమించుకున్న భూభాగాల విషయంలో గట్టిగా వాదించడానికి, పట్టుసాధించడానికి చైనాకు మోదీ వ్యాఖ్యలు ఉపకరిస్తాయని కాంగ్రెస్ వాదన. చొరబడిన దేశాన్ని తీవ్రంగా హెచ్చరించడానికి బదులు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలను చల్లార్చేపేరిట దానితో చర్చలకు సిద్ధపడటం పిరికితనంగా కనిపిస్తుందన్నది కాంగ్రెస్ ఉద్దేశం కావచ్చు. మోదీ వ్యాఖ్యలమీద చైనా సానుకూలంగా, ఆచితూచి స్పందించింది. విభేదాల పరిష్కారం విషయంలో భారత్ మాతో కలిసివస్తుందని ఆశిస్తున్నామని పేర్కొంది. ఉభయదేశాల దౌత్య సంబంధాలంటే సరిహద్దులు ఒక్కటే కాదని చైనా అంత ప్రత్యేకంగా ఎందుకు అన్నదో తెలియదుకానీ, ఈ ఇంటర్వ్యూ ద్వారా మోదీ చైనాకు ఒక సానుకూల సందేశాన్నయితే ఇవ్వదల్చుకున్నట్టు ఉంది. తాను మళ్ళీ అధికారంలోకి వస్తే చైనాతో చక్కగా వ్యవహరిస్తానని, ఉద్రిక్తతలు తగ్గిస్తానని ఆయన హామీ ఇస్తున్నారు. అమెరికాతో చర్చలు పునరుద్ధరించుకొని, యూరప్, రష్యాలతోనూ సన్నిహితంగా ఉంటున్న చైనాతో భారతదేశం కూడా ఇకపై చక్కగా వ్యవహరిస్తుందేమో! 2020 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లోని గాల్వాన్ లోయలో తీవ్రమైన ఘర్షణలు చోటుచేసుకున్నప్పటినుంచి ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ మోదీ చైనా ఊసెత్తలేదు. ఆయన మంత్రులు మాత్రం అతిజాగ్రత్తగా, చిన్నచిన్న విమర్శలు చేస్తుంటారు. ఎల్ఏసీ దగ్గర సైన్యాన్ని పెద్ద ఎత్తున మోహరించి ఒప్పందాలను చైనా ఉల్లంఘిస్తున్నదని ఇటీవల విదేశాంగమంత్రి ఓ మాటన్నారు. గత ఏడేళ్ళలో నాలుగోసారి అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలకు చైనా తన పేర్లుపెట్టిన తరువాత మన రక్షణమంత్రి ఓ ఎన్నికల సభలో మాట్లాడుతూ మేమూ ఇలాగే చేస్తే ఎలా ఉంటుంది అని ప్రశ్నించారు. మోదీ అధికారంలో ఉన్నంత కాలం భారతభూభాగాన్ని చైనా ఒక్క అంగుళం కూడా ఆక్రమించుకోలేదని అమిత్ షా పాతపాటే పాడారు. భారతభూభాగాల్లోకి చైనా చొరబడిందని, అయా ప్రాంతాల్లో తన సైనికులను మోహరించి, స్థావరాలు కడుతున్నదని స్థానికులు, సైనికులు చెబుతున్నప్పటికీ ప్రభుత్వం దానిని కొట్టిపారేస్తున్నది. కేవలం గాల్వాన్ ఘటనలోనే దాదాపు వెయ్యి చ.కి. భూభాగాన్ని భారత్ కోల్పోయిందన్న వాదనలున్నాయి. గతంలో మన గస్తీలో ఉన్న ప్రాంతాలు ఇప్పుడు దాని వశమైనాయన్న విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో 21 రౌండ్ల కమాండర్ చర్చలు చైనాను వెనక్కునెట్టిందేమీ లేదు. అమెరికా–చైనా మధ్య ఈ నెల ఆరంభం నుంచి ఎడతెగకుండా చర్చలు సాగుతున్న నేపథ్యంలో, చైనాతో భారత్ సత్సంబంధాల గురించి ప్రధాని మోదీ మాట్లాడి ఉండవచ్చు. అమెరికా, చైనా అధ్యక్షుల టెలిఫోన్ చర్చల తరువాత, అమెరికా మంత్రులు వరుసపెట్టి చైనా పర్యటనలు చేస్తున్నారు. ఉక్రెయిన్ యుద్ధం, ఆర్థిక ఆంక్షలు రష్యాను ఏ మాత్రం బలహీనపరచకపోగా ఉత్తరకొరియా, చైనా, ఇరాన్ తదితర దేశాల సాయంతో అది మరింత ఎక్కువగా రెచ్చిపోతున్నది. మరోపక్క గాజాయుద్ధం ఎడతెగకుండా సాగుతూ, చాలా దేశాలను చుట్టబెడుతూ బైడెన్‌కు ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. ఈ నేపథ్యంలో చైనాతో సానుకూలంగా వ్యవహరించడం అమెరికాకు అవసరం, దానిని అనుసరించడం మనకు క్షేమమని పాలకులు భావిస్తున్నట్టుంది.

మన నగరాల జల భవితవ్యం



■ సునీతా నారాయణ్


మట్టివాసన


ప్రకృతి శాపం కానేకాదు, మానవ తప్పిదాల ఫలితమే బెంగళూరు జల సంక్షోభం. ఈ కఠోర వాస్తవాన్నే ఇదే కాలమ్‌లో క్రితంసారి ('బెంగళూరు 'జల' పాఠాలు'లో) నేను స్పష్టంగా చెప్పాను. ఆ నగర నీటి సరఫరా నిర్వహణకు బాధ్యత వహిస్తున్న పౌర, ఇంజినీరింగ్ అధికారులు పెట్టుబడి సాంద్ర–నీటి వనరుల సాంద్ర విధానాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఫలితంగా నగర ప్రజలకు నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగించడం అసాధ్యమైపోయింది. పైగా మురికి నీటి పారుదల వ్యవస్థ నిర్వహణ అసమర్థంగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే అది యోగ్యమైన రీతిలో లేదు. దీనికి తోడు వాతావరణ మార్పు ప్రభావాలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. వర్షపాతం సమరీతిలో ఉండటం లేదు. అతివృష్టి ఘటనలు పెచ్చరిల్లుతున్నాయి. మరి మార్గాంతరమేమిటి?

బెంగళూరుకు, ఆ మాట కొస్తే మన నగరాలు అన్నిటికీ నీటిభద్రత సమృద్ధిగా ఉండే భవిష్యత్తును సమకూర్చాలంటే నీటి సరఫరా తక్కువ వ్యయంతో కూడుకున్నదిగా ఉండితీరాలి. అప్పుడే అది నిరంతరాయంగా నిర్వహించదగిన విధంగా ఉంటుంది. బెంగళూరు విషయానికి వస్తే ఆ నగరానికి, 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కావేరీ నది నుంచి నీటిని తోడి, రవాణా చేస్తున్నారు. దూరా భారం వ్యయభరితం కాదూ? భారీ వ్యయానికి మించిన సమస్య రవాణాలో నీరు లీక్ అవడం. కావేరీ నది నుంచి బెంగళూరు నగరానికి జరుగుతున్న నీటి రవాణాలో 50 శాతం నీరు వృథా అవుతున్నది మరి! నీటి సరఫరాకు బాధ్యత వహిస్తున్న ప్రభుత్వ సంస్థలు కొత్త పైప్‌లైన్స్‌ను నిర్మించలేక పోతున్నాయి. నీటి ధర అధికంగా ఉండడం వల్ల ట్యాంకర్ల ద్వారా సరఫరా, గొట్టపు బావుల నిర్మాణం మొదలైన ప్రత్యామ్నాయాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. బెంగళూరు నగరంలో జరుగుతున్న నీటి సరఫరాలో సగం నీరు ఆ నగర భూగర్భ జలాశయాల నుంచి వస్తున్నట్టు అంచనా.

సమస్యేమిటంటే భూ గర్భ జలాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. నీటి సరఫరా, మురుగు నీటి పారుదల వ్యవస్థల వినియోగాన్ని లెక్కించడం లేదు. ఎందుకంటే దాని సరఫరాపై వాటికి ఎటువంటి నియంత్రణ లేకపోవడమే ఆ అలక్ష్యానికి కారణం. జరుగుతోన్న నీటి సరఫరాలో ఏ మేరకు భూగర్భ జల వనరుల నుంచి జరుగుతుందన్న విషయమై వాటికి ఎటువంటి అంచనా కూడా ఉండడం లేదు అయితే 'అధికారికం'గా ఆ నీటినీ సరఫరా చేస్తున్నారు. దానికి ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారు! మరి వినియోగించుకుంటున్న భూగర్భ జలాల పరిమాణాన్ని అంచనా వేయడం ఎలా? ఒకే ఒక్క మార్గం ఉన్నది. నగరంలో నీటి డిమాండ్‌ను అంచనావేయడమే. దీన్ని తలసరి ప్రాతిపదికన అంచనా వేయాలి. నగరంలోని విభిన్న వర్గాలకు చెందిన ప్రతి వ్యక్తి వినియోగ అవసరాల ప్రాతిపదికన నీటి పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఢిల్లీ, బెంగళూరు నగరాలలో తలసరిన 150 లీటర్ల నీటిని సరఫరా చేయాలని నిపుణులు సిఫారసు చేశారు. సరే, లీకేజీ వల్ల జరిగే వృథాను దృష్టిలో ఉంచుకుని సిఫారసు చేసిన పరిమాణానికి 15 శాతం అధికంగా నీరు సరఫరా చేయడం ఉత్తమం. మరి 'అధికారిక సరఫరా', డిమాండ్ మధ్య అంతరాన్ని భర్తీ చేస్తున్న నీరు భూగర్భ జల వనరుల నుంచి వస్తున్నట్టుగా భావిస్తున్నారు అయితే ఈ నీటి వినియోగాన్ని తరచు తక్కువగా అంచనా వేస్తున్నారు. తోడి, సరఫరా చేయడంలో సంభవిస్తున్న నష్టాలను లెక్కించడం లేదు బెంగళూరు నగరంలో 'అధికారిక సరఫరా', డిమాండ్‌కు మధ్య అంతరం 50శాతంగా ఉన్నట్టు అంచనా. లీకేజీని పరిగణనలోకి తీసుకుంటే ఆ అంతరం 60 నుంచి 70 శాతం మేరకు ఉండవచ్చని భావించడం సముచితంగా ఉంటుంది. నగర నీటి సరఫరా వ్యవస్థ నిర్వాహకులు భూగర్భ జలాశయాలను తాగునీటికి కీలక వనరులుగా అంగీకరించి, వాటిని నగరానికి సుస్థిర నీటి భద్రతను సమకూర్చే సదుపాయాలలో భాగంగా చేస్తే పరిస్థితిలో మౌలిక మార్పు ఖాయంగా వస్తుంది. మరి భూగర్భ జలాలను నిరంతరాయంగా ఉపయోగించకోవడమెలా? ఇదీ ఇప్పుడు మనముందున్న ప్రశ్న. వర్షపు నీటి ద్వారా భూగర్భ జలాశయాలను పునశ్శక్తిమంతం చేయడమే ఆ ప్రశ్నకు సమాధానం. సరస్సులు లేని నగరం ఏదైనా ఉన్నదా? అయితే సరస్సుల సంరక్షణ అనేది నగరాల సుందరీకరణకు కాకుండా ఒక ప్రాథమిక అవసరంగా భావించి తీరాలి. వాస్తవమేమిటంటే సరస్సులు, తటాకాలు మొదలైనవి నగరాలలో వర్షపు నీటిని నిల్వ చేస్తున్నాయి. తద్వారా భూగర్భ జలాశయాలను పునశ్శక్తిమంతం చేస్తున్నాయి. నీటి కాటకం కాలంలో భూగర్భ జలాలే నీటి అవసరాలకు ఆసరా అవుతున్నాయి. వాతావరణ మార్పు ప్రభావంతో తరచు అతివృష్టి సంభవించడం సాధారణమైపోయింది. నగరాలు ఈ వాననీటి వెల్లువను కాల్వలలోకి పారించాలి. ఇదే గనుక చేస్తే భూగర్భ జలాశయాలు పునశ్శక్తిమంతం కావడానికి విశేషంగా దోహదం జరుగుతుంది. తత్ఫలితంగా సుదీర్ఘ నీటి కాటకాన్ని సమర్థంగా ఎదర్కోగలగడం సుసాధ్యమవుతుంది.

బెంగళూరు నగరం చాలా దశాబ్దాలుగా తన సరస్సుల వ్యవస్థను కాపాడుకునేందుకు తీవ్ర పోరాటమే చేస్తున్నది. అయితే రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు, కాలుష్య భూతాల కారణంగా ఆ పోరాటం సఫలమవడం లేదు. గ్రేటర్ బెంగళూరు పరిధిలో 189 సరస్సులు ఉన్నాయని, ఈ సరస్సులనే కాకుండా వాటి ఆరగాణి ప్రాంతాలను మురుగు నీటి పారుదల వ్యవస్థను సైతం పరిరక్షించవలసిన అవసరమున్నదని 2011లో రాష్ట్ర హై కోర్టుకు సమర్పించిన ఒక నివేదిక స్పష్టం చేసింది. అయితే ఈ నివేదిక కార్యరూపం ధరించలేదు. సరస్సులను సంరక్షించడం ఎలా సాధ్యమవుతుంది? నగరాల జల సంబంధిత భవిష్యత్తులో భాగమయితే ఆ జల రాశులు తప్పక సంక్షించబడతాయి. 100 కిలో మీటర్ల దూరంలో ఉన్న కావేరీ నది నుంచి నీటిని తోడి బెంగళూరుకు రవాణా చేసి నగర నీటి అవసరాలను తప్పక తీర్చగలుగుతామనే భ్రాంతి





> బెంగళూరుకు, ఆ మాట కొస్తే మన నగరాలు అన్నిటికీ నీటిభద్రత సమృద్ధిగా ఉండే భవిష్యత్తును సమకూర్చాలంటే నీటి సరఫరా తక్కువ వ్యయంతో కూడుకున్నదిగా ఉండితీరాలి. అప్పుడే అది నిరంతరాయంగా నిర్వహించదగిన విధంగా ఉంటుంది. భూగర్భ జలాశయాలను తాగునీటికి కీలక వనరులుగా అంగీకరించాలి. వాటిని నగరానికి సుస్థిర నీటి భద్రతను సమకూర్చే సదుపాయాలలో భాగంగా చేస్తే పరిస్థితిలో మౌలిక మార్పు ఖాయంగా వస్తుంది.

లేనట్టయితే స్థానిక జల వ్యవస్థలను బెంగళూరు అధికారులు సంరక్షించి వుండేవారు.

అలా చేసి ఉన్నట్టయితే ఆ చిన్న చిన్న జల రాశులు నగర నీటి సరఫరా వ్యవస్థలో భాగమయి వుండేవి. నీటి సరఫరా వ్యయం తగ్గి ఉండేది. నీరు చౌకగా అందరికీ అందుబాటులో ఉండి ఉండేది. ఇందుకు మురుగునీటి పారుదల వ్యవస్థ తీరుతెన్నులను మార్చివేయవలసి ఉన్నది. అప్పుడు వ్యర్థ జలాలను స్థానికంగా నిలిపివేసి శుద్ధి కేంద్రాలకు పంపి, సరస్సు జలాలను పునశ్శక్తిమంతం చేసేందుకు ఉపయోగించడం జరిగేది.

వాస్తవమేమిటంటే మురుగు నీరుగా మనకు సమకూరుతున్న ఆ నీటిలో 80 శాతాన్ని సరైన విధంగా ఉపయోగించుకోకుండా విసర్జిస్తున్నాం. సుదూర ప్రాంతాల నుంచి రవాణా చేస్తున్న నీటి కంటే ఈ నీరే మరింత పదిలమైనది. ఈ కారణంగానే వ్యర్థ జలాలకు కీలక ప్రాధాన్యమున్నదని స్పష్టం చేశాను. మరి మన నగర మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ వాస్తవాన్ని ఎప్పుడు గుర్తిస్తారు? అందుకు వారి ఆలోచనా ధోరణి మారవలసి ఉన్నది. అది జరిగే లోగా మనం ఎన్నో నీటి కరువులను చవిచూడాల్సి ఉన్నదనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

అస్తిత్వం కోసమే లద్దాఖ్ ఆదివాసీల పోరు







జమ్మూ, కశ్మీర్ దశాబ్దాలుగా అనుభవిస్తున్న పాక్షిక స్వతంత్రప్రతిపత్తిని, రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని కేంద్రప్రభుత్వం 2019 ఆగస్టులో రద్దు చేసింది. కశ్మీర్‌లోని కార్గిల్, లేహ్ సహా కొన్నిప్రాంతాలను లద్దాఖ్‌తో కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించింది. కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ రాజకీయ నిర్ణయం చట్టరూపం పొందినప్పుడు జమ్మూ, కశ్మీర్ పాలన నుంచి విముక్తి లభించినందుకు లద్దాఖ్, లేహ్, కార్గిల్ ప్రజలు ఎంతో సంతోషించారు. అప్పటివరకు ఉన్న ప్రభుత్వాలు తమ ఆకాంక్షలను సరిగా పట్టించుకోకపోవడమే కాక ఎందులోనూ తమకు సరైన ప్రాతినిధ్యం సైతం కల్పించలేదనే అసంతృప్తి వారిలో ఉండేది. ఆ ప్రాంతాల్లోని బౌద్ధ మతస్థులు కూడ తమకు సాంస్కృతికంగా తగినంత స్వేచ్ఛ ఉండేదికాదని, బౌద్ధసంప్రదాయాలకు అనుగుణంగా జీవించలేకపోయామనే అభిప్రాయంతో ఉండేవారు. కేంద్రం నిర్ణయం కారణంగా లద్దాఖ్ వాసులు భారతీయజనతా పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించి తమ సంతోషాన్ని చాటుకున్నారు.

కానీ లద్దాఖ్ ప్రాంత ప్రజల సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు. తమపై ఢిల్లీ పెత్తనం కొనసాగుతోందని తెలియడానికి వాళ్లకు ఎంతోకాలం పట్టలేదు. క్షేత్రస్థాయిలో వాటి ఫలితాలు వీక్షించిన ప్రజలు ఖిన్నులయ్యారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కానీ, స్థానిక ఎంపీ కానీ తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రయత్నమే చేయడం లేదని, బీజేపీ తన ప్రత్యేక ఆజెండాను అమలుపరచడానికే చూస్తోందని ఏడాది తిరగకముందే తేటతెల్లం కావడంతో వాళ్లలో అసంతృప్తి రగులుకుంది. అయితే కేంద్రప్రభుత్వానిది హిందుత్వ అజెండా అనే విషయం మాత్రం వాళ్ళకు ఒకపట్టాన అర్థంకాలేదు. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన కొద్దిరోజుల్లోనే స్థానికభాషలను పక్కకు నెట్టి హిందీ, సంస్కృత భాషలను బలవంతంగా రుద్దే ప్రయత్నం జరిగింది. ఆ ప్రాంతంలో చాలా సంస్థల పేర్లు సింధూతో మొదలవుతాయి. కేంద్రం వాటన్నింటిని హిందీలోకి మార్చేసింది. స్థానికపేర్లతో ఉన్న ఆసుపత్రులను ఆరోగ్యమందిరాలుగా మార్చింది. ఈ చర్యలను ముస్లింలు, బౌద్ధులు తీవ్రంగా వ్యతిరేకించారు.

లద్దాఖ్‌లో బౌద్ధమతస్థుల సంఖ్య ఎక్కువ. ముస్లింలు ఉన్నా వారి జనాభా తక్కువ. లేహ్ ప్రాంతంలో 67 శాతం మంది ఆదివాసీలు ఉంటారు. జంస్కర్ ప్రాంతంలో 99 శాతం మంది వివిధ తెగలకు చెందిన వారే. ఈ మూడుప్రాంతాల్లో కలిపి పదిహేను ఆదివాసీ తెగలు నివసిస్తున్నాయి. అందులో ప్రధానంగా బాల్టి, బోటా, బ్రోక్పా, షిన్, గార్రా, మోన్, ద్రోక్పా తెగలు చిన్నచిన్న ఆవాసాలలో కొండచరియల్లో నివసిస్తాయి. వాళ్ళది ప్రత్యేకమైన జీవనవిధానం. ఎక్కువ ఉన్ని ఇచ్చే ప్రత్యేకమైన గొర్రెజాతులను అక్కడి ప్రజలు పెంచుతారు. వాటితోనే వాళ్ళ జీవనవిధానం ముడిపడి ఉంటుంది. ఆ గొర్రెలమందలతో వాళ్ళు సంచరించే భూములను పరిశ్రమలకు కేటాయించడంతో ఆయా తెగల ప్రజల్లో ఆందోళన మొదలైంది.

తమ ప్రాంతాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ సైన్యాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించినవే నన్న సంగతి కూడ ప్రజలకు బోధపడింది. కేంద్రం అక్కడ 750 కి.మీ మేర రోడ్ల నిర్మాణంతో పాటు సైనికుల రవాణా కోసం ఇదివరకే ఉన్న బ్రిడ్జిలకు అదనంగా 29 కొత్తబ్రిడ్జిల నిర్మాణాన్ని ప్రారంభించింది. 39 హెలీప్యాడ్ల నిర్మాణానికి ఏర్పాట్లు సాగిస్తోంది. హరితఇంధనం (గ్రీన్‌ఎనర్జీ) పేరిట రూ. 20వేల కోట్లతో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు ప్రకటించింది. కేంద్రం ఒక్క లద్దాఖ్‌లోనే దాదాపు 15 వేల ఎకరాల భూమిని రకరకాల ప్రాజెక్టుల కోసం కేటాయించింది. ఆ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి పరచడంపై దృష్టి సారించి కొత్త రవాణాసౌకర్యాలు కల్పిస్తూ, ఆధునిక గృహసముదాయాలు, హోటళ్ళు నిర్మిస్తోంది. కొండలమయమైన ఈ ప్రాంతాలన్నీ మంచుతో కప్పబడి ఉంటాయి. మంచు కరిగి ప్రవహించే నదులలోని నీటినే అక్కడి ప్రజలు తాగడానికి, దైనందిన కార్యక్రమాలకు వినియోగిస్తుంటారు. పర్యాటకుల సంఖ్య పెరగడంతో వాళ్లకు నీటి కొరత మొదలైంది. కేంద్రపాలిత ప్రాంతమయ్యాక తాము సంప్రదాయికంగా అనుభవించే భూముల మీద హక్కు కోల్పోతామనే విషయాన్ని స్థానికతెగలు గ్రహించాయి. చాలామంది పారిశ్రామికవేత్తలు పోటీలుపడి ఆ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చారు. వారితో పాటు సాంకేతికంగా, ఇతరత్రా నైపుణ్యం కలిగిన ఉద్యోగుల్ని బయటనుంచి తెచ్చుకుంటున్నారు. చివరకు సాధారణస్థాయి కార్మికులను కూడా ఇతరప్రాంతాల నుంచి రప్పించుకుంటున్నారు. స్థానికప్రజలకు అభివృద్ధిలో భాగస్వామ్యం మాట అటుంచి కనీసం కూలిపనులు కూడా దొరకడం దుర్లభమైంది.

ఈ పరిస్థితి తమ అస్థిత్వాన్నే నాశనం చేస్తుందనే కలవరం లద్దాఖ్ వాసుల్లో పెరిగిపోయింది. సరిగ్గా అదే తరుణంలో జరిగిన షెడ్యూలుకులాల, షెడ్యూలు తెగల కమిషన్ సమావేశం లద్దాఖ్‌లోని పరిస్థితులను సమీక్షించి, అక్కడి ప్రజల సంప్రదాయహక్కులకు భంగం వాటిల్లుతోందని, వాళ్ళ హక్కుల పునరుద్ధరణకు వీలుగా ఆ ప్రాంతాలను రాజ్యాంగంలోని ఐదు లేదా ఆరో షెడ్యూల్లో చేర్చాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేసింది. భీతావహులై ఉన్న లద్దాఖ్ ప్రజలకు ఈ తీర్మానం మనోధైర్యాన్ని, బలాన్నీ చేకూర్చింది. మాజీ పార్లమెంట్ సభ్యుడు థుప్‌స్తాన్ చేవాంగ్ నేతృత్వంలో ఏర్పడ్డ 'లేహ్ శిఖరాగ్ర అభివృద్ధి సమితి', అంతకు మునుపు నుంచే ప్రజల సమస్యలపై పనిచేస్తున్న 'కార్గిల్ డెమొక్రాటిక్ అలయన్స్' సంస్థలు ప్రజలను ఒకతాటిపైకి తెచ్చే ప్రయత్నం మొదలెట్టాయి. కార్గిల్ డెమొక్రాటిక్ అలయన్స్‌లో అన్ని రాజకీయపార్టీలవాళ్లు సభ్యులుగా ఉన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త, రామన్ మెగసెసె అవార్డుగ్రహీత సోనమ్ వాంగ్‌చుక్ జనవరిలో ఐదురోజుల నిరాహారదీక్ష చేశారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన విధ్వంసకర అభివృద్ధి ప్రాజెక్టులు లద్దాఖ్‌లోని సున్నితమైన పర్యావరణాన్ని, విచ్ఛిన్నం చేస్తాయంటూ ప్రాంతాన్ని రాజ్యాంగం ఆరో షెడ్యూల్లో చేర్చాలనే డిమాండును ఆయన ముందుకు తెచ్చారు. దాంతో అన్నిప్రాంతాలలో నిరసనలు మొదలయ్యాయి. తరువాత ఉద్యమానికి సారథ్యం వహించిన మాజీ ఎంపీ థుప్‌స్తాన్ చేవాంగ్, తమ ప్రజలు గొంతెమ్మ కోరికలేవీ కోరడం లేదని, రాజ్యాంగబద్ధమైన హక్కునే పరిరక్షించమంటున్నారని స్పష్టం చేశారు.

ఫిబ్రవరి ఒకటోతేదీన వాంగ్‌చుక్ సారథ్యంలో లేహ్ పట్టణంలో జరిగిన పెద్దబహిరంగసభకు 8 డిగ్రీల చలిలో కూడా ముప్పైవేలమంది ప్రజలు హాజరయ్యారు. లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చడంతో పాటు పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన అనుమతులను రద్దుచేయాలని, స్థానిక యువకులకు ఉద్యోగాలలో ప్రాధాన్యమివ్వాలని, ఉద్యోగ నియామకాల కోసం పబ్లిక్‌సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఈ సభ తీర్మానించింది. కార్గిల్, లేహ్ ప్రాంతాలకు ఒక్కొక్క పార్లమెంట్ స్థానం మంజూరు చేయాలనే అంశాన్ని కూడా ఈ తీర్మానంలో చేర్చారు. ఆ ప్రాంతంలో ప్రస్తుతం 144వ సెక్షన్ అమలులో ఉంది. వైఫై, ఇంటర్‌నెట్ ప్రసారాలు నిలిపివేశారు. ప్రభుత్వం ఎంతగా నిర్బంధవిధానాలు అనుసరిస్తున్నా ప్రజలు నిగ్రహంతో ప్రజాస్వామిక పద్ధతుల్లో ఆందోళన కొనసాగిస్తున్నారు. వాంగ్‌చుక్ చైనాసరిహద్దుల వరకు ప్రారంభించిన 24 రోజుల పాదయాత్రను 21 రోజునే ముగించారు. ప్రభుత్వానికి, రక్షణదళాలకు ఇబ్బంది కలిగించడం, ఘర్షణ వాతావరణం సృష్టించడం తమ అభిమతం కాదని, అందుకే సంయమనం పాటిస్తూ పాదయాత్ర విరమిస్తున్నామని ఆయన వివరించారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు ఆందోళన ప్రజాస్వామికంగా, గాంధేయపద్ధతుల్లో కొనసాగుతుందని నాయకులు ప్రకటించారు. గాంధీలాగా 21 రోజుల నిరాహారదీక్ష చేస్తానని వాంగ్‌చుక్ ప్రకటించారు.

'ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టడం మా ఉద్దేశ్యం కాదు, మా పర్యావరణం విధ్వంసమవుతోంది. మా ఆదివాసీ, సంచారజాతుల జీవనోపాధి దెబ్బతింటోంది. మా భూములను పారిశ్రామికవేత్తలకు అప్పచెబుతున్నారు. ఈ విధ్వంసకర అభివృద్ధి మాకు వద్దే వద్దు. మా స్వయంనిర్ణయహక్కును పునరుద్ధరిస్తే ఎలాంటి అభివృద్ధి కావాలో మేమే పథకాలు రచించుకుంటాం' అని లద్దాఖ్ ప్రజలు అంటున్నారు. జమ్మూ, కశ్మీర్ పూర్తిగా కేంద్రప్రభుత్వం అజమాయిషీలోకి వచ్చిన తరువాత ఒక్క సంవత్సర కాలంలోనే 185 మంది వెలుపలి వ్యక్తులు కశ్మీర్‌లో భూములు కొన్నారు. అదే రీతిలో తమ భూములు కూడా పరాయివాళ్ళ చేతుల్లోకి పోతాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

> 'ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టడం మా ఉద్దేశం కాదు, మా పర్యావరణం విధ్వంసమవుతోంది. మా ఆదివాసీ, సంచారజాతుల జీవనోపాధి దెబ్బతింటోంది. మా భూములను పారిశ్రామికవేత్తలకు అప్పచెబుతున్నారు. ఈ విధ్వంసకర అభివృద్ధి మాకు వద్దే వద్దు. మా స్వయంనిర్ణయ హక్కును పునరుద్ధరిస్తే ఎలాంటి అభివృద్ధి కావాలో మేమే పథకాలు రచించుకుంటాం' అని లద్దాఖ్ ప్రజలు అంటున్నారు. జమ్మూ, కశ్మీర్ పూర్తిగా కేంద్రప్రభుత్వం అజమాయిషీలోకి వచ్చిన తరువాత ఒక్క సంవత్సర కాలంలోనే 185 మంది వెలుపలి వ్యక్తులు కశ్మీర్‌లో భూములు కొన్నారు. అదే రీతిలో తమ భూములు కూడా పరాయివాళ్ళ చేతుల్లోకి పోతాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం నాలుగుసార్లు చర్చలకు పిలవగా లద్దాఖ్‌లోని అన్నివర్గాలకు చెందిన 14 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతిసారీ హోంమంత్రి అమిత్‌షా, అన్ని రక్షణలు కల్పిస్తామని, ప్రభుత్వం తరఫున ఒక కమిటీని వేస్తామని, దాని సమ్మతితోనే ఏ అభివృద్ధి కార్యక్రమమైనా జరుగుతుందనే హామీ ఇస్తామనీ అంటున్నారు.

లద్దాఖ్ ప్రజలకు సంఘీభావంగా, దేశంలో అనేక చోట్ల నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. గత వారం హైదరాబాద్‌లో కూడా ఒక సభ జరిగింది. లద్దాఖ్ ప్రజల సమస్యలను పరిష్కరించి వారి ఆకాంక్షలను నెరవేర్చితీరాలని ప్రజాస్వామికవాదులందరూ ప్రస్తుత ఎన్నికల సమయంలో ఎలుగెత్తి చాటితే తప్ప కేంద్రం మాట వినదు. కలిసికట్టుగా అందరం ఆ పని చేద్దాం.

• యస్. జీవన్‌కుమార్
మానవహక్కుల వేదిక

అరుదైన ప్రతిభామూర్తి

ఉత్తరాంధ్ర సాహిత్యం, సంగీత వారసత్వాన్ని ప్రవాసాంధ్రలోనే కాక, ఖండాంతరాలలో చాటి చెప్పిన డా. పప్పు వేణుగోపాలరావు ఆకస్మిక మరణం ఆవేదనకు గురిచేసింది. శ్రీకాకుళ సాయుధ పోరాటానికి పురిటిగడ్డ అయిన పార్వతీపురంలో ఆయన జన్మించారు. కళాశాల విద్య పార్వతీపురం, విజయనగరంలో అభ్యసించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగు చదువుకున్నారు. చిన్నతనం నుంచి పాండితీ ప్రకర్షతో పెద్దల మన్ననలందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత (మణి ప్రవాళం) జాతీయాచార్యులు ఎస్వీ జోగారావు పర్యవేక్షణలో ఎం.ఫిల్ చేశారు.

మిసెస్ ఎ.వి.ఎన్ కళాశాలలో మూడేళ్లపాటు అధ్యాపకునిగా పనిచేశారు. 1980లో మద్రాసులోని 'అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్‌'లో ఉద్యోగంలో చేరారు. ఆయన భార్య రావాడ జయ ఆచార్య ఎస్వీ జోగారావు మేనకోడలు. శిష్యునిగా, బంధువుగా వేణుగోపాలరావును పుత్రవాత్సల్యంతో ఆదరించి ప్రోత్సహించే వారు జోగారావు.



"నేనెంతో భక్తితో పరిశోధన చేసిన యక్షగాన వాఙ్మయాన్ని నువ్వే ఆంగ్లంలోకి అనువదించగల ప్రజ్ఞావంతుడివి" అని ఆచార్య జోగారావు తరచూ వేణుగోపాలరావుతో అంటుండేవారు. ఏమి చిత్రమో? విధివిలాసం... పప్పు వేణుగోపాలరావు తన చివరి రచన 'మోనోగ్రాఫ్ ఆన్ యక్షగాన' ఇటీవలే ఆవిష్కరణ జరిగింది. భవిష్యవాణి తెలిసినట్లుగా, వేణుగోపాలరావు ఆ పుస్తకంలోని తన మాటలో "బహుశా! ఇదే నా చివరి రచన" అంటూ మొదటి వాక్యంలోనే రాశారు. ఆవిష్కరణ జరిగిన పదిరోజులలో ఆయన మరణించడం, బంధువులు, శ్రేయోభిలాషులు, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

గొప్ప సాహిత్య, సంగీత అవధాన విద్వత్తు కలిగిన వేణుగోపాలరావు వందలాదిగా అభిమానులను సంపాదించుకున్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత విద్వత్ సంపద కలిగినా, ఎదుటివారిలో ఏ మాత్రం ప్రతిభ ఉన్నా, గుర్తించి గౌరవించే సహృదయులు. రాజాలక్ష్మి ఫౌండేషన్ స్థాపకులు స్వర్గీయ పి.వి. రమణయ్య రాజా, చాలాకాలం పాటు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రాజాలక్ష్మి ఫౌండేషన్ పురస్కార సభలు ఎక్కడ జరిగినా, వేణుగోపాలరావే వ్యాఖ్యాత. ఆయనది అద్భుతమైన వాగ్ధాటి.

పూర్వ ముఖ్యమంత్రి డా. బెజవాడ గోపాలరెడ్డి ఒకసారి స్వయంగా వేణుగోపాలరావును కలిసి, తాము నెల్లూరులో దిగ్దంతులకు ప్రదానం చేసే 'కవిత్రయం' పురస్కారం అందజేయనున్నట్లు ప్రకటించారు. ఆ సందర్భంగా ఒక సాహితీ అంశంపై ప్రసంగం చేయాలని షరతు పెట్టారు. దానికి వేణుగోపాలరావు బదులిస్తూ, ఎప్పటినుంచో తన మనసులోని కోరిక "శ్రీనాథకవి భక్తి–పోతనామాత్యుని శృంగారం" అనే అంశంపై ప్రసంగిస్తానని చెప్పారు. బెజవాడ గోపాలరెడ్డి ఆనందంగా అంగీకారం తెలిపారు. అనుకున్నట్లుగానే నెల్లూరులో జరిగిన 'కవిత్రయం' పురస్కార సభలో ఆ అంశంపై డా. వేణుగోపాలరావు చేసిన ప్రసంగం సభికుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది.

చెన్నైలోని సాహితీ, సినీ ప్రముఖులందరూ ఆయన అభిమానులే! వేణుగోపాలరావు కోరిక మేరకు ఆచార్య జోగారావు గారి 'ప్రసన్న కుసుమాయుధం' కావ్యానికి శ్రీశ్రీ ముందుమాట రాయడం, సాహితీ దిగ్గజాలతో ఆయనకున్న అనుబంధం, ఆత్మీయతకు నిదర్శనం.


ఈ నెల మూడవ తేదీన వేణుగోపాలరావుతో మాట్లాడుతున్న సందర్భంలో "మీ చిరునామా పంపండి. నా 'యక్షగాన' పుస్తకం పంపిస్తాను" అన్నారు. అంత గొప్ప సాహితీస్రష్ట, సంగీతకారులు ఎంతో ప్రేమతో గుర్తుగా ఆ పుస్తకం పంపించారు. అది క్రోధి నామ ఉగాది నాడే నాకు అందింది. గంట తర్వాత ఆయన ఆదివారం రాత్రే అస్తమించారు అన్న పిడుగులాంటి వార్త తెలిసింది. ఆయనకు నా నివాళి.

○ బి.వి అప్పారావు

విప్లవ నిర్మాణ సూత్రకారుడు

కొండపల్లి సీతారామయ్య గొప్ప మార్క్సిస్టు–లెనినిస్టు. ఆయన భారత కమ్యూనిస్టు విప్లవోద్యమ నిర్మాత. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు) మహోన్నత నాయకులు. శ్రామికవర్గ విప్లవ సారథి. భారత ప్రజాస్వామిక విప్లవ సుదీర్ఘ కాలంలో ఆయన మార్క్సిజం–లెనినిజం మావో ఆలోచనా విధానాన్ని మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి నక్సల్బరీ విప్లవ పథాన్ని కాంతివంతం చేశారు. రివిజనిజాన్ని తిప్పికొట్టి ప్రజాపంథా ఆధారంగా విప్లవాచరణను సుసంపన్నం చేశారు.

> సిద్ధాంత రాజకీయ రంగంలో కొడపల్లి సీతారామయ్య అవిరళ కృషి జరిపారు. మన దేశం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ చర్చించారు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, కుల సమస్య, జాతుల పోరాటాలు, కార్మిక సంఘాలు మొదలుకొని పాక్షిక పోరాటాలు, భారత ప్రజాస్వామిక విప్లవ వ్యూహం ఎత్తుగడలు, అంతర్జాతీయ పరిస్థితి, ప్రపంచ ఆర్థిక సంక్షోభం, పార్టీ నిర్మాణం వరకు అనేక సమస్యలను చర్చించి వాటిని మార్క్సిజం వెలుగులో విశ్లేషించారు. కొత్త విధానాలను, నిర్మాణ సూత్రాలను ఆవిష్కరించారు.



ఆయన సిద్ధాంత రాజకీయ రంగంలో అవిరళ కృషి జరిపారు. మన దేశం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ చర్చించారు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, కుల సమస్య, జాతుల పోరాటాలు, కార్మిక సంఘాలు మొదలుకొని పాక్షిక పోరాటాలు, భారత ప్రజాస్వామిక విప్లవ వ్యూహం ఎత్తుగడలు, అంతర్జాతీయ పరిస్థితి, ప్రపంచ ఆర్థిక సంక్షోభం, పార్టీ నిర్మాణం వరకు అనేక సమస్యలను చర్చించి వాటిని మార్క్సిజం వెలుగులో విశ్లేషించారు. కొత్త విధానాలను, నిర్మాణ సూత్రాలను ఆవిష్కరించారు.

మహోజ్వలమైన తెలంగాణ పోరాటకాలంలో ఆయన రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ అత్యున్నత నాయకత్వ కమిటీలో ఉండి ఉద్యమాన్ని నడిపారు. దేశం మొత్తంలోనే అత్యధిక పార్టీ సభ్యత్వం కలిగిన కృష్ణా జిల్లాకు కార్యదర్శిగా బాధ్యతల్ని నిర్వహించటం ప్రత్యేకించి పేర్కొనదగింది. అపుడు ఆయన కొన్ని వ్యాసాలు మాత్రమే రాశారు. గ్రామసీమలలో ఐక్య సంఘటన, వలంటీర్ల శిక్షణలపై ఆయన వ్యాసాలు ప్రచురితమయ్యాయి. కె.ఎస్ రచనా వ్యాసంగం నక్సల్బరీ పోరాట కాలం నుంచే ప్రధానంగా ఆరంభమయింది. అప్పటి నుంచి ఆయన విస్తృతంగా రచనలు చేశారు. సత్యప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్, కృష్ణమూర్తి, విశ్వేశ్వరయ్య వంటి పలు కలం పేర్లతో ఆయన అనేక వ్యాసాలు రాశారు. ఇవి 'పిలుపు', 'క్రాంతి' పత్రికలలో అచ్చయ్యాయి. ఆయన రచనలలో అత్యధిక భాగం పార్టీ డాక్యుమెంట్స్, సర్క్యులర్స్ రూపంలోనే ఉన్నాయి. అవన్నీ గతంలో ప్రచురించబడి రహస్యంగా సర్క్యులేట్ అయ్యాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మా–లె) ఆంధ్ర రాష్ట్ర కమిటీ పేరుతోనో, కేంద్ర కమిటీ పేరుతోనో అవి పార్టీ కేడర్‌కు అందాయి. పార్టీ శ్రేణులు వాటిని విస్తృతంగా అధ్యయనం చేశారు. ఇంకా ఆయన జైలు జీవితం గడిపినపుడు అనేక లేఖలు రాశారు.

కొండపల్లి సీతారామయ్య అద్భుతమైన రచయిత. ఆయన శైలి విలక్షణమైనది. పది లైన్లతో కూడుకున్న ఒక పేరాలో ఒకే వాక్యం ఉన్నా, అది సూటిగా చాలా స్పష్టంగా ఎలాంటి గందరగోళానికీ, సంక్లిష్టతకూ తావు లేకుండా ఉండేది. భావంలో ఉన్న స్పష్టత వల్లనే పాఠకులు ఆయన రచనల్ని సులభంగా ఆకళింపు చేసుకునేవారు. సాధారణ కార్మికులకు సైతం అవి సుబోధకమయ్యేవి. అవసరమైన చోట సామెతలను వాడుతూ ఆయన చేసిన వాదనలు అందరినీ ఒప్పించేవి. వివిధ కోణాల నుంచి సమస్యను తడిమి, సమస్య పూర్వాపరాలను వివరించి నాటి పరిస్థితులను విప్పి చెప్పి సమగ్రమైన అవగాహనను కలిగించేవారు. ఆయన మార్క్సిస్టు విషయ పరిజ్ఞానం అద్వితీయమైనది.

కొండపల్లి సీతారామయ్య రచనలన్నింటినీ సేకరించి వాటిని మొదట వరస తేదీల వారీగా కూర్చి ఒక జాబితా ఏర్పరిచాం. అవి 3,500 పేజీలకు మించి ఉన్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మా–లె) చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన వివిధ కాలాలను లేదా పీరియడ్స్‌ను పరిగణనలోకి తీసుకుని ఆయన రచనల్ని వేరు చేసినపుడు అవి పది సంపుటాలుగా రూపొందాయి. కె.ఎస్. మెమోరియల్ కమిటీ ఆ పది సంపుటాలను ప్రచురిస్తోంది.

భారత విప్లవోద్యమ అనుభవసారమే కె.ఎస్. రచనలు. సుదీర్ఘమైన తన విప్లవ జీవితానుభవాన్నంతా ప్రోదిచేసి ఆయన మనకందించిన రచనలు అమూల్యమైనవి. అవి పీడిత ప్రజల ఘనమైన సంపద. అందుకే అవి బహుళ ప్రాచుర్యాన్ని పొందుతున్నాయి. రష్యా, చైనా విప్లవ వైఫల్యాల మూలంగా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో ఏర్పడిన స్తబ్దతను ఆసరా చేసుకుని నేడు రివిజనిస్టులు, ట్రాట్స్కైట్లు మార్క్సిజంపై ముప్పేట దాడిని కొనసాగిస్తున్నారు. కె.ఎస్. ప్రాసంగికత గురించి చర్చించటమే అసంబద్ధమనీ, కమ్యూనిస్టు విప్లవాలు ఒక పూర్తి ఊహాకల్పిత వ్యవస్థ కోసం అమానవీయ చర్యలకు పాల్పడుతున్నాయనీ కొందరు చేస్తున్న ప్రకటనలు ఈ దాడిలో భాగమే తప్ప మరేమీ కాదు. ఈ దాడిని తిప్పికొట్టి మార్క్సిజాన్ని పరిరక్షించడానికి, వీరి కుట్రల్ని భగ్నం చేసి ఉద్యమాన్ని మున్ముందుకు తీసుకుపోవడానికి కె.ఎస్. రచనలు బలమైన సాధనాలుగా నిలుస్తాయి.

కొండపల్లి సీతారామయ్య రచనలలోని మార్గదర్శక సూత్రాలు, సిద్ధాంత రాజకీయ అంశాలు సరైనవి. అవి సమకాలీన పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఎంతో దోహదపడతాయి. అవి నేటికీ ఆచరణీయమైనవనీ మన అనుభవం అడుగడుగునా నిరూపిస్తోంది. యావత్తు పీడిత ప్రజానీకం ఈ అనుభవాలను సమీక్షించుకుని మహత్తర విప్లవ ఆశయానికి పునరంకితం కావాలి.

• డాక్టర్ శ్రీనివాస్
కె.ఎస్. మెమోరియల్ కమిటీ
(నేడు కొండపల్లి సీతారామయ్య వర్ధంతి)

దృశ్యాదృశ్యాల నడుమ...!

ఏది సత్యం ఏది అసత్యమనే
మీమాంస ఇప్పుడిక అక్కరలేదు
రాజకీయ దృశ్యాదృశ్యాల నడుమ
వికృత విధ్వంస రూపాలనేకం
చాణక్యనీతులు వల్లిస్తున్నాయి,
విశ్వగురువు ప్రవచనాలతో
దేశ సంపదంతా కొందరికే కైంకర్యం
శేషమంతా పరంపరాగత దారిద్ర్యం,
సాంత్వనగా గుళ్లగోపురాల చుట్టూ
చెక్కభజనలతో
భజ గోవిందం భజ గోవిందం
ప్రశ్నించేవాడు మూఢమతి
శాసిస్తున్నవాడు సర్వంతర్యామిగా
నిఘానేత్రాలతో
నిర్బంధ నివాసాలు నిర్మిస్తున్నాడు
ఇకనైనా గోడల్ని కూల్చక తప్పదు,
వోటుహక్కు చివరికిలా
మార్కెట్ సరుకుగా మిగిలితే
మన తరతరాల మానసిక దాస్యం
పౌరాణిక మూఢ భావజాలం
మనందరి చేతికి చిప్పనిచ్చి
విశ్వవిపణిలో
బరిబత్తల నిలుచోబెడతాయి,
ఇక గతిలేక–
"ఏమి చేతురా లింగా
ఏమి చేతురా..." అంటూ
చేతులు పిసుక్కుంటూ
మన కర్మను–
తిట్టుకోవలసింది మనమే!!

– నిఖిలేశ్వర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





బొక్కలగడ్డ ఈద్గా వద్ద సందడి

భక్తి శ్రద్ధలతో రంజాన్

ఈద్గాలకు భారీగా తరలివచ్చిన ముస్లింలు

శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు



మంత్రి కొండా సురేఖను సత్కరిస్తున్న ముస్లిం నాయకులు



హనుమకొండ బొక్కలగడ్డ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 11: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో రంజాన్ పర్వాన్ని జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి సుగంధ పరిమళ సెంటు గుబాళింపులతో ఈద్గాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్దలు ఖురాన్ పఠించారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉమ్మడి జిల్లాలో వరంగల్ నగరంలోపాటు అన్ని పట్టణాల్లోనూ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా రంజాన్ వేడుకల్లో పాల్గొని ఐక్యతను చాటారు. హనుమకొండ ప్రాంతంలో నిర్వహించిన వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్, అనేకమంది ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

హనుమకొండలోని బొక్కలగడ్డ, ఎన్‌జీవోస్ కాలనీ, ములుగురోడ్, పోతననగర్ ఈద్గాలతో పాటు ఖిలావరంగల్, ఎల్‌బీనగర్, కాజీపేట దర్గాల వద్ద వేలసంఖ్యలో ముస్లింలు పాల్గొని సామూహిక

మిగతా 8వ పేజీలో

దేశంలోని అవినీతిపరులంతా బీజేపీలోనే ఉన్నారు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు



మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు

న్యూశాయంపేట, ఏప్రిల్ 11: దేశంలోని అవినీతిపరులంతా బీజేపీలోనే ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఆరోపించారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం కేంద్ర ప్రభుత్వ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. రాజ్యాంగం రక్షింపబడాలన్నా.. ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలన్నా.. కేంద్రంలో బీజేపీని సాగనంపాలన్నారు. ఒకే దేశం, ఒకే చట్టం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్ష తరహా పాలనకు ప్రయత్నిస్తున్నారని, దేశాన్ని హిందూ దేశంగా మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న అవినీతి రాజకీయ నాయకులందరినీ ఈడీ, సీబీఐ, ఐటీలను ప్రయోగించి వారిని లొంగదీసుకుని బీజేపీలోకి చేర్చుకుని క్లీన్‌చిట్ ఇస్తున్నారన్నారు. వీటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రామాలయం, సీఏఏ, హిందుత్వం పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగాయని, దళిత వ్యతిరేక పార్టీ అయిన బీజేపీకి ఎమ్మార్పీఎస్ మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. బీజేపీ కేంద్రంలో తిరిగి అధికారంలోకి వస్తే ఉన్న రిజర్వేషన్లు ఎత్తివేయడం ఖాయమని, అలాంటి పెత్తందారుల పార్టీకి ఎమ్మార్పీఎస్ మద్దతు ఇవ్వడం తగదన్నారు. బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లాకు పదేళ్లలో నిధుల కేటాయింపులో వివక్ష చూపిందని, విభజన హామీలైన బయ్యారం ఉక్కు, కాజీపేట రైల్వే పరిశ్రమలు నెరవేర్చలేదన్నారు. విద్యుత్‌ను కూడా ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని, రైతులు, కార్మికులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మోసం చేసిన బీజేపీని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని శ్రీనివాసరావు కోరారు.

ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ.. కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించలేకనే మతోన్మాద ఎజెండా ఎత్తుకుందన్నారు. కేంద్రంలోని బీజేపీ విధానాలను రాష్ట్రంలోని బీఆర్ఎస్ కూడా అనుసరించుకుంటూ వచ్చిందన్నారు. ఇలాంటి బీజేపీ, బీఆర్ఎస్ బూర్జువా పార్టీలకు వ్యతిరేకంగా వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను కూడగట్టి ముందుకు సాగాలన్నారు. ఈ సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, సీపీఎం, ఎంసీపీఐ(యు), ఆర్ఎస్పీ, న్యూడెమోక్రసీ నాయకులు ఎం. చుక్కయ్య, కె.శివాజీ, ఆర్. బాలరాజుతో పాటు సీపీఎం ఎంఎల్, ఆర్ఎస్‌పీ, మాస్‌లైన్, లిబరేషన్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న విమానం!



మామునూరులో దిగుతున్న సర్వే సంస్థ విమానం

దశాబ్దాలుగా నెరవేరని గగన విహారం

- 2017లో 'ఉడాన్' కింద మామునూరు విమానాశ్రయం ఎంపిక
- వివిధ సర్వే సంస్థలతో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధ్యయనం
- 2021లో కేంద్ర ప్రభుత్వం అనుమతులు
- భూసేకరణ, 150కి.మీ. నిబంధనల అడ్డంకి దాటితేనే మార్గం సుగమం
- తాజాగా మూడు జియాజికల్ సర్వే విమానాల సందడి

హైదరాబాద్‌తో పాటు అభివృద్ధి చెందిన నగరంగా గుర్తింపు ఉన్న ఓరుగల్లు ప్రజలను విమానయానం దశాబ్దాలుగా ఊరిస్తూనే ఉంది. నిజాం కాలంలోనే రయ్ రయ్ మంటూ విమానాలు ఎగిరిన మామునూరులో.. తదనంతర పరిస్థితుల దృష్ట్యా గగన యానం అందుబాటులో లేకుండాపోయింది. ఈ క్రమంలో చిన్న నగరాలకు రాష్ట్ర రాజధానులు, ఢిల్లీతో ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉడాన్ పథకం ఉత్తుత్తిగానే మిగిలిపోతోంది. అయితే మామునూరు ఎయిర్‌పోర్టుకు 2021లోనే ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సూత్రప్రాయంగా అనుమతులిచ్చినా భూ సేకరణ సమస్యతో పాటు హైదరాబాద్ విమానాశ్రయానికి 150కిలో మీటర్ల పరిధిలో ఈ ప్రాంతం ఉండటం శాపంగా మారింది. చివరకు మామునూరు విమానాశ్రయ కల ఎప్పుడు నెరవేరుతుందా.. అని ఎదురుచూస్తున్న సమయంలో.. తాజాగా వారం రోజులుగా మామునూరు ఎయిర్‌పోర్టులో విమానాలు సందడి చేస్తున్నాయి. గురువారం మూడు సర్వే విమానాలు రన్‌వేపై దిగటం.. ఆయా సంస్థల ప్రతినిధులు జియోజికల్ సర్వే చేపట్టారన్న సమాచారంతో విమానశ్రాయం కల సాకారమవబోతోందన్న ఆశలు చిగురి స్తున్నాయి.

\- వరంగల్, ఆంధ్రజ్యోతిప్రతినిధి

వివరాలు : 7 లో..



మామునూరు విమానాశ్రయంలో గురువారం దిగిన మూడు సర్వే విమానాలు

భద్రకాళికి లక్ష కనకాంబరాలతో అర్చన



అమ్మవారికి కనకాంబరాలతో అర్చన నిర్వహిస్తున్న దృశ్యం

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 11: వరంగల్ మహానగరంలో కొలువుదీరిన భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాలు గురువారం మూడో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి లక్ష కనకాంబర పుష్పార్చన చేశారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం అనంతరం కల్పోక్త ప్రకారం నవరాత్రి ఉత్సవాల జపం, హోమం, అర్చన, అభిషేకాలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి లక్ష కనకాంబర పుష్పార్చన నిర్వహించారు. అమ్మవారికి షడ్రుతువుల, షడ్చక్రాల ఆది దేవతలకు ప్రీతికరమైన క్షీరాన్నం, పెరుగన్నం, నువ్వుల సద్ది, ఆవ సద్ది, పెసరు సద్ది, పులిహోర, హిత్యాధి నివేదన చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ప్రముఖ న్యాయవాది భాస్కర వర్ధుల, పురుషోత్తం భవాని దంపతులు, సాకేత్ రామశర్మ ఉభయ దాతలుగా అమ్మవారికి సేవలందించారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయంలో ఏర్పాట్లను ఈవో శేషు భారతి పర్యవేక్షించారు.

మోదీ బృందంలో ఉండే అవకాశం ఇవ్వండి..

- ఇద్దరం ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం..
- వరంగల్ కోసం మోదీ ఎంతో చేశారు
- మాల, మాదిగలను అణగదొక్కిన కడియం
- కావ్యకు వరంగల్‌తో ఏం సంబంధం? ఆమె మెట్టినిల్లు గుంటూరు
- హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు సీతారామ్‌నాయక్, అరూరి రమేష్


వివరాలు 7లో..



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, పక్కన మానుకోట అభ్యర్థి సీతారాంనాయక్, గరికపాటి మోహన్‌రావు

క్లెయిమ్స్‌పై మౌనమేల?

- కళ్లు మూసుకుంటున్న హెల్త్ ఇన్సూరెన్స్ అధికారులు
- కాసుల కోసం ప్రైవేట్ ఆస్పత్రికి దాసోహం
- విచారణ జరిపించాలని డిమాండ్లు



వరంగల్ మెడికల్, ఏప్రిల్ 11: హనుమకొండ బాలసముద్రం ప్రాంతంలోని ప్రయివేట్ ఆస్పత్రి తప్పుడు క్లెయిమ్‌లు చేస్తున్నప్పటికీ ఇన్సూరెన్స్ అధికారులు ఏమిచేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కోట్లాది రూపాయలను ప్రయివేట్ ఆస్పత్రి కొల్లగొడుతున్నా.. అధికారులు మౌనం వహించడం వెనుక మతలబు ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 'హెల్త్ ఇన్సూరెన్స్ పేరుతో నమా మోసం' అనే శీర్షిక గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై అనేక మంది రోగులతోపాటు ప్రయివేట్ వైద్యులు కూడా ఆంధ్రజ్యోతికి మరింత సమాచారం అందించారు. ఈ తతంగంపై సమగ్ర విచారణ జరపాలని ఇన్సూరెన్స్ కంపెనీల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

దొంగ క్లెయిమ్స్

15 యేళ్ల కిందట యాక్సిడెంట్ కేసులన్నీ ఒకే పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదయ్యాయి. ఈ ప్రమాదంలో గాయపడిన వారందరికీ ఒకే వైద్యుడు చికిత్స అందించాడు. అదే విధంగా ఒకే లాయర్ ఈ కేసులన్నింటినీ నడిపారు. ఆరోజుల్లో ఈ కథనంపై అనుమానం వచ్చి విచారణ చేయగా కొందరు జైలుకు కూడా వెళ్లినట్లు సమాచారం. ఇదే తరహాలో ప్రస్తుతం హనుమకొండలోని బాలసముద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రి దొంగ క్లెయిమ్స్‌కు స్వీకారం చుట్టింది. ఒకే ఆస్పత్రి నుంచి ఇన్ని క్లెయిమ్స్ వస్తున్నా ఇన్సూరెన్స్ అధికారులు మౌనంగా ఉండటం వెనుక మర్మమేమిటని గుసగుసలు వినిపిస్తున్నా యి. ఈ తతంగంపై ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ సమగ్ర విచారణ జరపాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.

అమ్ముడు పోయారు..

ఒకే ఆస్పత్రి నుంచి భారీ సంఖ్యలో క్లెయిమ్స్ వస్తున్న విషయాన్ని పసిగట్టి పర్యవేక్షించాల్సిన అధికారులే.. ఈ ప్రయివేట్ ఆస్పత్రికి అమ్ముడు పోయినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. కమీషన్ల కక్కుర్తితో ఏజెంట్లు, ఇన్సూరెన్స్ అధికారులు ఈ ఆస్పత్రికి కొమ్ము కాస్తున్నట్లు తెలుస్తోంది.

అంబులెన్స్ డ్రైవర్లే ఆధారం

ఎక్కడ ఏం జరిగినా అంబులెన్స్ డ్రైవర్లు ఈ ఆస్పత్రికి రోగులను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రోగి బంధువులు వేరే ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పినా డ్రైవర్లు మాత్రం ఇక్కడే చికిత్స బాగుంటుందని బలవంతంగా ఈ ఆస్పత్రిలో రోగులను అడ్మిట్ చేయిస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై విజిలెన్స్ విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా, సదరు ప్రయివేట్ ఆస్పత్రి ఇటీవల హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఇన్సూరెన్స్ ఏజెంట్లకు, డ్రైవర్లకు దావత్ ఏర్పాటుచేసినట్లు తెలిసింది. అనంతరం బహుమతులు కూడా ఇచ్చినట్లు సమాచారం.

డిశ్చార్జి సమ్మరీలో వింత పేర్లు

ఒక రోగి నడుము నొప్పితో ఆస్పత్రిని సంప్రదించగా గత మే 25న వర్టిబ్రో ప్లాస్టిక్ అనే సర్జరీ చేసినట్లు డిశ్చార్జి సమ్మరీలో పేర్కొన్నారు. ఇద్దరు వైద్యుల పేర్లు ఉండగా, ఇందులో న్యూరో వైద్యుడే లేకపోవడం ప్రశ్నార్థకంగా మిగిలింది. ఉన్న ఇద్దరిలో ఒకరు ఆస్పత్రి యజమాని కాగా, మరొకరు ఎంజీఎం నెఫ్రాలజీ విభాగంలో పీజీ చేస్తున్న వ్యక్తి పేరు డిశ్చార్జి సమ్మరీలో పేర్కొన్నారు. నిబంధనలప్రకారం పీజీలు వైద్యం అందిచేందుకు అర్హత లేదని తెలుస్తోంది. అదే విధంగా మరో రోగి డిశ్చార్జి సమ్మరీలో ఇదే వైద్యుడి పేరు పేర్కొనడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పాయిజన్ కేసులు వస్తే పండగే..

పాయిజన్ కేసులు ఈ ఆస్పత్రికి వస్తే డబ్బులు దండుకునేందుకు అవసరం లేకున్నా డయాలసిస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ రోగికి కిడ్నీ ఫెయిల్ అవుతుందని.. రోగి బంధువులను భయపెడుతూ డయాలసిస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే డయాలసిస్ ఒకవేళ చేయాలనుకుంటే ఆస్పత్రిలో ఫుల్‌టైం నెఫ్రాలజిస్ట్ ఉండాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఆస్పత్రిలో నెఫ్రాలజిస్టు వైద్యులు లేరు. ఎంజీఎంలో పనిచేసే వైద్యుడి పేరు నోటీస్ బోర్డులో పేర్కొన్నట్లు తెలుస్తుంది.

సుమోటో కేసు స్వీకరించాలి

సదరు ప్రయివేట్ ఆస్పత్రి యాజమాన్యం రోగులతోపాటు ఇటు ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలను మోసం చేసిన విధానంపై సంబంధిత అధికారులు సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా పలువురు రోగులు, ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



'ఖజానా'లో పని భారం

100 మంది ఉద్యోగులు చేయాల్సిన పనికి 45మందే దిక్కు

35వేల పై చిలుకు ఉద్యోగులకు ఇక్కడినుంచే జీతాలు చెల్లింపు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 11: హైదరాబాద్ ఖజానా కార్యాలయం తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఖజానా కార్యాలయమైన హనుమకొండ జిల్లా ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. ఇక్కడి కార్యాలయంలో 100 మంది ఉద్యోగులు చేయాల్సిన పనిని.. 45 మంది ఉద్యోగులే చేస్తూ అధిక పనిభారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న ఆరు జిల్లాల ఖాజానా కార్యాలయాలలో 5 జిల్లాల ఖజానా కార్యాలయాల ఉద్యోగులు చేసే పనిని ఒక్క హనుమకొండ జిల్లా కార్యాలయ ఉద్యోగులు చేస్తున్నారంటే వారిపై ఎంత పనిభారం ఉందో అర్థమవుతోంది.

అన్నీ నుంచే..

జిల్లాలోని కొందరు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్లు ఈ కార్యాలయం నుంచే ఇస్తారు. 15వేల మంది ఉద్యోగస్థులకు, 16వేల మంది పెన్షనర్లకు, 1200 మంది హోంగార్డులకు, 1500 మంది మున్సిపల్ సిబ్బందికి, 1000 మంది గ్రాంటినేట్ స్కూల్ టీచర్లకు, 500 మంది అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు(35వేల పైచిలుకు ఉద్యోగులకు) ఇక్కడి నుంచే చెల్లిస్తారు. దీంతో పాటు జిల్లాలోని 110 గ్రామ పంచాయతీల సిబ్బందికి వేతనాలతో పాటు సాధారణ నిధులు కూడా ఇక్కడి నుంచే విడుదలవుతాయి.

అన్ని రోజులూ పనిదినాలే...

ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత ఉండటంతో ఆదివారాలు, పండగ రోజులు కూడా ఉద్యోగాలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. నూతన పెన్షన్ విధానం, ఆదాయ పన్ను రిటర్న్‌కు సంబంధించిన పనులు, క్యాష్ ఇన్ జీపీఎఫ్ చెల్లింపులు కూడా ఇక్కడి నుంచే చేస్తుండటంతో ఎక్కువ పనిభారంతో సతమతమవుతున్నామని ఖజానా కార్యాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖజానా కార్యాలయంలో సరిపడా ఉద్యోగులను కేటాయించాలని కోరుతున్నారు.

పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.నరసింహారెడ్డి



హనుమకొండ జిల్లాలో 16వేల మంది పెన్షనర్లు ప్రతీ నెల పెన్షన్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత ఉండటంతో పెన్షనర్లకు ఇబ్బంది ఎదురవుతోంది. ఖజానా కార్యాలయ ఉద్యోగులకు పనిభారం తగ్గాలంటే పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఇలాంటి ఆఫీస్‌లు హైదరాబాద్‌లో మాత్రమే ఉన్నాయి. హైదరాబాద్ తర్వాత ఎక్కువ పెన్షనర్లు ఉన్న మన హనుమకొండ జిల్లాలో కూడా పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఖదిజ్ఞాసి లోక్‌నాథ్

ఓటు అమ్ముకుంటే ఐదేళ్లు అధోగతే..

జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్‌నాథ్

వడ్డెపల్లి, ఏప్రిల్ 11 : నోటుకు ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్ అధోగతేనని జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్‌నాథ్ అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికి ఉన్నా శవంతో సమానమన్నారు. ధన రాజకీయాలకు ఎన్నికల్లో సమాధి కట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యత ఓటర్లపైనే ఉందని చెప్పారు. సమావేశంలో జై భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల, రాష్ట్ర నేత ఖదిజ్ఞాసి వీరయ్య, సాంబశివ రావు, గగన్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట ఆలయాలను విలీనం చేయవద్దు..

రామాలయ అర్చకుడు విష్ణువర్ధనాచార్యులు ఆత్మహత్యాయత్నం



మెట్టుగుట్ట ఆలయాలను విలీనం చేయవద్దని తీర్మానం చేస్తున్న ఈవో, చైర్మన్, అర్చకులు, ధర్మకర్తలు, భక్తులు

మడికొండ, ఏప్రిల్ 11: మడికొండలోని మెట్టుగుట్టపై హరిహర క్షేత్రంగా విలసిల్లుతున్న మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయం అర్చకుడు పరాశరం విష్ణువర్ధనాచార్యులు ఆలయంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీపంలో ఉన్న కొందరు గమనించి వారించి నచ్చజెప్పి ఈవోకు సమాచారం అందించారు. కాగా, మడికొండలోని మెట్టుగుట్టపై హరిహర క్షేత్రంగా విలసిల్లుతున్న మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాలకి సంబంధించిన రెండు కమిటీలు ఉంటాయి. ప్రస్తుతం రామాలయానికి సంబంధించిన భూమిని రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ ఎనకు అమ్మగా కోట్ల రూపాయల నిధులు వచ్చాయి. ఆ నిధులపై కన్నేసిన దేవాదాయ శాఖ అధికారులు, ఈవో, శివాలయం అర్చకులు, చైర్మన్‌లు.. రామాలయం, శివాలయం రెండింటినీ విలీనం చేసి నిధులను ఇతర అవసరాలకు మళ్లించేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఆలయాలను విలీనం చేయవద్దని నిరసన వ్యక్తం చేస్తూ అర్చకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

దీనిపై ఈవో శేషభారతి ఆలయ చైర్మన్, అర్చకులు, ధర్మకర్తలు, స్థానికులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ప్రస్తుతానికి ఆలయాల విలీనం వంటి చర్యలు ఏవీ చేయడంలేదని తీర్మానం చేసినట్లు స్పష్టం చేశారు. అలాగే రామాలయ అర్చకులకు పే స్కేల్ వచ్చే విధంగా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, ధర్మకర్తలు, కరుణాకర్‌రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న విమానం!

దశాబ్దాలుగా నెరవేరని గగన విహారం ● భూసేకరణ, 150కి.మీ నిబంధనల అడ్డంకి దాటితేనే మార్గం సుగమం



ఎయిర్‌పోర్టుకు కేటాయించిన భూమి

వరంగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఓరుగల్లు వాసులకు 'విమానం' ఊరిస్తోంది. గగన విహారం కలగానే మిగులుతోంది. చిన్న నగరాలకు రాష్ట్ర రాజధానులు, ఢిల్లీతో ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉడాన్ పథకం ఉత్తుత్తిగానే మిగిలిపోతోంది. అయితే ఉమ్మడివరంగల్ జిల్లా అభివృద్ధికి ఎంతో కీలకంగా ఉంటుందన్న లక్ష్యంతో మామునూరు ఎయిర్‌పోర్టుకు 2021లోనే ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సూత్రప్రాయంగా అనుమతులిచ్చింది. అయితే ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణతో పాటు హైదరాబాద్ విమానాశ్రయానికి 150కిలో మీటర్ల పరిధిలో మరో విమానశ్రాయం నిర్మించవద్దనే ఒప్పందం వరంగల్ ఎయిర్‌పోర్టుకు శాపంగా మారుతుంది. అయితే తాజాగా వారం రోజులుగా మామునూరు ఎయిర్‌పోర్టులో విమానాలు సందడి చేస్తున్నాయి. మూడు సర్వే విమానాలు మామునూరు రన్‌వేపై దిగటంతో విమానశ్రాయం కల సాకారమవబోతోందన్న ఆశలు చిగురిస్తున్నాయి.

నిజాంకాలం నుంచే ఎయిర్‌పోర్టు..

నిజాం కాలంలోనే రయ్ రయ్ మంటూ విమానాలు ఎగిరిన మామునూరులో.. నేటి తరానికి గగన ప్రయాణం అందుబాటులో లేకుండాపోయింది. 1930లో చివరి నిజాం మీర్ ఉస్మాన్‌అలీ ఖాన్ మామునూరులో విమానాశ్రయం ఏర్పాటు చేశారు. షోలాపూర్‌లోని వ్యాపారాభివృద్ధికి, ఆజంజాహి వస్త్ర పరిశ్రమ, కాగజ్‌నగర్ కాగితపు పరిశ్రమలకు ఉపయోగపడేలా దీన్ని ఏర్పాటు చేశారు. 1981 వరకు మామునూరు విమానాశ్రయం ద్వారా రాకపోకలు జరిగాయి. 1970లో భారత్, చైనా మధ్య జరిగిన యుద్ధం సందర్భంగా ఢిల్లీలో విమానాలు దిగే పరిస్థితి లేనప్పుడు కూడా మామునూరు నుంచే సైన్యాన్ని పంపారు. కార్గిల్ యుద్ధ సమయంలో కూడా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు ప్రత్యామ్నాయంగా మామునూరు ఎయిర్‌పోర్టును వాడుకునేందుకు సిద్ధం చేశారు. ఇలాంటి చరిత్ర ఉన్న మామునూరు విమానాశ్రయం ఓరుగల్లువాసులకు మాత్రం ఉపయోగపడటం లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మామునూరు విమానాశ్రయాన్ని బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. 2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద దేశవ్యాప్తంగా విమానాశ్రాయాలను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఓఎల్ఎస్ సర్వే, మట్టి పరీక్షతో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గతేడాది జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతో మామునూరు ఎయిర్‌పోర్టుకు అన్ని రకాల అనుమతులు లభించాయి.

భూసేకరణ, 150కి.మీ నిబంధనే అడ్డంకి..

'అంగట్లో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని' అనే చందంగా మామునూరు ఎయిర్‌పోర్టుకు అన్ని అనుమతులున్న భూసేకరణ, 150కిలో మీటర్ల నిబంధన ప్రతిబంధకంగా మారింది. నిజాం కాలంలో 1,875ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు కోసం కేటాయించారు. ఇందులో 435ఎకరాల భూమిని టీఎస్ఎస్‌పీ ఫోర్తు బెటాలియన్ క్యాంపునకు కేటాయించారు. ఇందులో నుంచే జవహర్ నవోదయ విద్యాలయానికి 23.20ఎకరాలు, పోలీస్ శిక్షణ కళాశాలకు 59ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి పదెకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101 ఎకరాలు కేటాయించారు. ఇక ఫోర్త్ బెటాలియన్‌కు మిగిలింది కేవలం 241.24ఎకరాలు. మరో 675 ఎకరాల భూమిని వెటర్నరీ యూనివర్సిటీకి కేటాయించారు. రోడ్డు, ఇతర వాటికి పోగా ప్రస్తుతం 696 ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు 1,200ఎకరాల భూమి అవసరం. ఇంకా 504ఎకరాల భూమిని సేకరించి ఇవ్వాల్సి ఉంది. 2023 జూలై నెలలో 249 ఎకరాలు వెటర్నరీ యూనివర్సిటీ పక్కనే ఉన్న భూమి సేకరించి ఎయిర్‌పోర్టుకు ఇచ్చేందుకు గత ప్రభుత్వ మంత్రివర్గం ఆమోదించింది. మిగతా భూమిని చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతుల భూములు సేకరించాలని నిర్ణయించారు. అయితే ఎయిర్‌పోర్టుకు భూమిని అప్పగించేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. దీంతో విమానాశ్రయ ఏర్పాటుకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. అలాగే హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం మేరకు 150కి.మీ నిడివిలో ఇంకో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మామునూరు 150కిలో మీటర్ల లోపే ఉంది. దీంతో 2038వరకు మామునూరు ఎయిర్‌పోర్టుకు మోక్షం లభించదనే నిరాశ ఓరుగల్లు వాసుల్లో నెలకొంది. అయితే ప్రభుత్వం చొరవచూపించి జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి, నిబంధనలను సడలించాలనే ప్రజలు చేస్తున్న విజ్ఞప్తిని పట్టించుకునే వారు లేరు.

ఆశలు రేకెత్తిస్తున్న విమానాల సందడి..

మామునూరు ఎయిర్‌పోర్టులో గురువారం మూడు హెలికాప్టర్లు సందడి చేశాయి. వారం రోజులుగా ఒకటి రెండు విమానాలు మామునూరు ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావటం, గగన విహారం చేయటం జరుగుతోంది. అయితే వాటిని ఎన్‌సీసీ విభాగానికి చెందిన హెలికాప్టర్లుగా భావించగా.. గురువారం మూడు హెలికాప్టర్లు ఒకేసారి మామునూరులో ల్యాండ్ కావటంతో పాటు స్కై సర్వే చేపట్టారు. మూడు హెలికాప్టర్లలో వచ్చిన సిబ్బంది జియోజికల్ సర్వే చేపట్టినట్లు అక్కడి సిబ్బంది తెలిపారు. ఏఏఐ అనుమతితో కొన్ని విమాన ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇక్కడ ల్యాండింగ్‌కు ఉన్న వెసులుబాటును పరిశీలించారు. ఇప్పటికే మామునూరులో 6.6కి.మీ రన్‌వేతో పాటు పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 700 ఎకరాల వరకు భూమి ఉంది. వీటిని పరిశీలించిన అధికారులు పెద్దపల్లి జిల్లా రామగుండం ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రదేశాన్ని కూడా ఎయిర్ వ్యూ చేశారు. అనంతరం మామునూరుకు చేరుకున్నారు. మరో రెండుమూడు రోజులు ఇతర సర్వేలు చేపట్టనున్నట్లు సమాచారం. అయితే ఈ సర్వేలు ఎందుకోసమో వివరించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. కేంద్ర విమానాయ శాఖ ఆదేశాల మేరకే ఈ సర్వేలు జరుగుతుండటంతో ఓరుగల్లువాసుల్లో గగనయానంపై ఆశలు చిగురిస్తున్నాయి.

విమానయానంతో వ్యాపారాభివృద్ధి...

విమానాశ్రాయం ఏర్పడితే వరంగల్‌లోపర్యాటకంతో పాటు వ్యాపారాభివృద్ధి జరగనుంది. పరిశ్రమలన్నీ హైదరాబాద్‌కే పరిమితమవుతుండగా.. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్‌కు పరిశ్రమల స్థాపనకు వ్యాపారులు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం ఎయిర్‌పోర్టు లేకపోవటమేనని తెలుస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 140కిలో మీటర్లు రోడ్డు మార్గాన వరంగల్‌కు రావాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతుందనే కారణంతో పారిశ్రామికంగా అనుకూల వాతావరణం ఉన్నా విమానాశ్రయం లేకపోవటంతో వరంగల్‌లో పరిశ్రమలు రావటం లేదనే చర్చ జరుగుతోంది. వరంగల్‌లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు అనేక విదేశీ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయి. అయితే ఢిల్లీ, హైదరాబద్‌తో ఎయిర్ కనెక్టివిటీ లేకపోవడంతో పారిశ్రామిక వేత్తలు ముందుకు రావటం లేదు. అలాగే మడికొండ ఏరియాలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కూడా ఎయిర్ కనెక్టివిటీ లేకపోవటమే కారణంగా చెబుతున్నారు. భూపాలపల్లి ఏరియాలో అపార బొగ్గు నిక్షేపాలు ఉండగా.. ఇక్కడ బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నా విమాన మార్గం లేకపోవటంతో పారిశ్రామికవేత్తలు ముందుకు రావటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం జీఎంఆర్ సంస్థతో చర్చలు జరిపి మామునూరు ఎయిర్‌పోర్టుకు 150కి.మీ మినహాయింపు సడిలించేలా ఒత్తిడి తెచ్చి, దశాబ్దాల కల సాకారం అయ్యేలా దృష్టిపెట్టాలని ఓరుగల్లువాసులు కోరుతున్నారు.

నేడు బీజేపీ లోక్‌సభ బూత్ స్థాయి సమ్మేళనం

హనుమకొండ టౌన్, ఏప్రిల్11: వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని 7 నియోజకవర్గాల బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంను శుక్రవారం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ తెలిపారు. ప్రతీ బూత్ నుంచి సమ్మేళనంలో పాల్గొని, విలువైన సలహాలు ఇచ్చి సీటు కైవసం చేసుకునేందుకు దోహదం చేయాలన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు



కేయూ రోడ్డులో నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 11: బల్దియా పరిధిలో నిబంధనలు పాటిస్తేనే భవనాలకు అనుమతి పత్రాలు జారీ చేస్తామని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నిర్మాణం పూర్తయిన భవనాలకు అక్యుపెన్సీ సర్టిఫికెట్‌ల మంజూరు కోసం గురువారం నగరంలోని పలు చోట్ల క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కేయూ మెయిన్‌గేట్, పరిమళకాలనీ, ప్రకాశ్‌రెడ్డిపేట, న్యూశాయంపేట, నక్కలగుట్ట ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. భవనాల నిర్మాణాల పట్ల కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ వెంట టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

33 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 11: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్‌లో 33క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వంగపహాడ్ గ్రామంలో ఎం.కోమల, రమక్క అనే ఇద్దరు మహిళలు పీడీఎస్ బియ్యం సేకరించి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. దాడిలో రూ.87వేల విలువైన 33 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధృవీకరించారు.

మోదీ బృందంలో ఉండే అవకాశం ఇవ్వండి..

బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు అజ్మీరా సీతారామ్‌నాయక్, అరూరి రమేష్



బీజేపీలో చేరుతున్న పలువురు బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని, ఆయన టీమ్‌లో తాము కూడా భాగస్వాములమయ్యే అవకాశాన్ని కలిగించాలని బీజేపీ లోక్‌సభ మహబూబాబాద్, వరంగల్ అభ్యర్థులు సీతారాం నాయక్, అరూరి రమేష్ ఓటర్లను అభ్యర్థించారు. తమను గెలిపిస్తే ఇద్దరం కలిసికట్టుగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం హనుమకొండలోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతారామ్‌నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేసిన తనను దూరంగా పెట్టి తెలంగాణ ద్రోహులకు టికెట్లిచ్చారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డిని మానుకోటకు తీసుకువచ్చిన రెడ్యానాయక్‌కు, ఆయన కూతురు కవితకు కేసీఆర్ టికెట్లిచ్చారన్నారు. అయినా కూడా తాను ఎంతో సహనంతో బీఆర్ఎస్‌లో కొనసాగినప్పటికీ చివరికి బయటకు వెళ్లిపోయే పరిస్థితిని కల్పించారన్నారు. తాను ఎంపీగా మహబూబాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశానని చెప్పారు. ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటులో, రామప్పకు యునెస్కో గుర్తింపు తీసుకురావడంలో, కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ స్థానంలో ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాపు స్థాపనకు, ఇంకా ఇతరత్రా అనేక ప్రాజెక్టులు తీసుకురావడంలో ఎంతో కృషి చేశానని వివరించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా కేసీఆర్ అడ్డుపడ్డారన్నారు.

తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన పలు దుర్మార్గపు విధానాల వల్లనే కాంగ్రెస్ గెలిచిందని, అంతేకానీ ఆ పార్టీ పట్ల ప్రజల్లో ప్రేమ ఉండి కాదని సీతారామ్ నాయక్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ప్రొఫెసర్ సీతారామ్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తానని చెప్పిన వాగ్దానాల్లో ఒకటీ రెండు తప్ప.. ఏవీ అమలు కాలేదన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ వల్లనే కరువు వచ్చిందన్నారు. రాష్ట్రంలో కరువుకు గురైన మండలాలను ప్రభుత్వం ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. దేశంలో సుస్థిర పాలన, సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణ ఒక్క మోదీ వల్లనే సాధ్యమవుతుందని, ఆయనను చూసి ఓటేయ్యాలని సీతారామ్‌నాయక్ కోరారు. అయోధ్యలో రామమందిరం స్థాయిలో భద్రచాలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి మోదీని లోక్‌సభ ఎన్నికల తర్వాత తీసుకువస్తాన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలు బీజేపీ ఖాతాలో పడేలా ఓటర్లు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అభ్యర్థించారు.

వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ.. మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కాబోతున్నారని, ఆయన టీమ్‌లోకి తనను, సీతారామ్ నాయక్‌ను పంపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పని చేసిన తాను.. ఎమ్మెల్యేగా పదేళ్ల వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు అవకాశం వచ్చిందని, ఈ దృష్ట్యా ఓటర్లు తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కడియం శ్రీహరి మాల, మాదిగల ద్రోహిగా అరూరి అభివర్ణించారు. ఆయన ఉపముఖ్యమంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా టీడీపీలో, బీఆర్ఎస్‌లో పలు పదవులను అనుభవించినా ఎస్సీ సామాజికవర్గం అభ్యున్నతికి ఏ మాత్రం కృషి చేయలేదన్నారు. తన సొంత లాభం కోసం ఆరాటపడ్డారన్నారు. ఇప్పుడు తన కూతురును రాజకీయాల్లోకి తీసుకురావడానికి అడ్డదారులు తొక్కాడని విమర్శించారు. కడియం కూతురు, ప్రస్తుతం వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీకి దిగిన కావ్యకు వరంగల్‌తో ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఆమె అత్తగారు ఊరు గుంటూరని అన్నారు. శ్రీహరి కుటిల రాజకీయాలతో మాలలు, మాదిగలను ఆగం చేశాడన్నారు. లోకసభ ఎన్నికల్లో కడియంకు ఓటర్లు బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు.

ప్రస్తుతం యావత్ ప్రపంచం మోదీ వైపు చూస్తోందని, దేశ సర్వతో ముఖాభివృద్ధికి, రక్షణకు మోదీ నాయకత్వం అవసరమని అరూరి రమేశ్ అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ స్మార్ట్ సిటీ, అమృత్, గిరిజన విశ్వవిద్యాలయం, వ్యాగన్ వర్క్‌షాపు వంటి అనేక పథకాల ద్వారా వరంగల్‌కు ఎంతో చేశారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, బీజేపీ మహబూబాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గరికెపాటి మోహన్‌రావు, మాజీ ఎంపీ చాడా సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీ రాములు, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రావు అమరేందర్ రెడ్డి, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం బీఆర్ఎస్‌తో పాటు వివిధ పార్టీల నుండి పలువురు బీజేపీలో చేరారు. వీరికి గరికపాటి మోహన్ రావు, ప్రొఫెసర్ సీతారామ్‌నాయక్, ఆరూరి రమేష్‌లు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు ములుగు జిల్లా రైతు బంధు అధ్యక్షుడు పల్ల బుచ్చయ్య, రామప్ప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పాలంపేట మాజీ సర్పంచ్ అకిరెడ్డి వెంకట రామ్మోహన్ రావు, ఏటూరునాగారం మాజీ ఎంపీటీసీ ఇర్రల్ల ఎల్లయ్య, బీఆర్ఎస్ ఏటూరు నాగారం కన్వీనర్ పల్ల బాబు, ఏటీఎంఏ డైరెక్టర్ పాపక శ్రీనివాస్‌తోపాటు పల్ల వెంకటేశ్వర్లు, పూజారి సూర్యనారాయణ, మధుకర్, నాగేశ్వర్‌రావు, పల్ల స్వగన్, ఆకుతోట దుర్గయ్య తదితరులు వీరిలో ఉన్నారు. బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ములుగు జిల్లా ఇన్‌చార్జి పోలేపల్లి నరోత్తం రెడ్డి తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

ఒకవైపు విధులు.. మరో వైపు కళలు..

- వ్యాఖ్యాత, రచయిత, గాయకుడిగా ప్రవీణ్‌కుమార్ రాణింపు
- హనుమకొండ జిల్లా బాలల పరిరక్షణ అధికారిగా విధులు



జూలైవాడ, ఏప్రిల్ 11: సభలోని ఆహుతులను తన మాటలతో ఆకట్టుకొని, సందర్భోచిత కవితలు, పాటల ద్వారా సభికులను ఉత్సాహపర్చడం వ్యాఖ్యాత విధి. సాహితీ, కళా ప్రక్రియలలో భాగమైన వ్యాఖ్యానానికి తనదైన శైలిలో న్యాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు సౌరం ప్రవీణ్ కుమార్. హనుమకొండ జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అనుబంధ సంస్థ జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో బాలల పరిరక్షణ అధికారిగా (ఒప్పంద ప్రాతిపదికన) విధులు నిర్వహిస్తూ ప్రవృత్తి పరంగా కవిగా, రచయితగా, గాయకుడిగా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వ్యాఖ్యాతగా తన ప్రతిభను చాటుతున్నాడు.

చిన్ననాటి నుంచే కళారంగంపై ఆసక్తి

వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన సౌరం ప్రవీణ్‌కుమార్.. సంగెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించాడు. ఆ రోజుల్లోనే కళా రంగంపై ఆసక్తి పెంచుకున్నాడు. అనంతరం వరంగల్‌లో ఇంటర్, డిగ్రీ అనంతరం సోషల్ వర్క్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక వేదికలపై జానపద, సామాజిక చైతన్య గీతాలు పాడి ప్రముఖుల ప్రశంసలు పొందాడు.

పాటకు తొలి గురువులు

కళాశ్రీ ప్రవీణ్‌గా ద్వితీయ నామకరణంతో సాహితీ సాంస్కృతిక రంగంలో ఆరంగ్రేటం చేసిన ప్రవీణ్ కుమార్.. తొలుత పలు జానపద కళా బృందాలతో కలిసి వారి పాటలకు వంతపాడేవాడు. అనతికాలంలో దివంగత వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి లాంటి అగ్రశ్రేణి గాయకులతో కలిసి అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో తనగళం వినిపించాడు. రచనా వ్యాసంగం వైపు దృష్టి మళ్లించి వర్ధమాన కవిగా, రచయితగా అనేక వేదికలపై తనను తాను నిరూపించుకున్నాడు. 2018 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమం అయినా, ఏదేని సాహితీ సాంస్కృతిక కార్యక్రమమైనా వ్యాఖ్యాతగా కళాశ్రీ ప్రవీణ్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.


ఉన్నతాధికారుల సహకారంతో..

ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో కవుల సమక్షంలో చెత్తబండి దీర్ఘ కవిత సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రముఖులతో శభాష్ అనిపించుకొని అదే వేదికపై కణిక ఆత్మీయ పురస్కారం అందుకున్నాడు. ఉన్నతాధికారుల సహకారంతో జిల్లాలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.



వివిధ కార్యక్రమాలలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న సౌరం ప్రవీణ్ కుమార్ (ఫైల్)

'కవి సాయంత్రం' ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షురాలిగా రాధిక నరేన్



వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 11: సాహిత్య స్వచ్ఛంద సేవా సంస్థ, జనజాగృతి కళా సమితిలో అంతర్భాగమైన కవి సాయంత్రం సోషల్ మీడియా గ్రూప్ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీలో ఉపాధ్యక్షురాలిగా కొత్తపల్లి రాధిక నరేన్‌ను నియమిస్తూ సంస్థ వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కవి సాయంత్రం అనేది సాహిత్య సంస్థలో ఒక భాగమన్నారు. రాధిక నరేన్ కవయిత్రిగా, రచయితగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారని, ఈ నేపథ్యంలో ఆమెను నియామకం చేసినట్లు, ఈ నియామకం రెండేళ్లపాటు కొనసాగుతుందని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం

పనులకు నిధులు లేక అవస్థలు

సొంత డబ్బుతో కొన్ని పనులకు వాడకం



హనుమకొండ టౌన్, ఏప్రిల్ 11: గ్రామ పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరుగుతోంది. అన్ని పనులు వారి మీదే పడుతుండడంతో పంచాయతీ కార్యదర్శులు ఆర్థికంగా మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైనాటి నుంచి కార్యదర్శులకు కష్టాలు మొదలయ్యాయి. గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత మొత్తం కార్యదర్శులపైనే పడింది. ఆదాయానికి మించి నిర్వహణ ఖర్చులు అవుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ కార్యదర్శులే అప్పులు చేసి పంచాయతీలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీల్లో రావాల్సిన పన్నులు అంతంత మాత్రమే వసూళ్లు అవుతుండటంతో అప్పులు చేయక తప్పడంలేదు. ప్రస్తుతం 56 రకాల రికార్డులను నిర్వహిసున్నప్పటికీ కార్యదర్శులకు అదనంగా వాటర్ సప్లయికి సంబంధించి 7 రికార్డులను అప్పజెప్పడంతో పని ఒత్తిడి తప్పడంలేదు.

రాష్ట్ర ఫైనాన్స్ నిధులు కట్

పంచాయతీ అభివృద్ధికి గ్రామంలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు రాష్ట్ర ఫైనాన్స్ సెంట్రల్ ఫైనాన్స్ నుంచి వచ్చే గ్రాంటులను వినియోగిస్తుంటారు. కాగా, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అంతంతమాత్రమే కావడంతో మైనరు రిపేర్లు, పండుగల వేళ గ్రామంలోని దేవాలయాల ముస్తాబు, ఇతరత్రా ఖర్చులకే సరిపోతుంటుంది. మిగతా భారం అంతా సెంట్రల్, స్టేట్ ఫైనాన్స్ నుంచే వచ్చే గ్రాంటులపైనే ఆధారం. గ్రామంలో ప్రతీ తలపై రూ.162 చొప్పున సెంట్రల్, స్టేట్ ఫైనాన్స్‌లు కేటాయిస్తాయి. ఆయా గ్రామాల జనాభా లెక్కన గ్రాంటును విడుదల చేస్తుంటారు. కాగా, సుమారు 22 నెలల నుంచి స్టేట్ ఫైనాన్స్ నుంచి వచ్చే గ్రాంట్ నిలిపివేయడంతో పంచాయతీల్లో పనులు చేయించడం కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారింది. కేంద్రం నుంచి వచ్చే గ్రాంటు మూణ్నెళ్లకోసారి వస్తుండటంతో అప్పటికే గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లు కుప్పగా తయారవుతోంది. మిగిలేది ఏమీలేక మిగతా ఖర్చులకు కార్యదర్శి జేబులో నుంచి వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది.

మల్టీపర్పస్ వర్కర్స్‌కు అందని వేతనాలు

గ్రామపంచాయతీ పరిధిలో నివసిస్తున్న జనాభా ఆధారంగా మల్టీపర్పస్ వర్కర్స్‌ను గత ప్రభుత్వం నియమించింది. 500 జనాభాకు ఒక్కరు చొప్పున విధుల్లోకి తీసుకుంది. అయితే వీరికి గ్రామపంచాయతీ నుంచి వచ్చే ఆదాయం నుంచే ఒక్కొక్కరికి నెలకు రూ.9,500 జీతాలు చెల్లించాలని జీవో జారీ చేసింది. యేడాదికోసారి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం గ్రామ అవసరాలకే సరిపోక మల్టీపర్పస్ వర్కర్స్ మూడు, నాలుగు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మానవత్వం ఉన్న కార్యదర్శులు ఖర్చులో ఖర్చంటూ అక్కడక్కడా వర్కర్స్‌కు చేతనైనంత ఆర్థిక సహాయం చేసి ఆదుకుంటున్నారు.

కార్యదర్శులకు యాప్‌ను తొలిగించాలి..

జె. అశోక్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు

ప్రతీరోజు గ్రామంలోని నర్సరీ, శ్మశానవాటిక, చెత్తసేకరణ లాంటి 10 అంశాలకు సంబంధించి ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేయాలంటున్నారు. యాప్‌ను తొలిగించాలి. కారోబార్‌లను మల్టీపర్పస్ వర్కర్స్‌లో చేర్చడం వల్ల సుమారు 65 రికార్డ్‌లను నిర్వహించడం కష్టంగా ఉంది. కారోబార్లను కార్యదర్శులకు సహాయకులుగా నియమించాలి. పంచాయతీల అవసరాలకు సరిపడా నిధులులేక జేబుల్లో నుంచి పెట్టుబడి పెట్టి ఆర్థికంగా కుంగిపోతున్నాం. ఆ సమస్యను పరిష్కరించాలి.

వేయిస్తంభాల ఆలయంలో యాగం

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 11: చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో ప్రారంభమైన శ్రీసీతారామచంద్రస్వామి వారి శ్రీరామ నవరాత్రోత్సవాలు గురువారం నాటికి మూడోరోజుకు చేరుకున్నాయి. యాగశాలలో తమిళనాడుకు చెందిన విజయరాజ్ సహకారంతో ప్రత్యేక హోమం, శ్రీరామ నామదేవత మూలమంత్రంతో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం లక్షపుష్పార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



బల్దియా కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు



కేయూలో నివాళులర్పిస్తున్న వీసీ తాటికొండ రమేశ్ తదితరులు



కోర్టు ప్రాంగణంలో పూలే చిత్రపటానికి పూమాల వేస్తున్న తీగల జీవన్‌గౌడ్



బీఆర్ఎస్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వినయభాస్కర్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 11: మహాత్మాజ్యోతిరావు పూలే 197వ జయంతిని పురస్కరించుకుని గురువారం కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఆవరణలో మహాత్మాజ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు పూల మాల వేసి వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నేతృత్వంలో ఘనంగా నివాళులర్పించారు. ధర్మసమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలే 197వ జయంతిని ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మంద రమేశ్ ఆధ్వర్యంలో ధర్మసమాజ్‌పార్టీ నేతలు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కోశాధికారి యోసేబ్, కార్యదర్శి కొగిల రూప, జిల్లా, మండల స్థాయి నాయకులు రత్నాకర్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

దూరవిద్య కేంద్రం పూలే దంపతుల విగ్రహాలకు ఎమ్మార్పీఎస్ నేతృత్వంలో నివాళులర్పించారు. ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బొచ్చు తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డెపల్లి మధు,కేయూ ఉద్యోగుల సంఘం నాయకుడు మంద శ్యాం, నాయకులు కుమ్మరి శ్రీనాథ్, నరేందర్ పాల్గొన్నారు.

పాస్ ఆధ్వర్యంలో..

దూరవిద్య కేంద్రం పూలే దంపతుల విగ్రహాలకు పూలే ఆశయ సాధన సమితి (పాస్) నేతృత్వంలో నివాళులర్పించారు. పాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే దూరవిద్య కేంద్రంలోని పూలే దంపతుల విగ్రహాల వద్ద తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి ధనసూరి సూర్య నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేయూ జర్నలిజం హెచ్‌ఓడీ సంగానిమల్లేశ్వర్, ఆదర్శ లా కాలేజ్ చైర్మన్ బూర విద్యాసాగర్, జాక్ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ మంద వీరాస్వామి, కేయూ కుర్మా అధ్యక్షుడు తాళ్ళపల్లి నరేశ్‌గౌడ్, లాయర్ చల్లా శ్రీనివాస్, ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ వరంగల్ జిల్లా కార్యదర్శి మార్క కిరణ్‌గౌడ్, 5వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు గంధ్ర స్రవంతి, ఎన్ఎస్‌యూఐ నాయకుడు మట్టెడ కుమార్, కేయూ నాయకులు గణేశ్, శ్రవణ్, హరిరామ్, శివ తదితరులుపాల్గొన్నారు.

● కేయూ దూరవిద్య కేంద్రంలో ప్రాంగణంలో జ్యోతిరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వీసీ తాటికొండ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మహాత్మాజ్యోతిరావు దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, డీవో వాసుదేవారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ప్రసాద్, డాక్టర్ మంద వీరాస్వామి, కొంగర జగన్, సంగాని మల్లేశ్వర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ పూలే జయంతిని పురస్కరించుకొని కోర్టు ప్రాంగణంలో అంబేద్కర్ అసోసియేషన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముందు అంబేద్కర్ అసోసియేషన్ హాల్ బిల్డింగ్‌లోని రెండో అంతస్తులోని హాల్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే హాల్‌గా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా జిల్లా బార్ అసోసియేషన్ అధ్య, కార్యదర్శులు మాతంగి రమేశ్‌బాబు, లాదె రమేశ్, బార్ కౌన్సిల్ సభ్యులు భైరపాక జయాకర్, దుస్సా జనార్దన్, గోపికారాణి, జంగా కవిత, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

● వరంగల్ కార్పొరేషన్: మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నాయకులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మునిసిపల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాజీపేట సర్కిల్ డీసీ రవీందర్, హార్టికల్చర్ అధికారి రమేష్‌లో హాజరై సంయుక్తంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీపీ నాయకులు గౌరిశంకర్, గొల్కొండ శ్రీనివాస్, ధర్మరాజు, బొట్ల రమేష్, రాజారపు భాస్కర్, బాకం సంతోష్, రావుల ఆనంద్, డ్రైవర్ల సంఘం నాయకుడు మేకల దేవేందర్‌లు పాల్గొన్నారు. దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాత్ముని చిత్రపటానికి నివాళులు అర్పించి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సిరిమిల్ల సారంగం పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో..

మహాత్మా జ్యోతరావుపూలే జయంతి వేడుకలు గురువారం రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎంతో పాటు దాని అనుబంధ సంఘాల నాయకులు హాజరై పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, నాయకులు చుక్కయ్య, వీరన్న, సంపత్, లింగయ్య పాల్గొన్నారు.

పూలే గొప్ప అభ్యుదయవాది

రాంనగర్: మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప అభ్యుదయవాది, సామాజిక విప్లవ పితామహుడని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ కొనియాడారు. గురువారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత పులి రజనీకాంత్ అధ్యక్షతన జరిగిన జయంతి వేడుకల్లో వినయభాస్కర్ పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి వినయభాస్కర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్‌లు సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు అశోక్‌యాదవ్, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, లక్ష్మీనారాయణ, మేకల బాబురావు, శ్రవణ్ నేతలు సల్వాజీ రవిందర్‌రావు, వీరేందర్ చాగంటి రమేశ్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

హనుమకొండ టౌన్: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. పూలే 198వ జయంతిని పురస్కరించుకొని గురువారం నక్కలగుట్టలోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. డైరెక్టర్స్ వి.మోహన్‌రావు, సదర్‌లాల్, వి.తిరుపతి, సిజియంలు ప్రభాకర్, మధుసూదన్, కిషన్, రాజుచౌహాన్, అశోక్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: పూలే జయంతిని పురస్కరించుకొని టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ములుగురోడ్ కూడలిలోని మహత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, మనోజ్‌కుమార్, సత్యనారాయణ, సారయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి కె. సోమశేఖర్ కేయూ ఎస్డీఎల్‌సీఈ ప్రాంగణంలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, సదాశివరెడ్డి, రాజు, కుమార్, సుజన్‌ప్రసాద్‌రావు, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, మల్లిక్, శ్రీనివాస్, సదానందం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జులైవాడలోని ఎస్టీ వసతి గృహంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, శ్రీకాంత్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ విజయలక్ష్మి, విద్యార్థులు శ్రావణి, రమ్య, స్వరూప, మౌనిక, శ్యామల, శిరీష, అనూష తదితరులు పాల్గొన్నారు.

● కాజీపేట: జ్యోతిరావు పూలే జయంతిని గురువారం 47వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు దొంగల కుమార్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నాయకులు షేక్ అజ్గర్ హుస్సేన్, ఇప్ప శ్రీకాంత్ హాజరై మాట్లాడారు. స్త్రీలకు విద్యను అందించడంలో మహాత్మా జ్యోతిరావుపూలే సహసం ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● హనుమకొండ చౌరస్తా: హనుమకొండ 4వ డివిజన్ మహాత్మా జ్యోతిరావు పూలే కాలనీలో పూలే 197వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాయిని నరేందర్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి ఈ కార్యక్రమంలో జ్యోతిరావు పూలే కాలనీ అధ్యక్షుడు బాలరాజు, తెలంగాణ మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శి కొంగ వీరస్వామి, కాలనీ సభ్యులు కుమారస్వామి, చాపర్తి కుమార్, రాంబాబు, తిరుపతి, శ్రీకాంత్, నరసింహయ్య, సదానందం, నాగరాజు, శ్రీనాథ్, ఐలేష్, చక్రపాణి, వెంకటరెడ్డి, ఉస్మాన్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూశాయంపేట: హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం డీహెచ్‌పీఎస్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. డీహెచ్‌పీఎస్ నాయకులు దోమ కొమురయ్య, కంజర్ల వనజ, లత, పద్మ, కమల పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్‌లోని అశోక కాలనీలో సీపీఎం హనుమకొండ వెస్ట్ మండల కమిటీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, సీపీఎం నేత వాంకుడోతు వీరన్న నాయక్ పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

ఆత్మకూరు, ఏప్రిల్ 11: మండలంలోని గూడెప్పాడ్ వద్ద ఆగిన ఉన్న లారీని కారు ఢీకొనగా 3 నెలల బాబు అక్కడి కక్కడే మృతి చెందిన సంఘటన ఆత్మకూరు మండలంలో జరిగింది. సీఐ క్రాంతికు మార్ కథనం ప్రకారం యాదాద్రి జిల్లా ఆలేరుకు చెందిన యలగందుల శ్రీకాంత్, శ్రవంతి దంపతులు వీరి పిల్లలు 3నెలల బాబుతో 3 సంవత్సరాల పాప నలుగురు కలిసి గురువారం ఉదయం కారులో మల్లూరు వెళ్లి తిరిగి ఆలేరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గూడెప్పాడ్ వద్ద ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి వేగంగా ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న 3 నెలల బాబు మృతి చెందాడు. పాప తల్లికి తీ వ్ర గాయాలు కాగా తండ్రికి, పాపకు స్వల్ప గాయాలయ్యాయని సీఐ క్రాంతి కుమార్ తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకుని క్షతగా త్రులను చికిత్స కోసం ఎం జీఎంకు తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



నుజ్జునుజ్జయిన కారు

భక్తి, శ్రద్ధలతో రంజాన్

(5వ పేజీ తరువాయి)

పఠనంతోపాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరంగల్ మండిబజార్, హనుమకొండలోని రాయపుర, కిషన్‌పుర ప్రాంతాల్లో ముస్లింల సందడి అత్యధికంగా కనిపించింది. ముస్లింలు నూతన వస్త్రాలతో రోడ్ల వెంట బారులుదీరడంతో రంజాన్ పర్వ శోభ గుబాళించింది. గత నెల 11వ తేదీన నెలవంక దర్శనంతో ప్రారంభమైన ముస్లిం.. పవిత్ర రంజాన్ మాసాన్ని నియమనిష్ఠలతో నిర్వహించారు. 30 రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలు నేటితో పూర్తయ్యాయి. మత సామరస్యానికి, భక్తి భావానికి ప్రతీకగా నిలిచిన ఈ పర్వం మహబూబాబాద్, డోర్నకల్, జనగామ, పరకాల, నర్సంపేట, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున జరిగాయి.

మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యం : మంత్రి సురేఖ

మట్టెవాడ / కరీమాబాద్: మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా గురువారం వరంగల్ జెమినీ టాకీస్, మట్టెవాడ, కరీమాబాద్ పోర్ట్‌రోడ్ ఈద్గాల వద్ద ముస్లింలతో కలిసి ఆమె ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈద్గాలు, మసీదుల అభివృద్ధికి సహరిస్తామని అన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇఫ్తార్ విందు ఇవ్వలేకపోవడం తనకు బాధగా ఉందన్నారు. ఆమె వెంట వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాశ్, నజీరుద్దీన్, వసీం. యాకుబ్ పాషా, నల్గొండ రమేశ్, కార్పొరేటర్ పోచాల పద్మ, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, దాసరి రాజేశ్, కూచన రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓటమి లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్11: బీజేపీకి ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అని, ఆ పార్టీ పరాజయమే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు పని చేయాలని వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి ఆరూరి రమేశ్ పిలుపునిచ్చారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని బూత్ లెవల్ విస్తృతస్థాయి సమావేశాన్ని గురువారం హంటర్‌రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరూరి మాట్లాడుతూ.. దేశాభివృద్ధి, సమైక్యత కోసం బీజేపీకి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ హయాంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకునేదని, ప్రస్తుతం మనమే ఎగుమతులు చేసే స్థాయికి దేశాన్ని మోదీ తీసుకెళ్లాడన్నారు. 370 ఆర్టికల్ పేరుతో కాంగ్రెస్ దారుణాలకు పాల్పడితే, బీజేపీ దాన్ని రద్దు చేసిందన్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు పద్మ, పార్లమెంట్ ప్రభారీ వి. మురళీధర్, సంతోష్‌రెడ్డి, గైనేని రాజన్ పాల్గొన్నారు.

ప్రధానిగా మోదీని ప్రజలు కోరుకుంటున్నారు..

హసన్‌పర్తి : దేశ ప్రజలు నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాన మంత్రిగా కోరుకుంటున్నారని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ అన్నారు. గురువారం ఎర్రగట్టుగుట్ట వద్ద గల ఓ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ అభివృద్ధిని చూడాల్సి వస్తే గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లను చూడాల్సిన అవసరం లేదని.. మన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు, ఫోర్‌లైన్ హైవేలు, వేయిస్తంభాల దేవాలయం, స్మార్ట్ సిటీ ద్వారా జరిగిన నగర అభివృద్ధియే చాలన్నారు. కాకతీయ కళా సంపదకు యునెస్కో గుర్తింపు తీసుకవచ్చిన ఘనత నరేంద్ర మోదీదేనన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా వరంగల్‌కు 7076 ఇల్లు మంజూరయ్యాయన్నారు. ఇంత అభివృద్ధి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కనబడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. దేశ ప్రజలు 400 సీట్లకు పైగా మోదీకి కానుకగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ కార్యకర్త కంకణబద్ధులై వరంగల్‌లో బీజేపీ జెండా ఎగురవేసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ గ్రామాల్లోని, వివిధ పార్టీల నుంచి వచ్చిన వారికి ఆరూరి రమేశ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.పార్లమెంట్ ప్రభారి మరళీగౌడ్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, పార్లమెంట్ కన్వీనర్ తాళ్ళపెల్లి కుమారస్వామి, జడ్పీటీసీ రేణుకుంట్ల సునీత, మాజీ జడ్పీటీసీ కొత్తకొండ సుభాష్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేశ్‌గౌడ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రమేష్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఏప్రిల్11: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. టేకులగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు, కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యారణ్యపురి, పలివేల్పుల, సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ధర్మసాగర్ సబ్‌స్టేషన్ పరధిలో..

ధర్మసాగర్, ఏప్రిల్ 11 : విద్యుత్ తీగల మరమ్మతు, కరెంట్ తీగలపై ఉన్న చెట్లను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాను శుక్రవారం నిలిపి వేస్తున్నట్టు ఏఈ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ధర్మసాగర్ సబ్‌స్టేషన్ నుంచి దేవునూర్ ఫీడర్, 11 కేవీ మల్లక్‌పల్లి ఫీడర్ సబ్‌స్టేషన్ ధర్మాపూర్‌కు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు.

14న కేయూలో అంబేద్కర్ జయంతి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 11: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 14వ తేదీ ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ దూరవిద్య ప్రాంగణంలోని అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ విచ్చేస్తారని, అలాగే ప్రముఖ పాత్రికేయుడు మల్లెపల్లి లక్ష్మయ్య హాజరై ఇండియన్ డెమోక్రసీ అండ్ బాబా సాహెబ్ అంబేద్కర్ దృక్పథాలు అనే అంశంపై విస్తృత ఉపన్యాసం చేస్తారని తెలిపారు. గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

నయింనగర్, ఏప్రిల్ 11: హనుమకొండ 6వ డివిజన్‌లోని బొక్కలగడ్డ ఈద్గా మసీదులో పవిత్ర రంజాన్ పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్యలు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈద్గాకు విచ్చేసిన ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ముస్లింలు తమ పవిత్ర ప్రార్థనలతో అల్లాహ్ దీవెనలు పొందాలని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగడ్డ ఈద్గాలో ప్రార్థనలు

హనుమకొండ చౌరస్తా: హనుమకొండ 4వ డివిజన్ పెద్దమ్మగడ్డ ఈద్గా హుస్సేనీయాలంలో ముస్లిం మత పెద్దలు గురువారం ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పర్వదిన వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ. నయీంమోద్దీన్ ఆధ్వర్యంలో ఈద్గా కమిటీ మత పెద్దలు సాముహిక ప్రార్థనలు నిర్వహించి చిన్న, పెద్ద ఒకరి నొకరు అలింగనం చేసుకొని రంజాన్ పండగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మౌలానా మోహినోద్దీన్ సమాజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు సలీం ఖలీల్, మోయిన్‌తౌసిఫ్, షకీల్, అజీమ్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

వడ్డెపల్లి, ఏప్రిల్ 11: వడ్డెపల్లి, ఎన్జీవోస్ కాలనీ, జవహర్ కాలనీ, గోపాల్‌పూర్‌లలోని ముస్లింలు పిండి వంటకాలను వండుకొని బంధు మిత్రులకు పంపిణీ చేశారు. నూతన వస్త్రాలను ధరించి ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వడ్డెపల్లి మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండి ఫయాజ్, ప్రధాన కార్యదర్శి మజర్, ఉపాధ్యక్షులు ఎండి ఖదీర్, జావీద్, కోశాధికారి ఎండి ఖబీర్, గౌరవ సలహాదారు డాక్టర్ ఎండి అన్వర్, యూసుఫ్‌ల ఆధ్వర్యంలో ఎన్జీవోస్ కాలనీలోని ఈద్గాలో మత గురువు (ఇమామ్) మౌలానా హుస్సేన్ షరీఫ్ నమాజ్ చేయించారు. ఖురాన్‌లోని ప్రవచనాలను పఠించారు. ఎన్జీవోస్ కాలనీ, జవహర్ కాలనీ, గోపాల్‌పూర్ బృందావన కాలనీలోని మసీదులలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా నేత కొంక హరిబాబు, బీజేపీ నేత బండి హరీష్ ముదిరాజ్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ ఉమర్ పాషా జవహర్ కాలనీ, బృందావన కాలనీలోని మసీదుల వద్ద నమాజ్ అనంతరం ముస్లిం సోదరులను కలుసుకొని రంజాన్ శుభాకాంక్షలను తెలుపుకున్నారు.

● ఐనవోలు: ఐనవోలు, పున్నేలు, ఒంటిమామిడిపల్లి, కొండపర్తి, ముల్కలగూడెం, వనమాల కనపర్తి, వెంకటాపూర్, గర్మిళ్లపల్లి, కక్కిరాలపల్లి, లింగమోరిగూడెం, నందనం, రాంనగర్, సింగారం, పంథిని గ్రామాల్లోని ముస్లింలు కొత్త దుస్తులు ధరించి సమీపంలో ఉన్న ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక నమాజ్‌ను అచరించారు. వెళ్లే ముందు పేద వారికి అందించే ఫిత్రా ప్రతీ ఒక్కరు రూ.100లు చొప్పున బాధ్యతగా చెల్లించారు. పిల్లలకు సైతం ఈది(నగదును) గిఫ్ట్‌గా ఇచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగ రోజున సర్వమతాలకు చెందిన ప్రముఖులు, నేతలు, అధికారులు, పౌరులు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పుతూ ఈద్గాలకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు తమ ఇళ్లకు ఆహ్వానించి 'షీర్‌ఖుర్మా' సేమీయా పాయసం తేనేటివిందును అందించారు.



రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



లింగమోరిగూడెంలో పండుగ నమాజ్‌ను అచరించిన ముస్లింలు

“నా ఊహల్లోని రాముడు పూర్వం ఈ భూమి మీద జీవించి ఉండవచ్చు, లేకపోవచ్చు. కానీ ‘రామరాజ్యం’ అనే పురాతనమైన భావన అత్యంత ప్రజాస్వామికమైనదనడంలో సందేహం లేదు. అక్కడ అతి మామూలు వ్యక్తి కూడా త్వరితమైన న్యాయాన్ని పొందుతాడు. రామరాజ్యం అంటే స్వచ్ఛమైన నైతికత ఆధారంగా ప్రజలకు సంక్రమించే సార్వభౌమాధికారం” అని మహాత్మా గాంధీ చెప్పారు.

గీతాసారం

మనో నియంత్రణ



అర్జునుడు మనసును గాలితో పోలుస్తూ... దాన్ని ఎలా అదుపులో పెట్టుకోవాలని ప్రశ్నిస్తాడు. అది కష్టమైనదని శ్రీకృష్ణుడు చెబుతూ... వైరాగ్యాన్ని అవలంబించడం ద్వారా దాన్ని సాధించగలమని బోధిస్తాడు. మనలోని జ్ఞాపకశక్తిని ఉపయోగించి... ఇంద్రియాలు అందించే సమాచారంలో ఏది సురక్షితమైనదో, ఏది సురక్షితం కాదో నిర్ధారించేలా మన మనసు శిక్షణ పొంది ఉంటుంది. మానవ పరిణామక్రమంలో ఆ సామర్థ్యమే మనం జీవించడానికి, అభివృద్ధి చెందడానికి ఉపయోగపడింది. మనసుకు ఉన్న ఇదే సామర్థ్యాన్ని అంతరాత్మను చేరడానికి కూడా ఉపయోగించవచ్చు. దాన్నే ‘జాగరూకత’ అని కూడా అంటారు. మనం ఈ సామర్థ్యం ద్వారా మన నిర్ణయాల నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చు. అందుకోసం కొత్త ఆలోచనలను మనసుకు అందించాలి. మానవుల్లో ఇది సహజంగా రాదు. కాబట్టి ఆచరణ ద్వారా ఆ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని శ్రీకృష్ణుడు సూచిస్తున్నాడు. ఇది మెదడులో కొత్త శక్తిని నింపడం లాంటిది.

రాగాన్ని అర్థం చేసుకోవడం ద్వారా వైరాగ్యాన్ని అర్థం చేసుకోవడం చాలా సులభం. ‘రాగం’ అంటే భౌతిక ప్రపంచంలో అందం, ఆస్తులు, అభివృద్ధి లాంటి ఆనందాల కోసం విస్తృతంగా పాకులాడడం. ద్వంద్వాల సూత్రం ప్రకారం ప్రతి రాగ భావం/ భావన వైరాగ్యంతో ముగుస్తుంది. కానీ మన దృష్టి ఎప్పుడూ రాగం పైనే ఉంటుంది. అందుకే వైరాగ్యాన్ని విస్మరిస్తాం.

స్టోయిసిజం లాంటి కొన్ని తత్త్వాలు వైరాగ్యానికి శిఖరం లాంటి మరణం ప్రయోజనాన్ని సమర్థిస్తాయి. దీన్ని ‘మెమెంటో మోరీ’ అంటారు. అంటే మరణాన్ని మళ్ళీ మళ్ళీ దర్శించడం లేదా అనుభూతి చెందడం. ఈ పద్ధతిలో వారు చావుకి గుర్తుగా (జ్ఞాపకార్థంగా) పని చేసే చోట లేదా ఇంట్లో ప్రముఖ స్థానంలో దేన్నైనా ఉంచి, దాన్ని మళ్ళీ మళ్ళీ చూస్తూ మృత్యువు మీద ధ్యాస నిలబడేలా చేస్తారు. భారతీయ వేదాంతం దీన్నే ‘శ్మశాన వైరాగ్యం’ అంటుంది. మనం వైరాగ్యాన్ని సాధన చేయడం మొదలుపెడితే... అది మనసును స్థిరపడేలా చేస్తుందని శ్రీకృష్ణుడు చెప్పాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సందేశం

షవ్వాల్ ఉపవాసాలు



పవిత్రమైన రంజాన్ ఉపవాస దీక్షలు, ఈద్-ఉల్-ఫితర్ పండుగ ముగిశాయి. ఇస్లాం క్యాలెండర్‌లో పదో మాసమైన షవ్వాల్ కొనసాగుతోంది. రంజాన్ మాసంలో చేసినట్టే షవ్వాల్ నెలలో కూడా ఆరు రోజుల పాటు ఉపవాస దీక్ష పాటించే సంప్రదాయం ఉంది. దీనివల్ల ఉపవాస ఫలితం పదింతలవుతుందన్నది పెద్దల మాట. అంటే రంజాన్ మాసంలో 30 రోజులు చేసే ఉపవాసం 300 రోజులకు... అంటే 10 నెలలకు సమానం. షవ్వాల్ మాసంలో కొనసాగించే ఆరు రోజుల ఉపవాసం 60 రోజులకు, అంటే రెండు నెలలకు సమానం. ఈ 36 రోజుల ఉపవాసాన్ని శ్రద్ధ, నిష్ఠలతో ఆచరిస్తే... 12 నెలలు... అంటే ఏడాది మొత్తం ఉపవాసం చేసిన ఫలితం లభిస్తుందని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ పేర్కొన్నారు. రంజాన్ మాసంలో చేసిన ఉపవాసాల్లో ఏవైనా పొరపాట్లు జరిగితే... షవ్వాల్ మాసంలో చేసే ఆరు ఉపవాసాల ద్వారా అల్లాహ్ ఆ పొరపాట్లను మన్నిస్తాడనీ, నమాజుల్లో ఏర్పడిన లోపాలను భర్తీ చేస్తాడనీ ఆయన స్పష్టం చేశారు. రంజాన్ ఉపవాసాలను ఎలాంటి ఆటంకం లేకుండా చేయగలిగే శక్తినీ, భక్తినీ ప్రసాదించినందుకు అల్లాహ్‌కు ధన్యవాదాలు తెలపడం దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. అల్లాహ్‌కు నిజమైన కృతజ్ఞతాపూర్వక విధేయుడిగా తనను తాను ప్రకటించుకొనే అవకాశం. ఆయన పట్ల విశ్వాసులకు ఉన్న చిత్తశుద్ధికీ, స్వీయ సమర్పణకూ ఒక సంకేతం.

అయితే షవ్వాల్‌లో ఆరు రోజుల ఉపవాసం తప్పనిసరి కాదు. సహేతుకమైన, న్యాయబద్ధమైన కారణం ఉన్నప్పుడు... దాని నుంచి మినహాయింపు ఉంటుంది. షవ్వాల్ ఉపవాసాలను ఈద్ పండుగ మరునాటి నుంచో, ఆ తరువాత రోజు నుంచో ప్రారంభించడం ఉత్తమం. వరుసగా ఆరు రోజులు పాటిస్తే మంచిది. అలా వీలుకానప్పుడు విడివిడి రోజులలో... అంటే విరామం ఇచ్చి కూడా, షవ్వాల్ నెల ముగిసేలోగా చేయవచ్చు. అయితే ఆలస్యం చేసేకొద్దీ ఏవైనా ఆటంకాలు ఎదురు కావచ్చు. కాబట్టి మంచి పనులను వీలైనంత త్వరగా, క్రమబద్ధంగా, నిరంతరాయంగా చేయాలి. షవ్వాల్ మాసంలో ఆరు ఉపవాసాలను ఎవరు పాటిస్తారో... వారు ఏడాదంతా ఉపవాసంలో ఉన్నట్టేననీ, అప్పుడే తల్లి గర్భం నుంచి బయటకు వచ్చినంత పవిత్రులవుతారనీ దైవప్రవక్త మహమ్మద్ పేర్కొన్నారు.

మహమ్మద్ వహీదుద్దీన్

దైవమార్గం

పునరుత్థానం తరువాత...



దైవ కుమారుడైన క్రీస్తు తన తండ్రి ఆదేశం మేరకు ఈ లోకానికి వచ్చాడు. దివ్య సందేశం ఇచ్చాడు. ప్రజలను చైతన్యపరిచాడు. అద్భుతాలు చేశాడు. మానవాళి కోసం రక్తం చిందించి... శిలువపై మరణించాడు. మూడో రోజున... ఆయన సజీవుడై తిరిగి వచ్చాడు. నలభై రోజుల పాటు ఈ భూమి మీద సంచరించాడు. ఆ రోజుల్లో ఆయన ఏం చేశాడు, ఎవరికి కనిపించాడు? బైబిల్‌లోని వివిధ అధ్యాయాల్లో ఆ వివరాలు కనిపిస్తాయి.

ఏసు మరణించిన తరువాత... ఆయన శిష్యులందరూ చెల్లాచెదురైపోయారు. వారిని ఆయన సమైక్యపరిచాడు. ఒక చోటుకు చేర్చాడు. వారికి నైతిక శక్తిని ప్రసాదించాడు. తన సందేశాన్ని లోకానికి అందించమని ఆదేశించాడు. ఎలా బోధించాలో నేర్పించాడు. పరిచర్యలో కొత్త మెలకువలను చెప్పాడు. వారిలో కొత్త ఉత్తేజాన్ని నింపాడు.

పునరుత్థానం అనంతరం ఏసు క్రీస్తు పలుసార్లు దర్శనమిచ్చాడు. వాటిలో ప్రధానమైనవి:


- మేరీ మగ్దలేనాకు... తన సమాధి దగ్గరే తోటమాలి రూపంలో ప్రభువు కనిపించాడు. ఈ వార్త అందరికీ తెలియజేయాలని చెప్పాడు. రెండోసారి కూడా తన సమాధి దగ్గరే మరో మహిళకు... తను మరణించలేదనడానికి రుజువుగా దర్శనమిచ్చాడు.
- ఎమ్మావూస్‌కు వెళ్ళే మార్గంలో తన శిష్యులు ఇద్దరికి కనిపించి, తన పట్ల వారిలో ఉన్న అస్పష్టతను తొలగించాడు.
- తమ గురువుకే ఇలా జరిగితే తమ పరిస్థితి ఏమిటనీ, ఎటువంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయోననీ భయపడుతూ దాక్కున్న పది మంది శిష్యులకు ఆయన దర్శనం ఇచ్చాడు.
- ఆ తరువాత మరో పదకొండు మంది శిష్యులకు కనిపించాడు. తన గాయం లోపల వేలు పెట్టి పరీక్షించిన... అవిశ్వాసి అయిన తోమాస్‌లో అపనమ్మకాన్ని పోగొట్టాడు.
- ఆయన (క్రీస్తు) ఎవరో నాకు తెలియదని మూడుసార్లు అసత్యం ఆడిన.... మిగిలిన ముగ్గురు శిష్యులతో పాటు పేతురుకు కనిపించాడు.
- అలాగే పదకొండు మంది శిష్యులకు ఆయన దర్శనమిచ్చాడు. వారు గెలిలీ తీరంలోని ఒక కొండపైకి చేరుకున్నారు. అక్కడ వారికి అన్ని శక్తి సామర్థ్యాలనూ ఆయన సమకూర్చాడు. తన శిష్యరికం కొనసాగించడానికి, సువార్త విస్తరణకు ఒక వ్యవస్థను స్థాపించాడు.
- తదనంతరం... గుమిగూడిన 500 మంది ప్రజానీకానికి కనిపించాడు. “కాలాలను, సమయాలను తండ్రి తన స్వాధీనంలో ఉంచుకున్నాడు. వాటిని తెలుసుకోవడం మీ పని కాదు. అయినప్పటికీ పరిశుద్ధాత్మ మీ చెంతకు వచ్చినప్పుడు మీరు శక్తిని పొందుతారు. యెరూషలేములోను, యూదయ, సమరయ దేశాల్లో, భూదిగంతాల వరకూ సత్యాన్ని వ్యాపింపజెయ్యండి” అంటూ తన సందేశాన్ని ఇచ్చాడు అందరూ చూస్తూ ఉండగానే... ఆయన ఆకాశం వైపు పయనం సాగించాడు. ఇదీ పునరుత్థానం అనంతరం క్రీస్తు సాగించిన నలభై రోజుల ప్రస్థానం.

డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు, 9866755024

పర్వదినం

ఆ మార్గం ఏ యుగానికైనా ఆదర్శమే...

17న శ్రీరామ నవమి



పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే... అన్నాడు ‘భగవద్గీత’లో శ్రీకృష్ణుడు. సాధు స్వభావులను రక్షించడానికి, దుష్ట కార్యాలు చేసేవారిని శిక్షించడానికి, ధర్మాన్ని స్థాపించడానికి ప్రతి యుగంలోనూ అవతరిస్తానంటూ భగవంతుడు చేసిన వాగ్దానం ఇది. శ్రీకృష్ణావతారం కన్నా ముందు... ధర్మ సంస్థాపన కోసం ఆయన ఈ భూవి మీద శ్రీరాముడిగా మహా విష్ణువు అవతరించాడు. కుమారుడిగా, సోదరుడిగా, భర్తగా, తండ్రిగా, పాలకుడిగా... అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ ఆదర్శంగా నిలిచాడు. ఆయన పాలన... రామరాజ్యంగా ప్రజా హృదయాల్లో సుస్థిరంగా నిలవడానికి కారణం... ఆయనలో మూర్తీభవించిన అనేక సుగుణాలు, నాయకత్వ లక్షణాలు.

శ్రీరాముడు ఎల్లప్పుడూ విలువలకే కట్టుబడ్డాడు. నీతి, నిజాయితీ, సమగ్రతలను ఎన్నడూ విడనాడలేదు. మంథర మాటలతో తన పినతల్లి కైకేయి ప్రభావితం అయిందనీ, తనను అడవులకు పంపేలా తన తండ్రి దశరథుణ్ణి ఒప్పించిందనీ శ్రీరాముడికి తెలుసు. కానీ ఎవరినీ ఆయన నిందించలేదు. తండ్రి మాటను పాటించి పద్నాలుగేళ్ళు అరణ్యవాసం చేశాడు. రాకుమారుడైనప్పటికీ అరణ్యవాసంలో అత్యంత సాధారణమైన జీవితం గడిపాడు. కందమూలాలు తిన్నాడు. కటిక నేల మీద నిద్రించాడు.

నాయకుడనేవాడికి తన లక్ష్యం మీద చిత్తశుద్ధి, స్పష్టమైన దృక్పథం ఉండాలి. రావణుడు అపహరించిన సీతను వెనక్కి తెచ్చుకోవడం శ్రీరాముడి లక్ష్యం. దాన్ని సాధించడానికి ఆయనకు కచ్చితమైన ప్రణాళిక ఉంది. సీతాన్వేషణ కోసం మొదట ఒక బృందాన్ని పంపాడు. సీతమ్మ జాడ తెలుసుకున్న తరువాత... లంకపై దండెత్తడానికి సేతువును నిర్మింపజేశాడు. తన సోదరుడు లక్ష్మణుడికి, సుగ్రీవ, విభీషణ, అంగదులకు వారివారి సామర్థ్యానికి అనుగుణంగా బాధ్యతలు అప్పగించాడు. శత్రువుకు సోదరుడైనప్పటికీ విభీషణుడి సూచనలు తీసుకున్నాడు. రావణుడి బలాబలాల గురించి సమాచారం తెలుసుకున్నాడు. అదే సమయంలో రావణుడి శక్తి యుక్తులను రాముడు ఏనాడూ తక్కువగా అంచనా వేయలేదు.

ఎటువంటి పరిస్థితి ఎదురైనా... తన అనుచరులను శ్రీరాముడు ముందుండి నడిపించాడు. లంకను చేరడానికి సేతువును నిర్మించే సమయంలో... దారి ఇవ్వడానికి అంగీకరించని సముద్రుణ్ణి లొంగదీశాడు. అన్ని సమయాల్లో తన ముఖ్య ఆంతరంగికులకే కాదు, వానర వీరులందరికీ అందుబాటులో ఉన్నాడు తప్ప... విశ్రాంతి మందిరంలో ఉండి ఆదేశాలు ఇవ్వలేదు. రావణుడి సేన కన్నా వానర సేన తక్కువ స్థాయిదని ఎప్పుడూ ఆలోచించలేదు. తన సేనపై నమ్మకం ఉంచాడు. వారిని ప్రోత్సహించాడు, వారిలో ప్రేరణ కలిగించాడు.

సీతను వెనక్కి తీసుకురాగలననే విషయంలో రాముడికి ఏనాడూ సందేహం లేదు. తన సామర్థ్యం మీద ఆయనకు నమ్మకం ఉంది. అదే సమయంలో... రాక్షస సేనపై గెలుపు కోసం వానర సేనను నడిపించగలననే విశ్వాసమూ ఉంది. ఏ దశలోనూ ఆయనలోని ఆత్మవిశ్వాసం చెదరలేదు.

సహకారం అనేది పరస్పరం ఉండాలనే సంగతి రాముడికి తెలుసు. వానరులను తన ఆంతరంగికులుగా ఆయన పరిగణించాడు. సుగ్రీవుడి కోరిక ప్రకారం వాలిని చంపిన తరువాతే... సీతాన్వేషణ కోసం వానరుల సాయం తీసుకున్నాడు. రావణుడితో విభేదించి వచ్చిన విభీషణుణ్ణి ఆదరించాడు. లంకకు రాజును చేస్తానని మాట ఇచ్చి, దాన్ని నిలబెట్టుకున్నాడు.

రాజ్యాన్ని వదిలి అడవికి వెళ్ళాల్సి రావడం, సీతా వియోగం, ప్రాణ సమానుడైన లక్ష్మణుడు తీవ్రంగా గాయపడడం... ఇలా రాముడికి ఎన్నో సంక్షోభాలు ఎదురయ్యాయి. కానీ ఏనాడూ స్థైర్యాన్ని కోల్పోలేదు. క్లిష్ట సమయాల్లో... ప్రశాంత చిత్తంతో, సరైన నిర్ణయాలు తీసుకున్నాడు, స్థితప్రజ్ఞత ప్రదర్శించాడు.

‘రాముడు మంచి బాలుడు’... ఈ మాట మనం తరచూ వింటూ ఉంటాం. కానీ ఆయన మంచి నాయకుడనీ, గొప్ప పాలకుడనీ రామాయణంలోని ప్రతి సందర్భం నిరూపిస్తుంది. “నా ఊహల్లోని రాముడు ఈ భూమి మీద పూర్వం జీవించి ఉండవచ్చు, లేకపోవచ్చు. కానీ ‘రామరాజ్యం’ అనే పురాతనమైన భావన అత్యంత ప్రజాస్వామికమైనదనడంలో సందేహం లేదు. అక్కడ అతి మామూలు వ్యక్తి కూడా తాత్సారంతో, ఖర్చుతో కూడిన తతంగం లేకుండా త్వరితమైన న్యాయాన్ని పొందుతాడు. రామరాజ్యం అంటే స్వచ్ఛమైన నైతికత ఆధారంగా ప్రజలకు సంక్రమించే సార్వభౌమాధికారం” అని మహాత్మా గాంధీ చెప్పారు. శ్రీరామనవమి శ్రీరాముని పుట్టిన రోజే కాదు... ఆయన పట్టాభిషిక్తుడైన రోజు.... నాడు రామరాజ్యం ఆరంభమైన రోజు. ప్రజాపాలనలో ఆయన చూపిన మార్గం... ఏ యుగానికైనా ఆదర్శమే.



వారణాసి

ఒకటే లక్ష్యం... అదే మోక్షం



మోక్షానికీ, కాశీకీ ఉన్న సంబంధం గురించి నా సందేహాలకు సమాధానాలు అన్వేషిస్తూ... కాశీలో నేనూ, నా మిత్రుడు తిరుగుతున్నాం. కాశీ విశ్వనాథ మందిరానికి సమీపంలోని గొదలియాలో కాశీలాభ ముక్తి భవనం ఉంది. అక్కడ మేనేజర్ గోరఖ్‌పూర్‌కు చెందిన భైరవనాథ్ శుక్లా. ఆయన మాకు అతిథి మర్యాదలు చేశారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం... ఆ భవనాన్ని 1958లో శ్రీ దాల్మియా తన తల్లి జ్ఞాపకార్థం నిర్మించారు. దీనిలో పది గదులు ఉన్నాయి. ఎక్కువగా బిహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు వస్తారు. మరణించే స్థితిలో ఉన్నవారికి... కేవలం పదిహేను రోజులకు మాత్రమే అద్దెకు ఇస్తారు. అక్కడ భోజనం, వస్త్రాలు, వసతులు ఉచితం. మాంసం, మద్యం నిషేధం.

అక్కడినుంచి లలితాఘాట్‌కు వెళ్ళాం. అది విశ్వనాథ మందిర గంగాముఖద్వారం పక్కన ఉంది. అక్కడే నేపాలీ మందిరం కూడా ఉంది. పగోడా శైలిలో చెక్కతో కట్టిన పశుపతినాథ దేవాలయం అది. ఆ మందిరానికి నేను చాలాసార్లు వెళ్ళాను. ఆ మందిరం వరండాలో కూర్చొని బనారస్ ఘాట్లు అన్నిటినీ చూడవచ్చు. రాజఘాట్ నుంచి అస్సీ ఘాట్ వరకూ రాత్రి దీపాల కాంతిలో... అర్ధ చంద్రాకారంలో దర్శనమిస్తుంది - కాశీ. నేపాల్ రాజు బహదూర్‌షా వైరాగ్యం చెంది కాశీ వచ్చారు. అక్కడ ఆరేళ్ళు ఉన్నారు. ఈ దేవాలయాన్నీ, తన భార్య లలితాదేవి పేరిట లలితాఘాట్‌నూ కట్టించారు.

నేపాలీ ముముక్షు భవన్ మేనేజర్ రోహిత్‌ను ఆలయ పూజారి పరిచయం చేశారు. రోహిత్ నేపాల్‌లో పుట్టి, అసోంలో పెరిగారు. కాశీలో చదువుకున్నారు. సంస్కృతంలో పిహెచ్‌డి చేశారు. వయసు ముప్ఫయ్యేడేళ్ళు. కాషాయ వస్త్రాలు ధరించారు. పెద్ద గడ్డం, జుట్టు ఉన్నాయి. కళ్ళలో నిర్మలత పలకరిస్తోంది.

“నా స్నేహితులు ఉద్యోగాలు చేస్తున్నారు. నేను మోక్షగాములకు సేవ చేస్తున్నాను” అన్నారు రోహిత్.

బిల్వపత్రం మీద పూజారి గంధం పెట్టి రోహిత్‌కు ఇస్తే... ఆయన దాన్ని నా నుదుట రాశారు. “ఈ పూజారులు కూడా నేపాలీలే” అని చెప్పారు.

“నేపాల్‌నుంచి వచ్చి వీళ్ళంతా ఇక్కడ ఎలా ఉండగలుగుతున్నారు?” అని ప్రశ్నించాను.

“ప్రతి హిందువూ కాశీలో మరణించాలనుకుంటారు. ఆ అదృష్టం దక్కకపోతే... తమ దహన సంస్కారాలు ఇక్కడ జరగాలనుకుంటారు. అదీ కాకపోతే అస్థి నిమజ్జనమైనా గంగలో చేయాలనుకుంటారు” అంటూ ఆ వరండానుంచి మణికర్ణికా ఘాట్‌ను, అక్కడ దహనమవుతున్న మృతదేహాలను చూపించారు. “కాశీలో మరణం వరం. అది శోకం కాదు, భగవంతుని ఆశీర్వాదం” అని అన్నారు.

“కాలుతున్న శవాలను చూసి వీళ్ళు భయపడరా?” అని అడిగాను.

“లేదు. వీళ్ళకు చావు భయం కాదు, లక్ష్యం. ఇక్కడ శవయాత్రలు దైనందిన దృశ్యం. ‘రామ్ నామ్ సత్య హై’ అంటూ మృతదేహాలను తీసుకువెళ్తూ ఉంటారు” అన్నారు.

“మోక్షం కోసం కాశీ ఒక్కటేనా? మరే నగరమూ లేదా?” అంటూ నాలోపల దాగిన సందేహాన్ని బయటపెట్టాను.

“ఏడు మోక్ష నగరాలు ఉన్నట్టు హిందూ ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. అయోధ్య, మథుర, హరిద్వార్, కాశీ, కంచి, ఉజ్జయిని, ద్వారక... ఇవి మోక్ష నగరాలు. కానీ అన్నిటిలో కాశీకే అగ్రతాంబూలం. ‘అన్యాని ముక్త క్షేత్రాణి/ కాశీ ప్రాప్య విముచ్యంతో నన్యతా తీర్థ కోటిభిః...’ - మిగతా క్షేత్రాల్లో దేహాన్ని విడిచినవారికి... తదుపరి జన్మలో కాశీవాస లాభం కలుగుతుందనే నమ్మకం ఉంది. కాశీలో మరణించినవారిపై యమునికి అధికారం లేదని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ మరణించేవారికి... వారి కుడిచెవిలో... మరణ సమయంలో విశ్వనాథుడు తారకమంత్రం చెబుతాడట. తద్వారా వారికి జ్ఞానం, ఆ జ్ఞానం ద్వారా మోక్షం లభిస్తాయి. అంటే జనన మరణ చక్రం నుంచి ఆ ప్రాణికి విముక్తి కలుగుతుంది. అదే మోక్షం. అందుకే కాశీ మోక్షదాయని. ఆ విశ్వాసంతోనే కాశీ వాసం కోసం దేశ విదేశాల నుంచి వస్తారు” అని చెప్పారు రోహిత్. ఆయనకు ధన్యవాదాలు చెప్పి బయలుదేరాం.

ఆయన చెప్పినది వింటున్నప్పుడు ‘ముంబయి-వారణాసి ఎక్స్‌ప్రెస్’ అనే లఘుచిత్రం నాకు గుర్తుకువచ్చింది. వైరాగ్యభావన లేనివారు కాశీలో మరణించాలని వచ్చినా... అక్కడ చనిపోలేరని ఆ చిత్రం చెబుతుంది.

కాశీలో చాలా మోక్ష భవనాలు ఉన్నాయి. అద్దెకు ఇళ్ళు ఉన్నాయి. కొనుక్కొని ఉండడానికి గదులు ఉన్నాయి. సనాతన హిందూ ధర్మంలో చెప్పిన సన్యాసాశ్రమానికి ఇవన్నీ ఆధునిక రూపాలే. కాశీ మోక్షగాముల్లో ఉద్యోగులున్నారు, వ్యాపారులున్నారు, సమాజ సేవకులున్నారు, నిరుపేదలున్నారు, నిస్సహాయులున్నారు. వీరందరి లక్ష్యం ఒకటే... మోక్షం. వీరందరి మార్గం ఒక్కటే... వైరాగ్యం.

కిల్లాడ సత్యనారాయణ,
లక్నో



నాలుగు క్షేత్రాలు

‘పద్మపురాణం’ కాశీ పరిధిలోనే ఉన్న నాలుగు క్షేత్రాల (ప్రదేశాల) గురించి చర్చిస్తుంది. వాటిలో మరణించేవారికి ప్రాప్తించే మోక్షాలు వేరు వేరని సూచిస్తుంది. వాటిలో మొదటిది... కాశీ క్షేత్రం. ఇది విశాలమైనది. వారణాసికి వెలుపల విస్తరించిన ప్రదేశం. పంచక్రోశి మార్గాన్ని కలుపుకొని ఉంటుంది. విస్తీర్ణం సుమారు డెబ్భై అయిదు మైళ్ళు. రెండోది వారణాసి క్షేత్రం. ఇది కాశీ లోపల ఉంటుంది. దీనికి ఉత్తరంలో వరుణ నది, దక్షిణంలో అసి నది, తూర్పున గంగ ఉంటాయి. పశ్చిమంలో పాశపాణి వినాయకుడు ఉంటాడు. మూడోది అంతర గృహం. ఇది వారణాసి లోపల ఉంటుంది. దీనికి ఉత్తరంలో భార్ భూటేశ్వర్ మందిరం, దక్షిణంలో బ్రహ్మేశ్వర్ మందిరం, తూర్పున మణికర్ణికేశ్వర్ మందిరం, పశ్చిమంలో గోకర్ణేశ్వర్ మందిరం ఉంటాయి. నాలుగోది... అవిముక్తేశ్వర క్షేత్రం. ఇది అంతరగృహం లోపల ఉంటుంది. ఉత్తరంలో ఘంటాకర్ణేశ్వర్ మందిరం, దక్షిణంలో భూతధాత్రీశ్వర్ మందిరం, తూర్పున అట్టహాసేశ్వర మందిరం, పశ్చిమంలో గోకర్ణేశ్వర మందిరం ఉన్నాయి. ఇది కాశీ విశ్వేశ్వరుడికి నాలుగువైపులా వ్యాపించి ఉంది. కాశీ క్షేత్రంలో మరణించిన వారికి సాలోక్య ముక్తి, వారణాసి క్షేత్రంలో సారూప్య ముక్తి, అవిముక్త క్షేత్రంలో సాయుజ్యం, అంతరగృహంలో మరణిస్తే కైవల్యం ప్రాప్తిస్తాయి. కానీ బలవన్మరణాలకు (హత్యలకు, ఆత్మహత్యలకు) ముక్తి లేదు. మరణం సహజమై ఉండాలి.

జెన్ కథ

జ్ఞానులు చూపిన మార్గం

ఒక జెన్ గురువు తన మఠంలో శిష్యులను, సందర్శకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్నాడు. అందరూ ఆయన బోధను శ్రద్ధగా వింటున్నారు. అంతలో భూకంపం వచ్చింది. ఆ గురువు తప్ప మిగిలిన వారందరూ భయాందోళనలతో లేచి పరుగులు తీశారు. భూకంపం తీవ్రతకు గదిలోని అలమరలు, వాటి పైన, లోపల ఉన్న వస్తువులు, గోడలకు అమర్చిన వస్తువులు కింద పడి చెల్లాచెదురైపోయాయి. వాటిని దాటుకుంటూ కొందరు పక్క గదుల్లోకి, మరికొందరు మఠం ముఖద్వారంలోంచీ బయటకు పారిపోయారు.

కొంతసేపటికి ప్రకంపనలు తగ్గాయి. సాధారణ పరిస్థితి ఏర్పడింది. శిష్యుల భయం, ఆందోళన తగ్గాయి. అప్పుడు గురువుగారు గుర్తొచ్చారు. “అయ్యో! గురువుగారిని వదిలేసి మనం బయటకు వెళ్ళిపోయాం. తప్పు చేశాం” అనుకున్నారు. జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ... గురువు ఉన్న చోటుకు వచ్చారు. అక్కడ గురువు కదలకుండా, మెదలకుండా, నవ్వు ముఖంతో... ఉన్నచోటే కూర్చొని ఉన్నాడు. శిష్యులు ఆయనకు నమస్కరించి “మహాశయా! భూకంపం వచ్చిందని మేమందరం భయంతో బయటకు పరుగులు తీశాం కదా! మీకు భయం కలగలేదా? మీరెందుకు పారిపోకుండా కూర్చున్నారు?” అని ప్రశ్నించారు.

అప్పుడు గురువు ప్రశాంతంగా “నేనూ పారిపోయాను. మీరు బయటకు పారిపోతే నేను (నా) లోపలకు పారిపోయాను. ఈ గదిలోంచి మరో గదిలోకి పోయినా, భవనం నుంచి బయటకు పోయినా... భూకంపం ప్రభావాన్ని ఎలా తప్పించుకోగలం? అందుకే ఆ ప్రభావం ఏమాత్రం ఉండని నా హృదయంలోకి పరుగు తీశాను” అన్నాడు. అంటే ఆయన గాఢమైన ధ్యానంలోకి వెళ్ళాడన్నమాట.



ప్రపంచంలో భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, సునామీలు... ఇలా ఎన్నో విపత్తులు సంభవిస్తూ ఉంటాయి. జీవితంలోనూ ప్రమాదకరమైన సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఆత్మీయుల మరణాలు, ఆస్తులన్నీ పోవడం లాంటి సంఘటనల వల్ల కలిగే బాధ... భూకంపం కన్నా, జలప్రళయం కన్నా తక్కువేం కాదు. భూకంపాలు, వరదల నుంచి తప్పించుకోవచ్చు కానీ... వ్యక్తిగత కష్టాలు మీద పడినప్పుడు తప్పించుకోలేం. బాధపడక తప్పదు. అవి మనకు ఆందోళన, భయం కలిగించకుండా ఉండాలంటే... జ్ఞానులు చూపిన మార్గం ఒక్కటే శరణ్యం. అదే... బయటకు పరుగులు తీసే మనసును లోపలికి మళ్ళించడం. దీనికి నిరంతర సాధన అవసరం.

రాచమడుగు శ్రీనివాసులు



ఈ ప్రచారాన్ని.. అరికట్టాల్సిందే!

తెలుగు సినీ పరిశ్రమలోని అగ్రనిర్మాతల్లో దిల్‌రాజు ఒకరు. ఇటీవల ఆయన నిర్మించిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా విడుదలయింది. చాలా ప్రాంతాల్లో సినిమా చూసి ఎంతో మంది బాగుందన్నారు. కానీ సినిమా విడుదలకు ముందే కొన్ని యూట్యూబ్ రివ్యూలు వచ్చేశాయి. సినిమా బాగోలేదనే ప్రచారం విస్తృతంగా జరిగింది. ఈ కారణంగా సినిమా ఓపెనింగ్స్ దెబ్బ తిన్నాయి. దీంతో దిల్‌రాజే స్వయంగా మైక్ పట్టుకొని- 'పబ్లిక్ ఓపినియన్' అడిగి సోషల్ మీడియాలో పెట్టారు. తమను కావాలని టార్గెట్ చేశారని- ఫ్యామిలీ స్టార్ హీరో విజయ్ దేవరకొండ మేనేజర్ అనురాగ్ పర్వతనేని పోలీసు కేసు కూడా పెట్టారు. నిజంగా ఒక సినిమా జయాపజయాలను ప్రభావితం చేసే శక్తి సోషల్ మీడియాకు ఉందా? ఎవరైనా కావాలని సోషల్ మీడియాలో ఇలాంటి పనులు చేస్తే ఏం చేయాలి? ఈ అంశాలపైనే ప్రస్తుతం ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది.

సినిమా విడుదలకు ముందు ఫ్యాన్స్ వార్స్ జరగటం మామూలే! కొన్ని సెటైర్లు.. కొన్ని నెగెటివ్ కామెంట్స్.. రికార్డులు తవ్వితీయ్యడాలు సోషల్ మీడియాలో జరుగుతూనే ఉంటాయి. కానీ ఈ మధ్యకాలంలో ఈ దాడులు మరింతగా పెరిగిపోయాయి. ఒకప్పుడు సినిమా విడుదలకు ముందు ఇంత హడావిడి ఉండేది కాదు. పైగా పత్రికలు, ఛానల్స్, వెబ్‌సైట్స్ సంఖ్య చాలా పరిమితంగానే ఉండేది. వాటిలో వచ్చే రివ్యూలు చాలా పాజిటివ్‌గానే ఉండేవి. సోషల్ మీడియా విస్తృతి బాగా పెరగటం.. అందరికీ ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి రావటంతో పరిస్థితులు మారాయి. "ఫ్యాన్స్ మధ్య వార్స్‌కు మేము వ్యతిరేకం కాదు. సరదాగా వచ్చే ట్రోల్స్‌కు కూడా మేము వ్యతిరేకం కాదు. కానీ సినిమా విడుదల కాకముందే- సినిమా పోస్టర్ ముందు నిలబడి- సినిమా బాగోలేదని యూట్యూబ్ రివ్యూలు ఇవ్వటం ఇప్పటి దాకా జరగలేదు. అందుకే మేము వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను అప్రోచ్ అయ్యాం. దీనికి కారణమయిన వారిని శిక్షించమని కోరాం" అని విజయ్ దేవరకొండ మేనేజర్ అనురాగ్ పర్వతనేని పేర్కొన్నారు. ఇలా రివ్యూలు ఇచ్చిన వారిని, వారి ఛానల్స్‌ను గుర్తించటానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు.

ప్రభావితం చేస్తున్నారు..

సాధారణంగా మన కంటే అమెరికాలో షోలు ముందుగా వేస్తారు. దీని వల్ల అమెరికాలో సినిమా చూసిన వారు వెంటనే రివ్యూలు పోస్ట్ చేస్తుంటారు. . ఈ రివ్యూలతో పాటుగా- బుక్‌మై షో వంటివి కూడా ప్రేక్షకుల దగ్గర నుంచి రేటింగ్స్‌ను కలెక్ట్ చేస్తూ ఉంటాయి. ఈ రెండింటిని నచ్చినట్లు నియంత్రించగలిగితే- దాని ప్రభావం కలెక్షన్లపై పడుతుంది. ఉదాహరణకు అమెరికాలో షో పూర్తయ్యే సమయానికి - మన దేశంలో షోలు పడుతూ ఉంటాయి. సినిమా బాగోలేదని ట్విట్టర్‌లో నెగెటివ్ రివ్యూలు వరసగా రావటం మొదలైతే - వాటి ప్రభావం ప్రేక్షకులపై పడుతుంది. సినిమాకు వెళ్లాలనుకున్నవారు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. మన దేశంలో షోలు పూర్తయిన తర్వాత నెగెటివ్ రివ్యూలు రావటం మొదలుపెడితే- సినిమా ఫ్లాప్ అనే భావన బాగా పెరుగుతుంది. కొందరు- బుక్‌మై షో వంటి అప్లికేషన్స్‌లో టిక్కెట్లు కొనుక్కోవాలనుకుంటారు. అలాంటి అప్లికేషన్లలో కూడా రేటింగ్స్ తక్కువ ఉంటే సినిమాకు వెళ్లరు. "గతంలో 'గుంటూరు కారం' విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు మా 'ఫ్యామిలీస్టార్' విషయంలో కూడా అదే జరిగింది. కొందరు బోట్స్ ద్వారా తక్కువ రేటింగ్స్ ఇప్పిస్తున్నారు. ఉదాహరణకు ఒకే సారి పది వేల నెగెటివ్ రివ్యూలు వస్తే- సినిమా రేటింగే పడిపోతుంది" అని చెప్పారు అనురాగ్. ఈ విషయంపై తాము బుక్ మైషోకు ఒక ఉత్తరం రాశామని.. సమాధానం కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

అసలు కారణాలేమిటి?

ప్రస్తుతం తెలుగు సినిమాలకు విదేశాలలో మార్కెట్ బాగా పెరిగింది. అక్కడ మంచి కలెక్షన్లు వస్తే- సినిమాకు ఇబ్బంది ఉండదు. కానీ అక్కడ కలెక్షన్లలో కోత పడితే- నిర్మాతకు నష్టం వస్తుంది. దీనిని గమనించి కొందరు కావాలనే నిర్మాతలను ఇబ్బంది పెడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సినిమా బావుండనప్పుడు- ఎంత గొప్ప రివ్యూ రాసినా ప్రేక్షకులు వెళ్లరు. కానీ సినిమా బావున్నా- బాగోలేదని రివ్యూలు వస్తే- ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. ఈ సున్నితమైన అంశాన్ని కొంతమంది తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. "సినిమా విడుదల సమయంలో నిర్మాత చాలా ఒత్తిడిలో ఉంటాడు. దాన్ని కొందరు తమకు అనుకూలంగా మలుచుకుంటారు అని సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్న ఒక నిర్మాత విశ్లేషించారు. ఒక ప్రముఖ వెబ్‌సైట్- అట్టర్ ఫ్లాప్ అయిన యాత్ర అనే సినిమాకు 4 రేటింగ్‌ను.. అదే సమయంలో విడుదలయిన గుంటూరు కారం సినిమాకు అతి తక్కువ రేటింగ్‌ను ఇచ్చింది. మనవాడైతే ఒక రేటింగ్.. కాకపోతే ఇంకో రేటింగ్.. ఇలాంటి సంఘటనలెన్నో" అంటారాయన.



> ఇదొక విష సంస్కృతి.. బావున్న సినిమాను కూడా బాగోలేదని ప్రచారం చేయటం.. కలెక్షన్లు రాకుండా అడ్డుకోవటం తగని పని. దీని వల్ల వ్యక్తుల కన్నా- సినీ పరిశ్రమకు ఎక్కువ నష్టం జరుగుతుంది. ఈ సమస్యను సృష్టిస్తున్నవారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. ఈ సమస్యను అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..
>
> \- దిల్ రాజు

పరిష్కారమేమిటి?

ఈ మధ్యకాలంలో ఈ తరహా సంఘటనలు పెరిగిపోతూ ఉండటంతో- ఛాంబర్ తరపున కొన్ని నియంత్రణ చర్యలు తీసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా గతంలో పోలీసు డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉన్నత అధికారులతో కూడా చర్చలు జరిపారు. "ఇది ఒక విష సంస్కృతికి దారి తీస్తోంది. దీని వల్ల మొత్తం పరిశ్రమే దెబ్బతింటోంది. ఈ సారి నాకు నష్టం జరగవచ్చు. కానీ ఇదే కొనసాగితే ఇతరులకు కూడా నష్టం జరుగుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అందరూ సంఘటితంగా ఉండాల్సిన అవసరముంది" అని దిల్‌రాజు తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

హీరో రామ్ చరణ్‌కు 'గౌరవ డాక్టరేట్'



చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హీరో రామ్‌చరణ్‌కు చెన్నైలోని వేల్స్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనుంది. చిత్రపరిశ్రమతో పాటు సమాజానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్టు వేల్స్ విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 13 సాయంత్రం 4 గంటలకు చెన్నై పల్లావరంలోని వేల్స్ క్యాంపస్‌లో జరిగే యూనివర్శిటీ 14వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారామ్ పాల్గొని ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తారు. ఈ స్నాతకోత్సవంలో రామ్ చరణ్‌తో పాటు చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి.వీరముత్తువేల్, త్రివిట్రన్ హెల్త్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్, ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ జీఎస్‌కే వేలు, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ పద్మశ్రీ శరత్ కుమల్ అచంటలకు కూడా ఈ గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి వేల్స్ యూనివర్శిటీ చాన్సెలర్ డాక్టర్ ఐసరి కె.గణేశ్ అధ్యక్షత వహించనున్నారు.

వార్‌కు రెడీ



జూనియర్ ఎన్టీఆర్ 'వార్ 2' సెట్స్‌లోకి అడుగుపెట్టారు. గురువారం ముంబైలో ఆయన తన పాత్రకు సంబంధించిన షూటింగ్ మొదలుపెట్టారు. దీనికి సంబంధించిన వీడియో, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఇందులో ఎన్టీఆర్ గూఢచారి పాత్రలో కనిపించనున్నారు. హీరోగా ఆయనకు ఇది తొలి హిందీ చిత్రం. వచ్చే ఏడాది ఆగస్టు 15న 'వార్ 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. 'వార్'కు సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో హృతిక్‌రోషన్ మరో హీరోగా నటిస్తున్నారు. కియారా అద్వాణీ కథానాయిక. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది.

స్వచ్ఛమైన తెలుగింటి టైటిల్



రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా నటిస్తున్న చిత్రం 'సఃకుటుంబానాం'. ఉదయ్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, సత్య, శుభలేఖ సుధాకర్, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, బద్రం కీలక పాత్రలు పోషిస్తున్నారు. హెచ్ మహదేవ గౌడ్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మహదేవ గౌడ్ మాట్లాడుతూ "అచ్చమైన తెలుగింటి టైటిల్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నందుకు చాలా మంది మెచ్చుకున్నారు. ఈ సినిమా మంచి కుటుంబ చిత్రంగా ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతుంది" అని అన్నారు. డైరెక్టర్ ఉదయ్ శర్మ మాట్లాడుతూ "రేషన్ కార్డులాగా ఉన్న ఫస్ట్ లుక్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాకి మణిశర్మ మ్యూజిక్ చాలా పెద్ద అసెట్. సినిమాలో చాలా మంచి కంటెంట్ ఉంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శశాంక్ మలి, డిఓపీ: మధు దాసరి, సంగీతం: మణి శర్మ.

బ్యాంక్ క్యాషియర్ కహానీ



వివిధ భాషల్లో విభిన్న చిత్రాలు చేస్తూ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను రంజాన్ సందర్భంగా విడుదల చేశారు. ఇందులో బ్యాంక్ క్యాషియర్‌గా ఇంతకుమునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ కనిపించారు. ఒక సాధారణ వ్యక్తి అసాధారణ స్థాయికి ఎలా చేరుకున్నాడు అనే ఆసక్తిని రేకెత్తిస్తూ రూపొందించిన టీజర్ ఆకట్టుకుంటోంది. టీజర్‌లో దుల్కర్ పలికిన సంభాషణలు, ఆసక్తిని పెంచుతున్నాయి. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: నిమిష్ రవి, ఎడిటింగ్: నవీన్ నూలి.

విశ్వం.. విధ్వంసం



కల్యాణ మండపంలో పెళ్లి జరుగుతోంది. పురోహితుడు పెళ్లి మంత్రాలు చదువుతున్నాడు. వాద్య బృందం రకరకాల వాయిద్యాలతో సందడి చేస్తోంది. మరో పక్క విందు కోసం రుచికరమైన ఆహార పదార్థాలను చెఫ్‌లు సిద్ధం చేస్తున్నారు. ఇంతలో గిటార్ బ్యాగ్‌ని భుజాన వేసుకుని అక్కడికి వచ్చాడు. ఒక చోట ఆగి ఆ బ్యాగ్ ఓపెన్ చేశాడు. అందులోంచి గిటార్‌ను కాదు.. మెషిన్ గన్‌ను తీసుకుని వధువరులతో సహా అందరినీ కాల్చడం ప్రారంభించాడు. వాళ్లంతా నేలకు ఒరిగిన తర్వాత అక్కడి ఫుడ్‌ని ఆస్వాదిస్తూ 'దానే దానే పే లిఖా .. ఖానే వాలే కా నామ్.. ఇస్పే లిఖా మేరా నామ్' అన్నాడు. ఎవరతను? పెళ్లిమంటపంలో ఎందుకీ విధ్వంసం సృష్టించాడు? ఈ ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'విశ్వం' అని పేరు పెట్టి విడుదల చేసిన ఫస్ట్ స్ట్రైక్ వీడియోలోని మాటర్ ఇది. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే: గోపీమోహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, ఛాయాగ్రహణం: గుహన్, సహ నిర్మాత: వివేక్ కూచిబొట్ల, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి.

దాసరి పురస్కారాలు



ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన పేరిట పురస్కారాలు ఇవ్వడానికి దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, రేలంగి నరసింహారావు, నిర్మాత సి. కల్యాణ్, బీఎస్‌ఎన్ సూర్యనారాయణల ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పడింది. మే 4న శిల్ప కళావేదికలో దాసరి నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది. 'దర్శకరత్న డి.ఎన్.ఆర్ ఫిల్మ్ అవార్డ్స్' పేరుతో పురస్కారాలు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. పలు విభాగాల్లో విశేష కృషి చేసిన సినీ ప్రముఖులను ఎంపిక చేసి పురస్కారాలు అందిస్తామని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

పాటలు ప్రత్యేకాకర్షణగా...



మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ కుమార్ మేగోటి దర్శకుడు. ఎం.ఎస్.కె నిర్మాత. ఈ చిత్రం ఆడియో విడుదల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సంగీత దర్శకులు ఆర్ పీ పట్నాయక్, శ్రీలేఖ, రఘు కుంచె, ఘంటాడి కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక పీరియాడిక్ డ్రామా. అమ్మవారి భక్తురాలిని దుష్టశక్తుల బారి నుంచి కాపాడే క్షేత్రపాలకుడి కథ. ఐదు భాషల్లో రూపొందుతోంది' అన్నారు. పాటలు చాలా బావున్నాయి, ఈ సినిమా విజయంలో పాటలు ముఖ్య పాత్ర పోషిస్తాయి అని అతిథులు పేర్కొన్నారు. శివ కంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తర్ నోరానా కీలకపాత్రలు పోషిస్తున్నారు.

జనతా బార్‌లో కుస్తీ పోటీలు



రాయ్ లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'జనతా బార్'. రమణ మొగిలి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు శక్తికపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని మే లో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కుస్తీ పోటీల నేపథ్యంలో నడిచే కథ ఇది. నేటి సమాజంలో మహిళ ప్రాధాన్యాన్ని చెప్పే సినిమా ఇది.' అని చెప్పారు.

'బార్ గర్ల్‌గా ఉన్న యువతి మహిళలు గర్వపడే స్థాయికి ఎలా చేరిందన్న కథతో ఈ సినిమా ఉంటుంది. ఈ చిత్రం నేను చేయకపోతే ఓ మంచి అవకాశం కోల్పోయేదాన్ని' అన్నారు లక్ష్మీరాయ్. 'యానిమల్' తర్వాత మళ్లీ ఓ మంచి పాత్రను ఈ సినిమాలో చేసే అవకాశం లభించిందని శక్తి కపూర్ చెప్పారు. ఈ చిత్రానికి సమర్పణ: అశ్వథ్ నారాయణ.

నేటి మ్యాచ్
లఖ్‌నవూ x ఢిల్లీ
వేదిక: లఖ్‌నవూ రా.7.30 గం.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
316 పరుగులు	10 వికెట్లు

ముంబై మురిసె..

వరుసగా రెండో గెలుపు ● ఇషాన్, సూర్య మెరుపు అర్ధసెంచరీలు ● చిత్తుగా ఓడిన బెంగళూరు

బుమ్రాకు ఐదు వికెట్లు



బుమ్రా (4-0-21-5)

ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 69)

ముంబై: సొంత మైదానంలో ముంబై ఇండియన్స్ మరోసారి అదరగొట్టింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 69) అందించిన మెరుపు ఆరంభానికి.. 'మిస్టర్ 360' సూర్యకుమార్ (19 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 52) ఇచ్చిన ఫినిషింగ్ టచ్‌కు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బౌలర్లు చేష్టలుడిగిపోయారు. బంతి ఎక్కడ పడినా బౌండరీకే అన్నట్టుగా వీరి ఆట సాగడంతో 197 పరుగుల ఛేదనను ముంబై 27 బంతులుండగానే ముగించింది. దీంతో 7 వికెట్ల తేడాతో గెలిచిన హార్దిక్ సేన నాలుగు పాయింట్లు సాధించింది. బౌలింగ్‌లో బుమ్రా (4-0-21-5) చెలరేగాడు. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసింది. డుప్లెసి (40 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 61), దినేశ్ కార్తీక్ (23 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 53 నాటౌట్), రజత్ పటీదార్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 50) అర్ధసెంచరీలు సాధించారు. ఛేదనలో ముంబై 15.3 ఓవర్లలో 3 వికెట్లకు 199 పరుగులు చేసి నెగ్గింది. రోహిత్ (38) పర్వాలేదనిపించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బుమ్రా నిలిచాడు.

> **1** ఐపీఎల్‌లో ఎక్కువసార్లు (17) డకౌటైన బ్యాటర్ మ్యాక్స్‌వెల్. దినేశ్ కార్తీక్, రోహిత్‌తో సమంగా నిలిచాడు.

ఇషాన్, సూర్య బాదుడు: ఫ్లాట్ పిచ్‌పై 197 పరుగుల ఛేదనను ముంబై అలవోకగా పూర్తి చేసింది. ఆరంభంలో ఇషాన్ ధనాధన్ ఆటతీరు.. మధ్య ఓవర్లలో సూర్యకుమార్ మెరుపులతో వాంఖడే దద్దరిల్లింది. వీరి ధాటికి ఆర్‌సీబీ బౌలర్లు చేతులెత్తేయడంతో 15.3 ఓవర్లలోనే మ్యాచ్ ముగిసింది. ఎడాపెడా భారీ షాట్లతో పవర్‌ప్లేలోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్న ఇషాన్.. రోహిత్‌తో కలిసి తొలి వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. ఐదో ఓవర్‌లో ఇషాన్ 6,4,6.. రోహిత్ 6తో పేసర్ సిరాజ్ 23 పరుగులు సమర్పించుకున్నాడు. ఇక ఆరో ఓవర్‌లోనూ ఇషాన్ 4,6,4తో 23 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. అప్పటికి రోహిత్ స్కోరు 15 మాత్రమే. కానీ ఈ దూకుడుకు పేసర్ ఆకాశ్ దీప్ తొమ్మిదో ఓవర్‌లో చెక్ పెడుతూ ఇషాన్ వికెట్ తీశాడు. అటు సూర్యకుమార్ రాకతో ఆర్‌సీబీ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. 11వ ఓవర్‌లో తను 24 పరుగులు రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లో టోప్లే గాల్లోకి ఎగిరి ఒంటి చేత్తో పట్టిన సూపర్ క్యాచ్‌తో రోహిత్ వెనుదిరిగాడు. అయినా జోరు తగ్గించని సూర్య 13వ ఓవర్‌లో 4,6,4,4తో 17 బంతుల్లో ఐపీఎల్‌లో తన వేగవంతమైన ఫిఫ్టీని పూర్తి చేశాడు. మరుసటి ఓవర్‌లోనే వైశాక్ అతడి వికెట్ తీసినా ముంబై అప్పటికే విజయం అంచుల వరకు వచ్చింది. హార్దిక్ (21 నాటౌట్), తిలక్ (16 నాటౌట్) కూడా వేగం చూపడంతో 16వ ఓవర్‌లో లాంఛనం పూర్తయ్యింది.

చివర్లో డీకే జోరు: ఆర్‌సీబీ నుంచి ఇప్పటి దాకా కోహ్లి మాత్రమే 50+ స్కోరు చేయగా.. ఈ మ్యాచ్‌లో మాత్రం డుప్లెసి, రజత్, దినేశ్ కార్తీక్ రూపంలో ముగ్గురు బ్యాటర్లు ఈ ఫీట్ సాధించారు. దీంతో స్కోరు 200కి చేరువగా వెళ్లింది. పేసర్ బుమ్రా మాత్రం ఐదు వికెట్లతో పరుగులను సైతం కట్టడి చేశాడు. టాస్ ఓడిన బెంగళూరుకు ఆరంభంలోనే ఝలక్ తగిలింది. విరాట్ (3), ఐపీఎల్ అరంగేట్ర బ్యాటర్ విల్ జాక్స్ (8) తొలి నాలుగు ఓవర్లలోనే పెవిలియన్‌కు చేరారు. బుమ్రాను ఎదుర్కొనేందుకు తీవ్రంగా ఇబ్బందిపడిన కోహ్లి అతడికే చిక్కాడు. ఈ దశలో కెప్టెన్ డుప్లెసితో పాటు రజత్ పటీదార్ జట్టును ఆదుకునే బాధ్యతను తీసుకున్నారు. రజత్ 12వ ఓవర్‌లో తొలి రెండు బంతులను సిక్సర్లుగా మలచడంతో స్కోరు వంద దాటగా, 25 బంతుల్లోనే అతడి మెరుపు అర్ధసెంచరీ కూడా పూర్తయ్యింది. కానీ తర్వాతి బంతికే అతడి దూకుడుకు పేసర్ కొట్జీ బ్రేక్ వేశాడు. తర్వాతి ఓవర్‌లోనే ప్రమాదకర మ్యాక్స్‌వెల్ (0)ను స్పిన్నర్ శ్రేయాస్ గోపాల్ ఎల్బీ చేశాడు. ఈసీజన్‌లో మ్యాక్సీకిది మూడో డకౌట్. అటు డుప్లెసి ఫోర్‌తో 35 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే బుమ్రా డెత్ ఓవర్లలో గట్టి షాకే ఇచ్చాడు. 17వ ఓవర్‌లో డుప్లెసి, లోమ్రోర్ (0)లను, 19వ ఓవర్‌లో సౌరవ్ చౌహాన్ (9), వైశాక్ (0)లను అవుట్ చేశాడు. ఇక ఆఖరి ఓవర్‌లో డీకే 6,6,4తో 19 రన్స్ అందించి, 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకోగా జట్టు సవాల్ విసిరే స్కోరు సాధించింది.



సూర్యకుమార్ (19 బంతుల్లో 52)

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లి (సి) ఇషాన్ (బి) బుమ్రా 3, డుప్లెసి (సి) డేవిడ్ (బి) బుమ్రా 61, విల్ జాక్స్ (సి) డేవిడ్ (బి) మధ్వల్ 8, పటీదార్ (సి) ఇషాన్ (బి) కొట్జీ 50, మ్యాక్స్‌వెల్ (ఎల్బీ) శ్రేయాస్ 0, దినేష్ (నాటౌట్) 53, లోమ్రోర్ (ఎల్బీ) బుమ్రా 0, సౌరవ్ చౌహాన్ (సి) మధ్వల్ (బి) బుమ్రా 9, వైశాక్ (సి) నబీ (బి) బుమ్రా 0, ఆకాశ్ దీప్ (నాటౌట్) 2 ; **ఎక్స్‌ట్రాలు : 10 : మొత్తం 20 ఓవర్లలో 196/8 ; వికెట్లపతనం :** 1-14, 2-23, 3-105, 4-108, 5-153, 6-153, 7-170, 8-170 ; **బౌలింగ్:** నబీ 1-0-7-0, కొట్జీ 4-0-42-1, బుమ్రా 4-0-21-5, ఆకాష్ మధ్వల్ 4-0-57-1, శ్రేయాస్ గోపాల్ 4-0-32-1, షెపర్డ్ 2-0-22-0, హార్దిక్ 1-0-13-0.

ముంబై: ఇషాన్ (సి) కోహ్లి (బి) ఆకాశ్‌దీప్ 69, రోహిత్ (సి) టోప్లే (బి) జాక్స్ 38, సూర్యకుమార్ (సి) లోమ్రోర్ (బి) వైశాఖ్ 52, హార్దిక్ (నాటౌట్) 21, తిలక్ వర్మ (నాటౌట్) 16 : **ఎక్స్‌ట్రాలు : 3 : మొత్తం 15.3 ఓవర్లలో 199/3 ; వికెట్ల పతనం :**1-101, 2-139, 3-176 ; **బౌలింగ్ :** టోప్లే 3-0-34-0, సిరాజ్ 3-0-37-0, ఆకాశ్‌దీప్ 3.3-0-55-1, మ్యాక్స్‌వెల్ 1-0-17-0, వైశాక్ 3-0-32-1, విల్ జాక్స్ 2-0-24-1.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	5	4	1	0	8	0.871
కోల్‌కతా	4	3	1	0	6	1.528
లఖ్‌నవూ	4	3	1	0	6	0.775
చెన్నై	5	3	2	0	6	0.666
హైదరాబాద్	5	3	2	0	6	0.344
గుజరాత్	6	3	3	0	6	-0.637
ముంబై	5	2	3	0	4	-0.073
పంజాబ్	5	2	3	0	4	-0.196
బెంగళూరు	6	1	5	0	2	-1.124
ఢిల్లీ	5	1	4	0	2	-1.370

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ప్రజ్ఞానంద గెలుపు



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్లు ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతీలు కీలక విజయాలు నమోదు చేయగా.. గుకేష్ డ్రాతో గట్టెక్కాడు. గురువారం జరిగిన ఆరో రౌండ్‌లో అజర్‌బైజాన్ జీఎం నిజత్ అబసోవ్‌పై ప్రజ్ఞానంద గెలిచాడు. మరో గేమ్‌లో అలీరెజా (ఫ్రాన్స్)పై విదిత్ నెగ్గాడు. కాగా, హికరు నకమురా (అమెరికా)తో గుకేష్ పాయింట్ పంచుకొన్నాడు. మొత్తం 6 రౌండ్ల నుంచి గుకేష్ 4 పాయింట్లతో సంయుక్తంగా టాప్‌లో కొనసాగుతుండగా.. ప్రజ్ఞానంద (3.5), గుజరాతి (3) నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. కాగా, మహిళల విభాగం ఆరో రౌండ్‌లో లీ టింగ్జీ (చైనా) చేతిలో కోనేరు హంపి, కటిర్యానా చేతిలో వైశాలి పరాజయం పాలయ్యారు.

శాంసన్‌కు జరిమానా

జైపూర్: స్లో ఓవర్‌రేట్ కారణంగా రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్‌కు రూ. 12 లక్షలు జరిమానా విధించారు. గుజరాత్ టైటాన్స్‌తో బుధవారం మిక్కడ జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు నిర్దీత సమయానికి 20 ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. ఈ సీజన్‌లో రాయల్స్‌కిది తొలి స్లో ఓవర్ రేట్ తప్పిదమైనందున కనిష్ఠంగా జరిమానా విధించారు. ఇక.వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచిన రాజస్థాన్ ఈ మ్యాచ్‌లో ఓడిన సంగతి తెలిసిందే.

హైదరాబాద్‌లో రేపటి నుంచి చెస్ టోర్నీలు

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన వారస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి జూన్ రెండు వరకు వివిధ స్థాయిల చెస్ టోర్నీలు నిర్వహిస్తున్నారు. 13 ఏళ్ల లోపు చిన్నారులకు ఈనెల 13న చిల్డ్రన్స్ కప్, అలాగే 14వ తేదీన అండర్-15 ర్యాపిడ్ ఓపెన్ పోటీలను ఉప్పల్ డెకాథ్లాన్ వేదికగా నిర్వహించనున్నట్టు అకాడమీ ఫౌండర్-చీఫ్ కోచ్ రాఘవ్ శ్రీవాత్సవ్ తెలిపారు. ఇతర వివరాలకు 7396847937 నెంబర్‌లో సంప్రదించాలి.


ఒకే రకమైన ఫుడ్.. ఆర్నెల్లయినా తింటా!



విరాట్ కోహ్లి

న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో విరాట్ కోహ్లి ఫిట్‌నెస్ అత్యున్నత స్థాయిలో ఉంటుంది. ఇందుకు అతడి ఆహార అలవాట్లు కూడా కారణమే. అలాగే ఒకే రకమైన ఆహారాన్ని నెలల తరబడి ఎలాంటి ఇబ్బందీ లేకుండా తినగలనని చెబుతున్నాడు. ఒక ఆటగాడు సరైన ఫిట్‌నెస్‌తో ఉండాలంటే చక్కటి శిక్షణతో పాటు ఆహారం కూడా ముఖ్యమని అభిప్రాయపడ్డాడు. 'ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంలో నేనెదుర్కొనే సవాల్ ఆహారంతోనే ఉంటుంది. జిమ్‌కు వెళ్లడం, కష్టపడడం మామూలే. కానీ ఫుడ్ విషయం అలా కాదు. మన నాలుక ఎన్నో రకాల రుచులను కోరుకుంటుంది. అయితే నేను మాత్రం నా డైట్‌ను కఠినంగా అనుసరిస్తా. అందుకే ఒకే రకమైన ఆహారాన్ని ఆరు నెలలపాటు మూడు పూటలా తినమన్నా తినేస్తా' అని కోహ్లి తేల్చిచెప్పాడు.

మన పోరు ముగిసింది



● సింధు, ప్రణయ్ కూడా ఇంటిదారి
● ఆసియా చాంపియన్‌షిప్స్

నింగ్‌బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో భారత షట్లర్ల కథ ముగిసింది. గురువారం జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో సింధు 18-21, 21-13, 17-21తో ఆరో సీడ్ హన్ యు (చైనా) చేతిలో పరాజయం పాలైంది. గతంలో హన్ యుపై 5-0తో మెరుగైన రికార్డు కలిగిన సింధు అలవోకగా నెగ్గుతుందని భావించారు. కానీ, గంటకుపైగా సాగిన పోరులో చైనా షట్లర్.. తొలిసారి సింధుపై పైచేయి సాధించింది. ఇక రెండో రౌండ్‌లో ప్రణయ్ 18-21, 11-21తో చిన్ చున్‌యి (చైనీస్ తైపీ) చేతిలో వరుస గేముల్లో చిత్తయ్యాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 17-21, 12-21తో మట్సుయామా-చిహారు (జపాన్) చేతిలో ఓటమి చవిచూసింది.

ముంబై జట్టులో హార్విక్ దేశాయ్

ముంబై: ముంబై ఇండియన్స్ బ్యాటర్ విష్ణు వినోద్ గాయం కారణంగా ఐపీఎల్‌కు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానంలో సౌరాష్ట్రకు చెందిన వికెట్ కీపర్ హార్విక్ దేశాయ్‌ను తీసుకున్నారు. అతడి కనీస ధర రూ.20 లక్షలు.

పోరాడి ఓడిన నగాల్

మోంటె కార్లో ఓపెన్

మోంటెకార్లో: మోంటె కార్లో ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సుమిత్ నగాల్ జోరుకు తెరపడింది. ప్రపంచ ఏడో ర్యాంకర్ హోల్గర్ రూన్ చేతిలో నగాల్ రెండో రౌండ్‌లో పరాజయం చవిచూశాడు. రూన్ (డెన్మార్క్) కు సుమిత్ గట్టి పోటీ ఇచ్చాడు. అంతిమంగా 3-6, 6-3, 2-6తో ఓడి నిష్క్రమించాడు.

ఓజే సింప్సన్ మృతి



న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన ప్రఖ్యాత ఫుట్‌బాల్ ఆటగాడు, నటుడు ఓజే సింప్సన్ (76) క్యాన్సర్‌తో బుధవారం మరణించాడు. 1994లో తన మాజీ భార్య నికోల్ బ్రౌన్, ఆమె స్నేహితుడు రాన్ గోల్డ్‌మన్ హత్య కేసులో అతడు అరెస్ట్ కావడం సంచలనం రేపింది. కానీ కోర్టు అతడిని నిర్దోషిగా ప్రకటించింది. 2007లో దోపిడీ, కిడ్నాప్ కేసులో అతడు మరోసారి అరెస్టయ్యాడు. ఈ కేసులో సింప్సన్‌కు 33 ఏళ్ల శిక్ష పడగా, 2017లో పెరోల్‌పై విడుదలయ్యాడు.

బిజినెస్

వీ-గార్డ్ నుంచి అరిజో వైర్స్



హైదరాబాద్: ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయెన్సెస్ సంస్థ వీ-గార్డ్ మార్కెట్లోకి అరిజో వైర్స్ పేరుతో ఎలక్ట్రిక్ వైరింగ్ ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసింది. అడ్వాన్స్‌డ్ ఈ-బీమ్ టెక్నాలజీతో ఈ వైర్లను కంపెనీ తీసుకువచ్చింది. అత్యుత్తమ ప్రమాణాలు, సామర్థ్యాలతో కూడిన ఈ అరిజో వైర్స్.. ఎలక్ట్రికల్ విభాగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతాయని వీ-గార్డ్ పేర్కొంది. సాంప్రదాయ ఎఫ్ఆర్ పీవీసీ వైర్లతో పోల్చితే అరిజో వైర్స్ 75 శాతం అధికంగా విద్యుత్‌ను తీసుకువెళ్లగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. వేడిని తట్టుకోవటంతో పాటు మెల్ట్ రెసిస్టెంట్, అగ్ని నిరోధకంగా ఈ వైర్లను రూపొందించటంతో గృహ, వ్యాపార సముదాయాలకు మంచి భద్రతను కల్పిస్తాయని వీ-గార్డ్ తెలిపింది. 99.97 శాతం స్వచ్ఛతతో కూడిన కాపర్‌తో తయారు చేసిన అరిజో వైర్స్‌కు ప్రతిష్ఠాత్మకమైన కన్ఫర్మిటీ యూరోపియన్ సర్టిఫికేషన్ (సీఈ)తో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు లోబడి ఉందని వెల్లడించింది. కాగా భారతీయ ఇండియన్ హౌసింగ్ వైర్స్, కేబుల్స్ మార్కెట్ ఏటా 9-10 శాతం వృద్ధితో రూ.25,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

జోరుగా 'సిప్' పెట్టుబడులు

2023-24లో రూ.2 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల్లో పెట్టుబడుల జోరు కొనసాగుతోంది. ఈ సంస్థలు అందించే క్రమానుగత పెట్టుబడుల ప్రణాళిక (సిప్) పెట్టుబడులు మరింత జోరందుకున్నాయి. గత ఏడాది సిప్ పెట్టుబడుల ద్వారా ఎంఎఫ్‌లు రికార్డు స్థాయిలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాయి. అంతకు ముందు సంవత్సరంలో నమోదైన రూ.1.56 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 28 శాతం ఎక్కువ. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) గురువారం ఈ వివరాలు విడుదల చేసింది. 2016-17 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ పెట్టుబడులు నాలుగు రెట్లు పెరిగినట్టు తెలిపింది.

నెలకు రూ.19,000 కోట్లకుపైగా: ఇక సిప్‌ల ద్వారా జరిగే నెలవారీ పెట్టుబడుల మొత్తమూ గత నెల రికార్డు స్థాయిలో రూ.19,270 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 35 శాతం ఎక్కువ. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ సిప్ పెట్టుబడులు రూ.19,000 కోట్లు దాటాయి. ఈ ఏడాది చివరికి సిప్ నెలవారీ పెట్టుబడులు రూ.25,000 కోట్ల స్థాయికి చేరతాయని మార్కెట్ వర్గాల అంచనా.

రూ.10.71 లక్షల కోట్లు: సిప్‌ల ద్వారా వచ్చిన పెట్టుబడుల నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) ఈ ఏడాది మార్చి నాటికి రూ.10.71 లక్షల కోట్లకు చేరింది. ఫిబ్రవరితో పోలిస్తే ఇది రూ.19,000 కోట్లు ఎక్కువ. క్రమశిక్షణతో ఆస్తుల వృద్ధిపై మదుపరుల్లో పెరుగుతున్న అవగాహనకు ఇది నిదర్శనమని యాంఫీ సీఈఓ వెంకట్ చలసాని చెప్పారు. మొత్తం మీద సిప్ పెట్టుబడుల పుణ్యమాని ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ ఈ ఏడాది మార్చి నాటికి రూ.53.4 లక్షల కోట్లకు చేరింది.గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.13.99 లక్షల కోట్లు ఎక్కువ.

యూఏఈ మార్కెట్లోకి ది టేస్ట్ కంపెనీ ఉత్పత్తులు

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ది టేస్ట్ కంపెనీ.. విదేశీ మార్కెట్లోకి అడుగుపెట్టింది. భారత్‌లో తొలిసారిగా రెడీ టు ఈట్ నాన్ వెజ్ ఫుడ్‌ను పరిచయం చేసిన ది టేస్ట్ కంపెనీ తాజాగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా యూఏఈ మార్కెట్లోకి ప్రవేశించింది. ప్రస్తుతం కంపెనీ ఐదు బ్రేక్‌ఫాస్ట్ వెరైటీలతో మొత్తం 18 రకాలైన ఉత్పత్తులను విక్రయిస్తోంది. ఇందులో ఏడు వెజిటేరియన్ మీల్ కాగా 6 నాన్ వెజిటేరియన్ మీల్ వెరైటీలు ఉన్నాయి. తాజాగా యూఏఈ మార్కెట్లోకి కంపెనీ ఉత్పత్తులను తీసుకువచ్చిన ది టేస్ట్.. రానున్న రోజుల్లో యూకే, అమెరికా, సింగపూర్ దేశాల మార్కెట్లోకి విస్తరించనున్నట్లు ప్రకటించింది. భారత్‌లోని ఆరు విమానయాన సంస్థలు.. ప్రస్తుతం ది టేస్ట్ కంపెనీ ఉత్పత్తులను ప్రయాణికులకు ఆఫర్ చేస్తున్నాయి. కాగా హైదరాబాద్ సమీపంలో రూ.34 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో ఈ రెడీ టు ఈట్ మీల్ వెరైటీలను తయారు చేస్తున్నట్లు కంపెనీ కో ఫౌండర్, సీఈఓ అనిల్ కుమార్ తెలిపారు.

ముందుంది ముసళ్ల పండగ

ఉదయ్ కోటక్



పొంచి ఉన్న ఆర్థిక సంక్షోభం.. త్వరలో చైనా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఏ మాత్రం బాగోలేదని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ ఆందోళన వ్యక్తం చేశారు. ధరల సెగ తగ్గనంత వరకు అమెరికా, భారత్‌తో సహా ఎక్కడా వడ్డీ రేట్లు తగ్గే అవకాశం లేదని స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణం నిర్దేశిత 2 శాతానికి వస్తే, అధ్యక్ష ఎన్నికల సమయానికి అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందన్నారు. బ్యారల్ ముడి చమురు ధర 90 డాలర్లు మించి పోవడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ మరోసారి ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న చైనా ఆర్థిక వ్యవస్థ కూడా త్వరలో బద్దలయ్యే ప్రమాదం ఉందని కోటక్ హెచ్చరించారు. ఈ పరిణామాలను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు సిద్ధంగా ఉండాలని 'ఎక్స్' వేదికగా కోటక్ కోరారు.

తగ్గనున్న వస్తు వాణిజ్యం

అంతర్జాతీయ ఉద్రిక్తతలతో ఈ సంవత్సరం కూడా అంతర్జాతీయ వస్తు వాణిజ్యం విలువ తగ్గనుంది. గత ఏడాది 5 శాతం తగ్గిన ఈ వాణిజ్యం, ఈ సంవత్సరం 1.2 శాతం తగ్గుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) అనే పరిశోధనా సంస్థ తెలిపింది. అయితే ఇదే సమయంలో వాణిజ్య సేవల ఎగుమతి, దిగుమతుల విలువ 9 శాతం పెరిగి అంతర్జాతీయ వాణిజ్యాన్ని ఆదుకుంటుందని తెలిపింది.

చైనాకు పెరిగిన 'వస్తు' ఎగుమతులు

మరోవైపు చైనాకు మన వస్తు ఎగుమతులు క్రమంగా పెరుగుతున్నాయి. గత ఏడాది ఇనుప ఖనిజం, టెలికాం, ఎలక్ట్రానిక్ పరికరాల వంటి 90 వస్తువుల ఎగుమతులు గణనీయంగా పెరినట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్ నుంచి చైనా దిగుమతి చేసుకునే 161 వస్తువుల్లో ఈ 90 వస్తువుల వాటా 67.7 శాతం వరకు ఉంటుంది. 71 వస్తువుల ఎగుమతులు మాత్రం 2023లో నీరసించాయి. ఇనుప ఖనిజం ఎగుమతులు 216.8 శాతం, కాటన్ యార్న్ ఎగుమతులు 542.6 శాతం, సుగంధ ద్రవ్యాల ఎగుమతులు 19.4 శాతం, ప్రాసెస్ చేసిన ఖనిజాల ఎగుమతులు 174.19 శాతం పెరిగినట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఎడెల్‌వీజ్ ఆల్టర్నేటివ్స్ చేతికి ఎల్‌టీఐడీపీఎల్

రూ.6,000 కోట్లకు కొనుగోలు

Edelweiss ALTERNATIVES
L&T IDPL

ముంబై: ఎల్ అండ్ టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్స్ (ఎల్‌టీఐడీపీఎల్)ను రూ.6,000 కోట్లకు కొనుగోలు చేసే ప్రక్రియను పూర్తి చేసినట్లు ఎడెల్‌వీజ్ ఆల్టర్నేటివ్స్ గురువారం ప్రకటించింది. ఎల్‌టీఐడీపీఎల్ చేతిలో పలు రోడ్డు, విద్యుత్ సరఫరా లైన్ల ప్రాజెక్టులున్నాయి. జాయింట్ వెంచర్ కంపెనీగా ఏర్పాటైన ఎల్‌టీఐడీపీఎల్‌లో ఎల్ అండ్ టీకి 51 శాతం వాటా ఉండగా.. కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ చేతుల్లో మిగతా వాటా ఉంది. ఈ జేవీలో 100 శాతం వాటాను ఎడెల్‌వీజ్ టేకోవర్ చేసింది. తద్వారా ఎల్‌టీఐడీపీఎల్‌కు చెందిన 4,400 కిలోమీటర్ల పొడవైన 7 రోడ్డు ఆస్తులతో పాటు 960 సర్క్యూట్ కి.మీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఎడెల్‌వీజ్ చేతుల్లోకి వచ్చాయి.

ఈ ఏడాది భారత్ వృద్ధి రేటు 7 % : ఏడీబీ

ముంబై: భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాలను ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) మరింత పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత ఆర్థిక వ్యవస్థ 6.7 శాతం వృద్ధి రేటు సాధిస్తుందని గతంలో పేర్కొన్న ఏడీబీ ఆ అంచనాల్ని 7 శాతానికి పెంచింది. వినియోగదారుల డిమాండ్ పెరగడం, ప్రభుత్వ-ప్రైవేట్ పెట్టుబడులు పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదం చేస్తాయని తెలిపింది. ఆసియా-పసిఫిక్ ప్రాంత అభివృద్ధికి భారత్ ప్రధాన వృద్ధి చోదక శక్తిగా మారిందని పేర్కొంది. అంతేకాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) భారత వృద్ధి రేటు మరింత పెరిగి 7.2 శాతానికి చేరే అవకాశం ఉందని అంచనా వేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ



హైదరాబాద్	380	విజయవాడ	393
చిత్తూరు	458	విశాఖపట్నం	408
గోదావరి	393	వరంగల్	382
		డజను గుడ్లు రూ.60	


ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	146	గోదావరి	147
వరంగల్	146	విజయవాడ	147
కరీంనగర్	146	గుంటూరు	147
మహబూబ్‌నగర్	146	ఒంగోలు	147
కర్నూలు	146	చిత్తూరు	151
విశాఖపట్నం	129		

టెస్లా ఎంట్రీపై బేఫికర్

మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్



న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) కంపెనీ టెస్లా భారత ప్రవేశంపై కలవరపడటం లేదని మెర్సిడెస్ బెంజ్ అంటోంది. టెస్లా వంటి అంతర్జాతయ కంపెనీలను ఆకర్షించేందుకు మోదీ ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఈవీ పాలసీ ప్రస్తుత కంపెనీలకు రక్షణ కల్పిస్తుందని నమ్ముతున్నట్లు జర్మనీ కార్ల దిగ్గజం పేర్కొంది. టెస్లా, విన్‌ఫాస్ట్ వంటి కంపెనీల ప్రవేశంతో భారత మార్కెట్ మరింత విస్తరించడంతో పాటు దేశంలో ఈవీల వినియోగం పెరుగుతుందని అభిప్రాయపడింది. అంతేకాదు, ఈ కంపెనీలు వచ్చినా లగ్జరీ ఈవీల విభాగంలో తమ అగ్ర స్థానం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేసింది. "మార్కెట్లో కొత్త పోటీ, కంపెనీల ప్రవేశాన్ని సదా స్వాగతిస్తాం. మార్కెట్ విస్తరణతో పాటు ఈవీ వినియోగ ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ప్రస్తుతం అది అవసరం కూడా" అని మెర్సిడెస్ బెంజ్ ఇండియా సంతోష్ అయ్యర్ అన్నారు. కొత్త ఈవీ పాలసీపైనా ఆయన స్పందించారు. "సుంకం రహిత లేదా సుంకం రాయితీలను ఎప్పటికీ స్వాగతిస్తాం. భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా స్వేచ్ఛా వాణిజ్యం కొనసాగాలనే మేం సూచిస్తున్నాం. కాబట్టి అలాంటి ప్రకటనేదైనా మేం స్వాగతిస్తాం. కొత్త పాలసీ విషయానికొస్తే, మరింత లోతుగా అధ్యయనం చేసి, ప్రస్తుత కంపెనీలపై ఏమైనా ప్రభావం ఉంటుందా అని చూడాలి. కానీ, ప్రభుత్వం కొత్తగా ప్రవేశించబోయే కంపెనీలపై పలు పరిమితులు విధించడంతో పాటు ప్రస్తుత కంపెనీలకు రక్షణ కల్పించేలా నిబంధనలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతానికైతే మా వ్యాపారంపై ప్రభావం ఉండబోద'ని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

2023-24లో రికార్డు విక్రయాలు: ఈ మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారత్‌లో బెంజ్ కార్ల విక్రయాలు సరికొత్త రికార్డు స్థాయి 18,123 యూనిట్లకు పెరిగాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 16,497 యూనిట్లతో పోలిస్తే 10 శాతం వృద్ధి చెందాయి.

స్టెల్లాంటిస్ ఈవీ ఎగుమతి హబ్‌గా భారత్

భారత్‌ను తమ ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతిగా హబ్‌గా మార్చుకోవాలని అంతర్జాతీయ వాహన సంస్థ స్టెల్లాంటిస్ భావిస్తోంది. తొలుత ఆగ్నేయాసియా మార్కెట్‌పై దృష్టిసారించనున్నట్లు స్టెల్లాంటిస్ ఇండియా ఎండీ, సీఈఓ ఆదిత్య జైరాజ్ తెలిపారు. స్టెల్లాంటిస్ భారత్‌లో తయారు చేసిన 'ఈ-సీ3' ఎలక్ట్రిక్ కార్లను ఇండోనేషియాకు ఎగుమతి చేసే ప్రక్రియను గురువారం ప్రారంభించింది. తొలుత 500 యూనిట్లను ఎగుమతి చేసింది. ఇటాలియన్ అమెరికన్ వాహన దిగ్గజం ఫియట్ క్రిస్లర్ ఆటోమొబైల్స్, ఫ్రాన్స్‌కు చెందిన పీఎస్ఏ గ్రూప్ విలీనం ద్వారా ఏర్పాటైన స్టెల్లాంటిస్.. ప్రస్తుతం భారత్‌లో జీప్, సిట్రోయెన్ బ్రాండ్ కార్లను విక్రయిస్తోంది.

జీఎస్‌టీఆర్-1 ఫైలింగ్‌కు నేటి వరకు గడువు

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి నెల.. జీఎస్‌టీఆర్-1 రిటర్న్ ఫైలింగ్ గడువును శుక్రవారం వరకు పొడిగించారు. ఈ రిటర్న్‌లు ఫైల్ చేసే సంస్థలు, ఫైలింగ్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలియడంతో జీఎస్‌టీ టెక్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వస్తు, సేవలను ఇతరులకు సరఫరా చేసే సంస్థలు, వ్యక్తులు ఈ రిటర్న్ ఫైల్ చేస్తుంటాయి. నెలనెలా ఫైల్ చేసే సంస్థలు మరుసటి నెల 11 తేదీలోపు, మూడు నెలలకు ఒకసారి ఫైల్ చేసే సంస్థలు మరుసటి నెల 13వ తేదీ లోపు ఫైల్ చేస్తుంటాయి.

భద్రాచలంలో గోదావరి వరదకు అడ్డుకట్ట

కొనసాగుతున్న మిగులు కరకట్ట నిర్మాణ పనులు.. జూన్ నాటికి పూర్తి చేసేలా అధికారుల కసరత్తు

భద్రాచలం, ఏప్రిల్ 11: గోదావరి వరదలతో భద్రాద్రి వాసులకు ముంపు బెడద లేకుండా ఇకపై కరకట్ట పూర్తి స్థాయి రక్షణ గోడగా నిలవనుంది. భద్రాచలం సుభాష్‌నగర్ కాలనీ వద్ద నుంచి చేపట్టాల్సిన మిగులు కరకట్ట నిర్మాణ పనులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మోక్షం లభించింది. 700 మీటర్ల నిడివి పనులను రూ.38 కోట్ల అంచనా విలువతో చేపట్టారు. వీటిని జూన్ నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యమని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఈ పనులపై గత దశాబ్ద కాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్న విమర్శలు ఉన్నాయి. 2022 జూలై 16న గోదావరి మహోగ్రరూపం దాల్చడంతో పట్టణంలోని శివారు కాలనీలన్నీ నీట మునిగాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తమకు ముంపు నుంచి రక్షణ కల్పించేందుకు కరకట్ట మిగులు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ పనులకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు శంకుస్థాపన జరిగింది. అయితే తొలి నుంచి భద్రాద్రివాసులకు ముంపు నుంచి రక్షణ కల్పిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇవ్వడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో పనులు ప్రారంభమయ్యాయి.

ఆ కరకట్టే శ్రీరామరక్షగా నిలిచింది

భద్రాచలం వద్ద కరకట్టతో 2022 జూలైలో పట్టణానికి వరద గండం తప్పింది. 1986లో వచ్చిన గోదావరి వరదలను చూసి అప్పటి సీఎం ఎన్టీఆర్ చలించిపోయారు. అప్పుడు మంత్రిగా ఉన్న తుమ్మల సూచన మేరకు కరకట్ట నిర్మాణానికి ఎన్టీఆర్ హామీ ఇచ్చారు. కొంతవరకు కరకట్ట నిర్మించారు. ఆ తరువాత పనులు నిలిచిపోగా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.53 కోట్లు మంజూరు చేసి, యటపాక నుంచి సుభాష్‌నగర్ వరకు పది కిలోమీటర్లకు పైగా కరకట్ట నిర్మించారు. దీంతో భద్రాచలం పట్టణంతో పాటు శివారున ఉన్న రాజుపేట, మేడువాయి తదితర గ్రామాలకు వరద ముంపు తప్పింది. అయితే 2022 జూలై 16న భద్రాచలం వద్ద గోదావరి 71.3 అడుగుల నీటిమట్టంతో ప్రవహించడంతో అపార నష్టం సంభవించింది. సుభాష్‌నగర్ కాలనీ, శాంతినగర్ కాలనీ, కూనవరం రోడ్డు, సీఆర్‌పీఎఫ్ క్యాంపు కార్యాలయాలు పూర్తిగా నీట మునిగాయి. ఇదంతా కరకట్ట లేని ప్రాంతం నుంచి వచ్చిన వరద వల్లే జరిగింది. భద్రాద్రికి భవిష్యత్తులో వచ్చే వరదలతో ముంపు లేకుండా శాశ్వత రక్షణ కావాలంటే పూర్తి స్థాయి కరకట్ట నిర్మాణంతోనే సాధ్యమని స్థానికులు తొలి నుంచి పేర్కొంటున్నారు. కరకట్ట స్లూయిస్‌ల నుంచి లీకులు లేకుండా చర్యలు చేపట్టి, గోదావరి స్నాన ఘట్టాలు, విస్తా కాంప్లెక్సు పరిసరాల్లో ఉన్న కరకట్ట అంతర్భాగం పటిష్టవంతం చేసి, 15 అడుగులకు ఎత్తు పెంచాలని కోరుతున్నారు.



భద్రాచలం వద్ద కొనసాగుతున్న కరకట్ట నిర్మాణ పనులు

రిటైనింగ్ వాల్‌కు రూ.500 కోట్లు

భద్రాచలం, పినపాక నియోజకవర్గాలకు గోదావరి వరద ముంపు నుంచి శాశ్వత రక్షణ కల్పించేందుకు ఇప్పటికే రూ.500 కోట్లను సీఎం రేవంత్ రెడ్డి మంజూరు చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మించి ముంపు కష్టాలను తీర్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని మార్చి 11న భద్రాచలంలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ తెలిపారు.

కవితను సీబీఐ అరెస్టు చేయడం విస్మయానికి గురిచేసింది: నిరంజన్

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఈడీ కేసులో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను సీబీఐ అరెస్టు చేయడం విస్మయానికి గురి చేసిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ అన్నారు. తప్పు చేసిన వారు శిక్షార్హులేనన్న ఆయన.. కుమారుడి పరీక్షల నేపథ్యంలో కవిత తాత్కాలిక బెయిల్ కోరినా ఇవ్వకపోవడం ప్రజలు హర్షించబోరని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అరెస్టు చేసి అటు కేజ్రీవాల్.. ఇటు కవితకు బెయిల్ రాకుండా చేయడంతో విచారణ సంస్థల నిబద్ధత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చెప్పుచేతల్లో విచారణ సంస్థలు నడుస్తున్నాయని మరోసారి రుజువైందని విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని విర్రవీగుతున్న ప్రధాని నరేంద్ర మోదీకి భవిష్యత్తులో ఎదురు దెబ్బలు, బేడీలు తప్పవన్నారు.

నారాయణపేట, మక్తల్‌లో బీజేపీకి షాక్

నారాయణపేట, ఏప్రిల్ 11: సార్వత్రిక ఎన్నికల వేళ బీజేపీకి కీలక నేతలు రాజీనామా చేశారు. బీజేపీ నారాయణపేట నియోజకవర్గం ఇన్‌చార్జి రతంగ్‌పాండురెడ్డి, మక్తల్ నియోజకవర్గం ఇన్‌చార్జి జలంధర్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ మేరకు రతంగ్‌పాండురెడ్డి, జలంధర్‌రెడ్డి తమ రాజీనామా పత్రాలను కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించారు. వీరితో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్ పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు. నారాయణపేటలో ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండు సార్లు బీజేపీ నుంచి, మరోసారి స్వతంత్ర అభ్యర్థిగా రతంగ్‌పాండురెడ్డి పోటీ చేసి ఓటమిని చవిచూశారు. నియోజకవర్గం ఇన్‌చార్జిగా కొనసాగుతున్న ఆయన లోక్‌సభ ఎన్నికల సమయంలో రాజీనామా చేయడం చర్చకు దారితీసింది. అలాగే గతంలో నారాయణపేట మునిసిపాలిటీలో కౌన్సిలర్‌గా కొనసాగిన రఘురామయ్యగౌడ్ పట్టణ అధ్యక్షుడిగా, ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పార్టీలో ఉన్న వర్గపోరు, తగిన ప్రాధాన్యం లేకపోవడంతోనే వీరు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

ఢిల్లీ సీఎస్‌పై కేసు నమోదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్‌కుమార్‌పై కేసు నమోదైంది. ఉత్తరాఖండ్‌లోని అల్మోరా కోర్టు ఆదేశాల మేరకు సీఎస్ నరేశ్‌కుమార్‌తోపాటు ఆయన సబార్డినేట్ వైవీవీజే రాజశేఖర్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తరాఖండ్‌లోని ప్లెజెంట్ వ్యాలీ ఫౌండేషన్ ఎన్జీవో ఆ అధికారులపై మార్చి 2న ఫిర్యాదు చేశారు. ఎన్జీవో ఆధ్వర్యంలో దాదాకాడలో నిర్వహిస్తున్న పాఠశాలకు ఆ అధికారులు ఫిబ్రవరి 14న నలుగురు వ్యక్తులను పంపించారని ఆరోపించారు. వారు ఎన్జీవో సంయుక్త కార్యదర్శి చాంబర్‌ను ధ్వంసం చేసి, డాక్యుమెంట్లు, రూ.63వేలను తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేయాలని అల్మోరా కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

సీబీఐ వంతు..

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం లేదని ఆయన బదులిచ్చారు. దీంతో.. అసలు సీబీఐ అరెస్టు చేసిందని మీరెలా చెబుతున్నారని కవిత తరఫు న్యాయవాదిని జడ్జి ప్రశ్నించారు. కవితను అరెస్టు చేసినట్టు ఆమె భర్త అనిల్‌కు సీబీఐ సమాచారం అందించిందని మోహిత్ రావు తెలిపారు. అయితే.. అత్యవసర కేసులను మాత్రమే తాము విచారిస్తామని, కాబట్టి ఈ విషయంలో కవితకు ఎటువంటి ఊరట ఇవ్వలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. "ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించిన సమాచారం మా దగ్గర లేదు. దీనిపై గతంలో ఎప్పుడూ మా దగ్గర వాదనలు జరగలేదు. ఈరోజు సెలవు కదా? అత్యవసరమైన కేసులను మాత్రమే విచారిస్తాం. సుప్రీంకోర్టు, హైకోర్టులు ఏమైనా అత్యవసర ఆదేశాలు ఇస్తే అమలుచేస్తాం. అయినా.. ఇది అత్యవసరంగా విచారించాల్సిన కేసు కాదనేది మా అభిప్రాయం. కాబట్టి ఈ కేసులో ఎలాంటి ఊరటా ఇవ్వలేం." అని తేల్చిచెప్పారు. దీంతో.. తమ పిటిషన్‌ను రెగ్యులర్ కోర్టులో శుక్రవారమైనా విచారించాలని మోహిత రావు విజ్ఞప్తి చేశారు. దీనికి న్యాయమూర్తి మనోజ్ కుమార్.. ఈ కేసుపై రెగ్యులర్‌గా విచారణ జరుగుతున్న సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి కావేరి భవేజా కోర్టులోనే శుక్రవారం ఉదయం 10 గంటలకు వాదనలు వినిపించాలని సూచించారు. పిటిషన్‌ను ఆ న్యాయస్థానానికి బదిలీ చేస్తున్నట్టు తెలిపారు.

మొదట సాక్షిగా.. తర్వాత నిందితురాలిగా...

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితను తొలుత విచారించింది సీబీఐ అధికారులే. ఆ తర్వాతే ఈడీ రంగంలోకి దిగింది. కవితకు సీబీఐ 2022 డిసెంబరు 2న నోటీసులు పంపింది. డిసెంబర్ 11న హైదరాబాద్‌లోని కవిత ఇంట్లోనే ఆమెను తొలిసారి విచారించింది. అప్పుడు కవితను సాక్షిగా మాత్రమే సీబీఐ పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 23న.. ఆమెను నిందితురాలిగా చేరుస్తూ సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. 26న విచారణకు రావాలని నోటీసులు జారీ చేసింది. అయితే.. ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలు ఉన్నందున తాను విచారణకు రాలేనని సీబీఐకి కవిత లేఖ రాశారు. ఈ ఏడాది మార్చి 15న కవితను హైదరాబాద్‌లో ఈడీ అరెస్టు చేసింది. 16న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచింది. తర్వాత 10 రోజులపాటు కవితను ఈడీ కస్టడీలోకి తీసుకుని విచారించింది. 26న న్యాయస్థానం కవితకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ఆమెను తిహాడ్ జైలుకు తరలించారు. కవిత జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం ఈ నెల 9న మరో 14 రోజులపాటు పొడిగించింది. కవిత 17 రోజులుగా తిహాడ్ జైలులోనే ఉన్నారు.

శనివారమే కవితను విచారించిన సీబీఐ...

తిహాడ్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవిత నుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉన్నదని, అందుకే తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఈ నెల 5న రౌస్ అవెన్యూ కోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. అయితే.. జైలులో విచారించేందుకే న్యాయస్థానం అనుమతిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ కవిత ఈ నెల 6న రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. తమ వాదనలు వినకుండానే ఎలా అనుమతి ఇస్తారని కవిత తరఫు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని కోర్టు ఆదేశించింది. అందుకు తమకు మూడురోజుల సమయం కావాలని సీబీఐ కోరడంతో కేసు విచారణను 10వ తేదీకి వాయిదా వేసింది. బుధవారం విచారణ సందర్భంగా.. కవితను ఇప్పటికే విచారించేశామని కాబట్టి కౌంటర్ దాఖలు చేయాల్సిన అవసరం లేదని కోర్టుకు సీబీఐ తెలిపింది. తమ వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని కవిత తరఫున న్యాయవాదులు కోరడంతో 26న మధ్యాహ్నం 12 గంటలకు వింటామని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే.. గత శనివారం కోర్టులో దీనిపై విచారణ జరుగుతుండగానే తిహాడ్ జైలుకు వెళ్లి కవితను సీబీఐ విచారించింది. తాజాగా ఆమెను అరెస్టు చేసింది. శుక్రవారం రౌస్ అవెన్యూ కోర్టులో కవితను సీబీఐ హాజరుపరిచి.. కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోరనున్నట్టు సమాచారం.



కోర్టు ఆదేశాలను సీబీఐ పాటించలేదు..

కోర్టు ఆదేశాలను కూడా పాటించకుండా కవితను సీబీఐ అరెస్టు చేసిందని ఆమె తరఫు న్యాయవాది మోహిత్ రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన తర్వాత కోర్టు బయట ఆయన మీడియాతో మాట్లాడారు. "ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా జైలులో అరెస్టు చేశారు. జైలులో ఉన్న వ్యక్తిని అరెస్టు చేయాలంటే ముందుగానే కోర్టు అనుమతి తీసుకోవాలి. వారెంట్ తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇవేమీ పాటించకుండా కవితను సీబీఐ అరెస్టు చేసింది. అందుకే ఆ కాపీ ఇవ్వమని మేం కోరాం. ఈ రోజు కోర్టుకు సెలవు కావడంతో డ్యూటీ జడ్జి ముందు విచారణకు వచ్చింది. అయితే.. ఈ కేసు విచారణ జరుగుతున్న న్యాయస్థానం ముందే శుక్రవారం ఉదయం 10 గంటలకు వాదనలు వినిపించాలని న్యాయమూర్తి సూచించారు. కవితను శుక్రవారం కోర్టులో ప్రవేశపెడతారని తెలిసింది. మాకు తెలియకుండానే అరెస్టు చేయడం సరికాదు. కేసు విచారణలో ఉండగా నోటీసులు ఇవ్వకుండా అరెస్టు ఎలా చేస్తారు? మొదటిసారి కూడా మాకు సమాచారం ఇవ్వకుండానే తిహాడ్ జైలుకు వెళ్లి విచారించారు. దీనిపై మేం కోర్టును ఆశ్రయించాం. ఆ విచారణ ఈ నెల 26వ తేదీన ఉంది. అది పెండింగ్‌లో ఉండగానే మళ్లీ అరెస్టు చేశారు. కవితను విచారించాలి అనుకుంటే ముందుగానే సమాచారం ఇవ్వాలని న్యాయస్థానం సీబీఐని ఆదేశించింది. అయినప్పటికీ అవేమీ పాటించలేదు.' అని మోహిత్ రావు అభ్యంతరం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాల్లో భారత్‌కు పదో ర్యాంకు

» అంతర్జాతీయ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: సైబర్ నేరాల్లో భారత్‌కు ప్రపంచంలో పదో స్థానం దక్కింది. ప్రపంచ సైబర్ నేరాల సూచీ పేరుతో అంతర్జాతీయ నిపుణుల బృందం దాదాపు వంద దేశాల్లో జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడయింది. ఫీజుల అడ్వాన్సు చెల్లింపు పేరుతో అత్యధిక మోసాలు జరుగుతున్నాయి. మాల్‌వేర్, ర్యాన్సమ్‌వేర్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టడం, హ్యాకింగ్ చేయడం, క్రెడిట్ కార్డుల ద్వారా అక్రమాలకు పాల్పడడం, అక్రమ వర్చువల్ కరెన్సీ ద్వారా మనీలాండరింగ్ చేయడం వంటి నేరాలు ఉన్నట్టు ఆ బృందం గుర్తించింది. కొన్నింటిలో భారత్ 'స్పెషలైజ్ చేసినట్టు' ఉందని వ్యాఖ్యానించింది. సైబర్ నేరాల్లో రష్యా అగ్రస్థానంలో ఉంది.

సామాజిక మాధ్యమాల దుర్వినియోగం ఆందోళనకరం

» సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: కోర్టు విచారణలో ఉన్న కేసులపై మెసేజ్‌లు, కామెంట్లు పెట్టి సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేయడం ఆందోళనకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఓ కేసులో తీర్పును రిజర్వు చేయగా, దానిపై తప్పుదోవ పట్టించేలా ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టిన అస్సాం ఎమ్మెల్యే కరీం ఉద్దీన్ బార్‌భుయియాపై కోర్టు ధిక్కరణ విచారణ ప్రారంభించిన ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. విచారణ సందర్భంగా ధర్మాసనం ఎన్నో వ్యాఖ్యలు చేస్తుందని, అయితే వాటిని ఆధారం చేసుకొని కామెంట్లు చేసే హక్కు ఎవరికీ లేదని తెలిపింది. కేసులో కక్షిదారుగా ఉన్న వ్యక్తే కామెంట్లు పెడితే దానిని తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు ఏఐయూడీఎఫ్‌కు చెందిన ఎమ్మెల్యే కరీంకు కోర్టు ధిక్కరణ నోటీసులు పంపించింది. ఆయన పెట్టుకున్న ఎలక్షన్ పిటిషన్‌పై ధర్మాసనం తీర్పు వాయిదా వేయగా తనకు అనుకూలంగా నిర్ణయం వెలువడిందంటూ మార్చి 20న ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని పేర్కొంటూ జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా త్రివేదీ ధర్మాసనం నోటీసులు పంపించింది.



అమలాపురంలో ప్రజాగళం సభకు హాజరైన జనం

ఒక్క చాన్స్‌తో మాఫియా రాజ్!

మరో అవకాశమిస్తే రాష్ట్రం ఖాళీ.. 'శాంతి' సీమలో కులచిచ్చు..

సిద్ధం అంటున్న జగన్‌కు ఇక యుద్ధమే.. చంద్రబాబు, పవన్ కల్యాణ్ గర్జన

కాకినాడ/అమలాపురం/అంబాజీపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరైన కోనసీమలో సీఎం జగన్ కులచిచ్చు పెట్టాలని చూశాడని టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ విరుచుకుపడ్డారు. ఒక్క చాన్సిస్తే రాష్ట్రాన్ని మాఫియా రాజ్ చేశారని.. మళ్లీ అవకాశమిస్తే రాష్ట్రం ఖాళీ అయిపోతోందని హెచ్చరించారు. దళితులపై దాడులు పెరిగిపోయాయని, జగన్ పాలనలో వారికి తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. కులమతాలు దాటి, ప్రాంతాలు దాటి, జిల్లాస్థాయి దాటి ఆలోచించకపోతే అందరం నష్టపోతామని హెచ్చరించారు. గురువారం సాయత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట సెంటర్, రాత్రికి అమలాపురంలో జరిగిన ప్రజాగళం ఉమ్మడి బహిరంగ సభల్లో వారిద్దరూ ప్రసంగించారు. జగన్ విధ్వంస పాలనలో దళితులు తీవ్రంగా నష్టపోయారని.. వారిపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఈ ముఖ్యమంత్రిది జగన్నాటకమని.. చేతికి అధికారం ఇస్తే మాఫియా సామ్రాజ్యం నడిపాడని.. పాలించమని పగ్గాలు కట్టబెడితే దోపిడీకి లైసెన్స్‌గా మార్చుకున్నాడని ధ్వజమెత్తారు. ఆయన ఇప్పుడు ఎక్స్‌పెయిరీ సీఎం అని మండిపడ్డారు. ఆయన ఉదయం అల్పాహారం కింద తినేది ఇసుక అయితే.. మధ్యాహ్న భోజనం కింద మద్యం, రాత్రి భోజనం కింద గనులు తినేసి రాష్ట్రం మొత్తాన్ని దోచేశారని విమర్శించారు. మళ్లీ గెలిపిస్తే ఈసారి ప్రజలను చంపేసి ఇళ్లకు డోర్ డెలివరీ చేస్తాడని హెచ్చరించారు.



అమలాపురం ప్రజాగళం సభలో చంద్రబాబు, పవన్

ఇది గోదావరి గర్జన: బాబు

సిద్ధం అంటున్న సీఎం జగన్‌కు ఇక యుద్ధమేనని చంద్రబాబు అన్నారు. 'కోనసీమలో గన్నవరం గర్జించింది. ఇది గోదావరి గర్జన.. ప్రభుత్వ వ్యతిరేకతకు అద్దంపట్టే స్పందన ఇక్కడ కనిపిస్తోంది. ఇక్కడ ఎన్నికలు లాంఛనమే. మనమే గెలుస్తున్నాం. మన ఆడబిడ్డల స్పందన చూస్తుంటే, వీర మహిళలైతే ఎప్పుడు పోలింగ్ వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. గాజుగ్లాసుకు ఓటేసి తద్వారా జగన్ గుండెల్లోకి గుచ్చేందుకు చూస్తున్నారు. మీలో ఒక బాధ, ఆవేదన, అభద్రతా భావం ఉన్నాయి. నేను పవన్ కల్యాణ్ వచ్చింది మీకు భరోసా కల్పించేందుకే.. మీ జీవితాల్లో వెలుగులు నింపేందుకే! సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్‌ను తన్ని తరిమికొట్టాలి. ఆయన ఐదేళ్ల పాలనతో ఇరవై ఏళ్లు వెనక్కి పోయిన రాష్ట్రాన్ని ఇప్పుడు కాపాడుకోలేకపోతే శాశ్వతంగా నష్టపోతాం. వలంటీర్లకు ఒకటే చెబుతున్నాం. రాజకీయాలు చేయవద్దు. వైసీపీ నేతలు చెప్పారని రాజీనామా చేస్తే మళ్లీ ఉద్యోగం రాదు. వచ్చేది కూటమి.. పోయేది మీ ఉద్యోగాలు. జగన్ ఉద్యోగాల కోసం మీ ఉద్యోగాలు పోగొట్టుకోవద్దు. వలంటీర్లకు పారితోషికం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతాం'అని చంద్రబాబు అన్నారు.

జైలు, బెయిల్‌కు మధ్య ఊగిసలాట: పవన్

ఎన్నికల తర్వాత జగన్ వెళ్లేది జైలుకేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హెచ్చరించారు. జగన్ జీవితం జైలుకు, బెయిల్‌కు మధ్య ఊగిసలాడుతోందన్నారు. 'వైసీపీకి ప్యాకప్ చెప్పడం ఖాయమైపోయింది. జగన్‌కు రోజులు దగ్గరపడ్డాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రాకుండా ఎవర్రా ఆపేది? జగన్ రాష్ట్రంలో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టారు. జేపీ వెంచర్స్‌ను అడ్డం పెట్టుకుని.. మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి, సజ్జల ముఠాగా ఏర్పడి ఇసుక రీచ్‌లను దోచుకున్నారు. లేత మనసున్న కోనసీమను జగన్ వచ్చి కలహాల సీమగా మార్చాడు" అని ధ్వజమెత్తారు.

మజ్లిస్‌ది దుశ్శాసన పాత్ర

మొన్న బీఆర్ఎస్.. నేడు కాంగ్రెస్‌తో దోస్తీ.. మజ్లిస్ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు కుట్ర: కిషన్‌రెడ్డి

» హెటెరో నుంచి కాంగ్రెస్ రూ.300 కోట్లు కొట్టేసింది

» ఆ సంస్థకు 'అదే భూ కేటాయింపు' వెనక మతలబేంటి: మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్/సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజకీయాల్లో ఎంఐఎంది దుశ్శాసన పాత్ర అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలోనే దేశం బాగుపడుతుందన్న ఎంఐఎం.. ప్లేటు ఫిరాయించి కాంగ్రెస్ పంచన చేరిందని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ ఒకే తాను ముక్కలని ఆరోపించారు. కాంగ్రెస్, ఎంఐఎం పొత్తును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మజ్లిస్ వ్యతిరేక ఓట్లు చీల్చేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు దుర్మార్గపు ఒప్పందాలు చేసుకుంటాయని మండిపడ్డారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఎంఐఎం నేతలు చీకటి వ్యాపారాలు చేస్తున్నారని.. ప్రభుత్వాల అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రజాకార్ల వారసత్వం, మతోన్మాదంతో వచ్చిన ఎంఐఎం.. మతాన్ని అడ్డుపెట్టుకుని పాతబస్తీ అభివృద్ధిని అడ్డుకుంటోందని మండిపడ్డారు. ఒవైసీ కుటుంబం బినామీ పేర్లతో రూ.వేల కోట్ల ఆస్తులు సంపాదించుకుందని ఆరోపించారు. ఐక్యత లేని ఇండియా కూటమికి అధికారంలోకి వస్తే.. మూడు నెలలకో ప్రధాని మారతారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే అవినీతికి చిరునామా అని అన్నారు. గురువారం ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి జీప్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కూడా కాలేదు.. అప్పుడే బ్లాక్ మెయిలింగ్ మొదలైందని విమర్శించారు.



బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

రీ సెటిల్‌మెంట్లు బయటపెడతాం: ఏలేటి

హెటెరో డ్రగ్స్ సంస్థ నుంచి కాంగ్రెస్ నేతలు రూ.300 కోట్లు తీసుకుని ఢిల్లీకి పంపించారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హెటెరోకు 15 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన రేవంత్‌రెడ్డి.. ఆ లీజును రద్దు చేసి.. తిరిగి అదే సంస్థకు కేటాయించడం వెనక మతలబు ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని బెదిరించి.. వారితో కాంగ్రెస్ నాయకులు రీ సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారని.. వాటిని ఒక్కొక్కటిగా బయటపెడతామని హెచ్చరించారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా ఎకరాకు కేవలం రూ.2లక్షల చొప్పున హెటెరో డ్రగ్స్‌కు లీజుకిచ్చింది. మార్కెట్ ధర ప్రకారం ఆ భూమి విలువ కనీసం రూ.1500 కోట్లు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీవో 12 ద్వారా ఆ లీజును రద్దు చేసింది. వెంటనే జీవో 37 ద్వారా అదే భూమిని తిరిగి అదే సంస్థకు రూ.5లక్షల చొప్పున లీజుకు ఇచ్చింది. దీని వెనక మతలబు ఏంటి..? అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై విచారణ జరిపి, బాధ్యులను జైలుకు పంపిస్తానని టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ ప్రగల్భాలు పలికారు. అయితే నాలుగు నెలలైనా ఏ ఒక్క అవినీతి అంశంపైనా విచారణ పూర్తికాలేదు. బీఆర్ఎస్ అక్రమాలపై కాంగ్రెస్ నేతలు రీసెటిల్‌మెంట్లు చేస్తున్నారు. అందుకే కాళేశ్వరం కేసును సీబీఐకి ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై రెండు రోజుల్లో మరో అంశాన్ని వెల్లడిస్తా. ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్ వివరాలు నాకు తెలియడంతో సచివాలయంలోని 6, 2వ అంతస్తుల్లో సెక్యూరిటీ పెంచారు. లోపలికి ఎవరినీ అనుమతించడం లేదు" అని మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

బీసీల ఓట్ల కోసమే కాంగ్రెస్ కులగణన: లక్ష్మణ్

బీసీల ఓట్ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేస్తామని చెప్పిందని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 46 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని సీఎం రేవంత్‌ను డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సామాజిక న్యాయం పేరిట రాహుల్ మొసలి కన్నీరు కారుస్తున్నారని లక్ష్మణ్ విమర్శించారు. ఈ ఎన్నికల్లో 30 శాతం బీసీలకు బీజేపీ టికెట్లు ఇచ్చిందని తెలిపారు.

కస్టమ్స్ పేరిట 2.24 కోట్లు హాంఫట్..!

» బెంగళూరు టెకీని దోచేసిన సైబర్ నేరగాళ్లు..

బెంగళూరు, ఏప్రిల్ 11: ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులమంటూ ఫోన్ చేసి.. మీ పేరిట మలేసియాకు వెళ్తున్న పార్శిల్‌లో నిషేధిత డ్రగ్స్ ఉన్నాయని.. ఈ కేసు నుంచి బయటపడాలంటే డబ్బులు చెల్లించాలని బెదిరించి.. ఓ టెకీ వద్ద రూ.2.24 కోట్లు కాజేసిన సంఘటన బెంగళూరులో వెలుగులోకొచ్చింది. ఇటీవల బెంగళూరుకు చెందిన ఓ మహిళా న్యాయవాది కూడా ఇదే తరహా మోసానికి గురై రూ.14.57 లక్షలు కోల్పోయారు. ఇదే తరహా భారీ మోసం మరొకటి వెలుగుచూడడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీసుల కథనం మేరకు.. జక్కూరుకు చెందిన 52 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుమారసామి శివకుమార్‌కు సైబర్ మోసగాళ్లు మార్చి 18 నుంచి 27వ తేదీల మధ్య పలుసార్లు ఫోన్ చేశారు. తాము కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నామని.. మీ పేరిట మలేసియాకు వెళ్తున్న పార్శిల్‌ను ఢిల్లీ విమానాశ్రయంలో ఆపేశామని చెప్పారు. ఆ పార్శిల్‌లో 140 గ్రాముల నిషేధిత డ్రగ్స్‌తోపాటు 16 పాస్‌పోర్టులు, 58 బ్యాంకు ఏటీఎంలు ఉన్నాయని తెలిపారు. ఆ తర్వాత ఈ కాల్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోకి బదిలీ చేస్తున్నామని, ఈ కేసు నుంచి బయటపడాలంటే డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో భయపడిన శివకుమార్ ఆర్టీజీఎస్, ఐఎంపీఎస్ ద్వారా ఎనిమిది విడతల్లో రూ.2.24 కోట్లు చెల్లించాడు. అయినప్పటికీ మోసగాళ్లు డబ్బుల కోసం వేధిస్తుండడంతో తాను మోసపోయానని గుర్తించిన శివకుమార్ ఈనెల 5న బెంగళూరులోని నార్త్‌ఈస్ట్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

మోసానికే బ్రాండ్ అంబాసిడర్ జగన్

» గౌరవంగా చెప్పుకొనే ఉద్యోగం ఒక్కటైనా ఇచ్చావా..?: వైఎస్ షర్మిల

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'జాబు రావాలంటే జగన్ కావాలంటూ సోషల్ మీడియాలో ప్రచారం ద్వారా వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఘరానా మోసానికి తెరలేపాడు' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. గురువారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. '2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 23 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని గద్దెనెక్కిన జగన్... ఐదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఏటా జాబ్ కేలండర్ అని, జంబో డీఎస్సీ అని, ఏపీపీఎస్సీ నుంచి వరుస నోటిఫికేషన్లు అని నమ్మించి నిరుద్యోగులను నిండా ముంచిన జగన్... మోసానికే బ్రాండ్ అంబాసిడర్. ఆయన అవసరాల కోసం వలంటీర్ల వ్యవస్థను తెచ్చి 2లక్షల ఉద్యోగాలు నింపామని చెప్పుకోవడం తప్ప గౌరవంగా చెప్పుకొనే ఒక్క ఉద్యోగం భర్తీ చేశారా? నేటికీ ప్రభుత్వ శాఖల్లో 2.25 లక్షల పోస్టులు ఖాళీగా ఉండడమే జగన్ పాలనకు నిదర్శనం' అని ఎద్దేవా చేశారు.

రేవంత్‌కు మద్దతివ్వడం కొందరికి నచ్చట్లేదు!

» ఆయన పనిచేస్తున్నారు కాబట్టే సపోర్టు చేస్తున్నా

» నాకు ఖమ్మం ఎంపీ టికెటిస్తే గెలిచినట్లే: వీహెచ్



హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డికి తాను మద్దతు ఇవ్వడం పార్టీలో కొందరికి నచ్చట్లేదని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత రావు అన్నారు. రేవంత్ పని చేస్తున్నారు కాబట్టే ఆయనకు సపోర్టు చేస్తున్నానని వ్యాఖ్యానించారు. ఖమ్మం ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో గురువారం వీహెచ్ 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం ఎంపీ టికెట్ తనకు ప్రకటిస్తే గెలిచినట్లేనని ధీమా వ్యక్తం చేశారు. 'ఖమ్మం నుంచి పోటీ చేయాలని 2019లోనే ప్రయత్నించాను. అప్పట్లో టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే అప్పటి పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా నా పేరును ప్రతిపాదించారు. అయినా ఎంపీ టికెట్ దక్కలేదు. ఇప్పుడు కూడా టికెట్ కోసమే కాంగ్రెస్ పెద్దలను కలిశాను. సీఎం రేవంత్ కూడా నాకు అనుకూలంగా ఉన్నారు. అయితే రేవంత్‌కు నేను మద్దతు ఇవ్వడం కొందరికి నచ్చట్లేదు. రాజీవ్‌గాంధీ పీఎంగా ఉన్నప్పటి నుంచే ఖమ్మం ప్రజలతో అనుబంధం ఏర్పడింది. రాజీవ్‌గాంధీ ఆశయాలను అమలు చేయాలనే ఆలోచనతోనే అక్కడి నుంచి ఎంపీగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నా.. అందులో భాగంగానే ఖమ్మంలో పార్టీ ఏ కార్యక్రమం నిర్వహించినా పాల్గొంటున్నా.. గతంలో భట్టి కూడా నన్ను పోటీ చేయమని చెప్పారు. ఇప్పుడేమో ఆయన భార్యకు టికెట్ కావాలని అడుగుతున్నారు. పార్టీ అధిష్ఠానం నన్ను గుర్తించి టికెట్ ఇస్తుందని ఆశిస్తున్నా.. టికెట్ ఇవ్వకపోయినా పార్టీలోనే ఉంటా..'నని స్పష్టం చేశారు.

'ఆప్‌కీ అదాలత్' కార్యక్రమంలో సీఎం రేవంత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జాతీయ మీడియా చానల్ 'ఇండియా టీవీ' నిర్వహించే 'ఆప్‌కీ అదాలత్' కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి విమానంలో ఢిల్లీకి వచ్చిన ఆయన నేరుగా యమునా బ్లాక్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత ఇండియా టీవీ ఆప్‌కీ అదాలత్‌లో పాల్గొన్నారు. కార్యక్రమ షూటింగ్ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. కాగా అతి త్వరలోనే ఈ కార్యక్రమం ఇండియా టీవీలో ప్రసారం కానుంది.

రాష్ట్రంలో కులగణనకు రూ.150 కోట్లు

» పూలే జయంతి సభలో మంత్రి పొన్నం ప్రభాకర్

ఖైరతాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన కోసం రూ.150 కోట్లు కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 5 న్యాయాల్లో కులగణన కూడా ఒకటి అని ఆయన గుర్తు చేశారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి ఉత్సవాన్ని తెలంగాణ పూలే జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 80 బీసీ కులాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ కార్పొరేషన్లకు నిధులు సమకూర్చి, కుల సంఘాలకు న్యాయం చేస్తామని తెలిపారు. బీసీలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి వృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా చేస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. దాదాపు రూ.5 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, హైదరాబాద్‌లో 5 ఎకరాల స్థలంలో పూలే స్మృతి భవనం నిర్మించాలని, బీసీ కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలంయాదవ్, నవీన్ యాదవ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

» బీఆర్ఎస్ పాలనలోనే పూలే ఆశయాల అమలు: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో బీసీల ఓట్లు దండుకునేందుకు కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు డిమాండ్ చేశారు. ఎంబీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామన్న హామీని కాంగ్రెస్ సర్కారు వెంటనే నిలుపుకోవాలని కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి ఉత్సవాలను గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. జ్యోతిరావు పూలే పేరుతో రూ.20వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్ పెడతామని చెప్పిన కాంగ్రెస్.. మొన్న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదని విమర్శించారు. వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు బీసీలకు అంతర్జాతీయ స్థాయి గురుకులాలను మండలానికి ఒకటి చొప్పున వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారని, దీనిపై ప్రభుత్వం స్పందించాలన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలను నెలకొల్పామని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు రెసిడెన్షియల్ కళాశాలలు, విదేశాల్లో చదువుకునే పేద విద్యార్థుల కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ వంటివి అమలు చేశామని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలోనే పూలే ఆశయాలను పూర్తి స్థాయిలో అమలు చేశామని కేటీఆర్ చెప్పారు.

కొప్పుల ఈశ్వర్.. యువతకు స్ఫూర్తి

భవిష్యత్తులో గొప్ప నాయకులుగా ఎదగాలనుకుంటున్న యువత.. మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని కేటీఆర్ అన్నారు. గురువారం ఎక్స్ వేదికగా కొప్పుల ఈశ్వర్ ఫొటోను షేర్ చేసిన కేటీఆర్.. ఆయన రాజకీయంగా ఎదిగిన తీరును వివరించారు. సింగరేణి కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించి.. రాష్ట్ర మంత్రి వరకు ఒక్కో మెట్టు ఆయన ఎదిగిన తీరును యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.

ఉన్నత ఆలోచనలతోనే ఉన్నతమైన జీవితం

» బుర్రా వెంకటేశం

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు చైతన్యవంతమైనప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని విద్య, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంతి సందర్భంగా సంక్షేమ భవన్‌లో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని బడుగు, బలహీన వర్గాల వారికి విద్య కల్పించడానికి అహర్నిశలు పాటుపడిన త్యాగధనుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. పూలే ఆలోచనలకు అనుగుణంగా నేటి యువత అడుగులు వేయాలని సూచించారు. ఉన్నత ఆలోచనల ద్వారానే ఉన్నతమైన జీవితం సాధ్యమవుతుందని, మార్పు కోరుకునే ప్రతీ ఒక్కరూ ఉన్నతమైన ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. కాగా, వేడుకల్లో భాగంగా జ్యోతిబా పూలే జీవిత చరిత్ర తెలిపేలా నృత్య ప్రదర్శన, ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం రచించిన 'అమ్మ గీసిన బొమ్మ' పాట నృత్య ప్రదర్శన, బంజారా నాట్య ప్రదర్శనలతో పాటు విద్యార్థులు గీసిన పలు బొమ్మలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

జనగణన జరిగినప్పుడే పూలేకు నిజమైన నివాళి: సీపీఐ

పూలే ఆశయాలను నెరవేరుస్తామని చెబుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ జనగణన చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం పూలే 197వ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో పూలేకు నివాళులర్పించారు. జనగణన చేపట్టిననాడే పూలేకు నిజమైన ఘనమైన నివాళి అర్పించినట్టని ఈ సందర్భంగా చాడ పేర్కొన్నారు.

పదేళ్లు రేవంతే ముఖ్యమంత్రి

మా పార్టీలో గ్రూపుల్లేవు.. ఏక్‌నాథ్‌లూ లేరు.. హరీశ్, ఏలేటి నోరు అదుపులో పెట్టుకోవాలి

కుల, మతాల మధ్య చిచ్చు పెట్టాలని బీజేపీ చూస్తోంది.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 11: తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంటుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పదేళ్లూ రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని స్పష్టం చేశారు. గురువారం నల్లగొండలో జరిగిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్న అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని రోజులు ఉంటుందో తెలియదని హరీశ్‌రావు, మహేశ్వర్‌రెడ్డిలు నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, ఇకపై పనికిమాలిన చిట్‌చాట్‌లు మానుకోవాలని హితవు పలికారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ ఒక సీటు గెలుచుకున్నా.. తాము దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. తనపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు నోరు పారేసుకోవడం మానుకోవాలని సూచించారు. ఏక్‌నాథ్ శిందే అనే వ్యక్తిని బీజేపీ సృష్టించిందని, మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేనను చీల్చి సంతలో పశువులను కొన్నట్లు ఎమ్మెల్యేలను కొన్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో ఏక్‌నాథ్‌లు లేరన్నారు. కేసీఆర్ కూడా 13 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొని ప్రతిపక్షాన్ని లేకుండా చేశాడని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో 5 గ్రూపులు ఉన్నాయనడం తగదని, తమ పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులు అధికార పార్టీ అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో అందరం ఒకే బృందంగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు తెలంగాణ దోపిడీకి గురైందని, తమ సర్కారు దాన్ని సరిదిద్దుతోందని చెప్పారు. ఇతర పార్టీలకు చెందిన ఏ నాయకుడైనా అపార్థాలను సృష్టించే ప్రయత్నం చేస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బీజేపీ కులమతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తోందని ఆరోపించారు.



నల్లగొండలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో జానారెడ్డి, రఘువీర్‌రెడ్డి

సీఎం చెప్పినా.. పెంచేదే లే!

(మొదటిపేజీ తరువాయి)

కనీస మద్దతు ధర రూ.2,183, ఏ- గ్రేడు ధాన్యానికి రూ.2,203 ఉండగా.. సగటున రూ.500 నుంచి రూ.600 మేర తగ్గించి ట్రేడర్లు, రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్లో ఈ నెల పదో తేదీన క్వింటాలు ధాన్యానికి కనిష్ఠ ధర రూ.1,551, గరిష్ఠ ధర రూ.1,569, మోడల్ ధర రూ.1,659 చొప్పున ట్రేడర్లు కొనుగోలు చేయటంతో.. రైతులు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. దీంతో మార్కెట్ కమిటీ కార్యదర్శిని సస్పెండ్ చేసి, నలుగురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితి ఒక్క జనగామ జిల్లాలోనే కాదు.. నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి, పెద్దపల్లి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో కూడా ఉంది. దొడ్డు రకాలకే రూ. 500 నుంచి రూ. 600 వరకు రైతులు నష్టపోతున్నారు. ఇక సన్నరకాలకైతే క్వింటాలుకు రూ.700-800 చొప్పున రైస్‌మిల్లర్లు లబ్ధి పొందుతున్నారు.

ప్రభుత్వ కేంద్రాలున్నా..

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇంకా ధాన్యం సేకరణ వేగం పుంజుకోలేదు. గత నెల 25నే నిజామాబాద్, నల్ల గొండ జిల్లాల్లో సెంటర్లు ప్రారంభించారు. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించారు. సుమారు 7 వేల కేంద్రాలు ఇప్పటికే తెరిచారు. లక్ష మెట్రిక్ టన్నులకు పైగా ప్రొక్యూర్మెంట్ చేశారు. కానీ రైతులు ఇంకా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పోటెత్తడం లేదు. గడిచిన వారం, పది రోజుల్లో.. పండుగలు, సెలవులు ఎక్కువగా వచ్చాయి. ఈ ఆదివారం వరకు అదే పరిస్థితి ఉంది. దీంతో అధికారులు, సిబ్బంది అంతా ఆ ధ్యాసలోనే ఉన్నారు. ధాన్యం సేకరణను అత్యవసరంగా పేర్కొని.. సెలవుల్లో కూడా అధికారులు, సిబ్బందిని పురమాయించి రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేయించాల్సి ఉన్నా అలాంటి పరిస్థితి కనిపించట్లేదు. అధికారులంతా ఎవరికివారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అయితే.. 15 రోజులుగా అందుబాటులో లేరు. ఆయన రాజస్థాన్ ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నారు. దీంతో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అధికారులెవరూ ధాన్యం కొనుగోళ్ల విషయాన్ని పట్టించుకోలేదు. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం లోపించింది. అయితే గురువారం (11న) కమిషనర్ డీఎస్ చౌహాన్ హైదరాబాద్‌కు తిరిగి వచ్చినట్లు తెలిసింది. ఆయన ఇక్కడే ఉంటారా? లేక మళ్లీ రాజస్థాన్ ఎన్నికల విధులకు వెళ్తారా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.



అందరూ కుమ్మక్కయి..

ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం, అకాల వర్షాలు పడితే మొత్తానికే నష్టపోతామనే భయంతో రైతులు త్వరగా కోతలు చేపడుతున్నారు. తేమ ఎక్కువుంటే ప్రభుత్వ సెంటర్లలో తీసుకోరనే ఉద్దేశంతో ప్రైవేటు సెంటర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఆరబెట్టడం, చెన్నీ పట్టడం, తాలు, కడ్తా నిబంధనలు పాటించటం ఇబ్బంది అవుతుందని.. ట్రైడర్లు, రైస్‌మిల్లర్లకు అమ్ముతున్నారు. ఇదే అదనుగా వారు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ సెంటర్లలో అయినా, ప్రైవేటు మార్కెట్లో అయినా.. కనీస మద్దతుధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేయొద్దనే నిబంధన ఉన్నా పాటించట్లేదు. రైస్‌మిల్లర్లు, ట్రేడర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు.. అంతా మిలాఖత్ అయి రైతులను దోపిడీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే జనగామ మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌ను ఆ జిల్లా అడిషనల్ కలెక్టర్ సస్పెండ్ చేశారు. కానీ తిరుమలగిరి, సూర్యాపేట, గద్వాల, నారాయణపేట్, మోత్కూర్, మహబూబ్‌నగర్, జైనథ్, ఘన్‌పూర్.. సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్కెట్లలో కార్యదర్శుల వైఖరి ఇలాగే ఉండడం గమనార్హం.

దయ తలచి రూ.30 పెంచారు!

ధాన్యానికి తక్కువ ధర ఇవ్వడంపై ప్రభుత్వం సీరియస్ అవుతున్నా.. వ్యాపారులు పట్టించుకోవట్లేదు. జనగామ మార్కెట్‌లో గురువారం జరిగిన అమ్మకాలే ఇందుకు నిదర్శనం. కనీస మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నారంటూ ఆ మార్కెట్‌లో బుధవారం నిరసన తెలిపిన రైతుల్లో చాలా మంది క్వింటా ధాన్యాన్ని రూ.1530 నుంచి రూ.1889లోపు అమ్మేందుకు మొగ్గు చూపారు. సర్కారు ఆగ్రహం నేపథ్యంలో.. బుధవారం నిర్ణయించిన ధరల కంటే క్వింటాకు రూ.30 చొప్పు ఎక్కువ ఇస్తామని ట్రేడర్లు చెప్పడంతో ఆ ధరకు అమ్మేసుకున్నారు. అదేమంటే.. వర్షాల భయంతో గత్యంతరం లేక తక్కువ ధరకు అమ్ముకుంటున్నామని చెబుతున్నారు. తేమ, తాలు లేకుండా అమ్మితే రూ.2203 ఇప్పిస్తామని అధికారులు చెప్పినప్పటికీ.. కొందరు రైతులు ట్రేడర్లకే అమ్ముతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం 17 వచ్చి, తాలు లేకపోతేనే రూ.2203 ధర ఇస్తారు. దీని కోసం వడ్లను ఆరబోసి, తూర్పారబట్టాల్సి ఉంటుంది. ఇదంతా చేయడానికి రైతులకు రెండు, మూడు రోజుల సమయం పడుతుంది. ఈ లోపు వర్షం వస్తే ధాన్యం అంతా తడిసిపోతుందనే భయంతో వ్యాపారులకు అమ్ముకునేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. అయితే.. రైతులు ఇష్టపూర్వకంగానే క్వింటాకు అదనంగా రూ.30 చొప్పున తీసుకొని ధాన్యాన్ని విక్రయిస్తున్నారని జిల్లా మార్కెటింగ్ మేనేజర్ నరేంద్ర తెలిపారు.

తక్కువ ధర చెల్లిస్తే సహించేది లేదు

» 'జనగామ' ఘటనపై సీఎం సీరియస్

» 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని జత చేస్తూ 'ఎక్స్'లో స్పందన

» అదనపు కలెక్టర్‌కు అభినందనలు

» ట్రేడర్లపై కేసులు, కార్యదర్శి సస్పెన్షన్

హైదరాబాద్, జనగామ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతుల కష్టాన్ని మార్కెట్ కమిటీ అధికారులు.. వ్యాపారులతో కుమ్మక్కై ధర తక్కువ చేసే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికారులందరూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా ధాన్యానికి రూ.1551 చొప్పున ధర చెల్లించడంపై సీరియస్ అయిన ఆయన 'తేమ, తాలు సాకు.. క్వింటా వడ్లకు రూ.1,551' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన వార్త క్లిప్పింగ్‌ను జోడించి 'ఎక్స్' వేదికగా స్పందించారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన ఘటనపై సకాలంలో స్పందించి.. ట్రేడర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని, మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఆదేశించిన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌ను ఆయన అభినందించారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆదేశాల మేరకు అధికారులు మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. పోలీసులు ముగ్గురు ట్రేడర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అలాగే, ముగ్గురు ట్రేడర్లకు షోకాజ్ నోటీసులు సైతం అధికారులు జారీ చేశారు. వారి లైసెన్స్‌లను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఇక ట్రేడర్లతో కార్యదర్శి కుమ్మక్కయ్యారన్న ఆరోపణపై నివేదిక ఇవ్వాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి.. జనగామ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నరేంద్రను కోరారు.

ఘనంగా ఈద్ వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

ఏఐసీసీ రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పార్టీ సీనియర్ నాయకులు కే జానారెడ్డి, మధుయాష్కీ, మైనారిటీ విభాగం నాయకులు ఫిరోజ్ ఖాన్, మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ తదితరులు కూడా పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అతిథులకు షబ్బీర్ అలీ రంజాన్ పండుగ ప్రత్యేక వంటకం షీర్ కుర్మా అందించి విందు భోజనం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆజంపురలోని మాజీ హోం మంత్రి మహమూద్ అలీ నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో చేపట్టిన సత్కార్యాలను కొనసాగించాలని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మీరాలం ఈద్గా మైదానంలో జరిగిన ఈదుల్ ఫితర్ సామూహిక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ముస్లింలు అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మక్కా మసీదు ఖతీబ్ మౌలానా హఫీజ్ రిజ్వాన్ ఖురేషీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో సుమారు లక్ష మందికి పైగా ముస్లింలు పాల్గొన్నారు.



రంజాన్ సందర్భంగా మాసబ్‌ట్యాంక్ వద్ద ముస్లిం సోదరుల ప్రార్థనలు



షబ్బీర్ అలీ నివాసంలో దీపాదాస్, జానారెడ్డి, పొంగులేటి తదితరులు

యూకే ఫ్యామిలీ వీసాకు పెరిగిన కనీస వేతన పరిమితి

» అమల్లోకి వచ్చిన నిబంధన

లండన్, ఏప్రిల్ 11: ఫ్యామిలీ వీసాల స్పాన్సర్‌షిప్‌నకు అవసరమైన కనీస ఆదాయానికి సంబంధించి బ్రిటన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ నిర్ణయం మేరకు బ్రిటన్ పౌరులు, నివాసితులు (భారత సంతతి వారు సహా)తమ బంధువులు బ్రిటన్ వచ్చేందుకు ఫ్యామిలీ వీసాను స్పాన్సర్ చేయాలనుకుంటే వారికి వార్షికంగా కనీసం 29,000 పౌండ్ల వేతనం ఉండాలి. ఇంతకు ముందు ఇది 18,600 పౌండ్లు ఉండేది. దీనిని ఏకంగా 55 శాతానికిపైగా పెంచుతూ గత ఏడాది ప్రభుత్వం ప్రకటన చేసింది. తాజాగా ఇది అమల్లోకి వచ్చింది. వచ్చే ఏడాది ప్రారంభంకల్లా దీనిని 38,700 పౌండ్లకు పెంచే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది. నైపుణ్యం కలిగిన కార్మికుల వీసా వేతన పరిమితి ఈ స్థాయిలో ఉంది. చట్టపరమైన వలసలను తగ్గించడానికేకాకుండా ఇక్కడికి వచ్చే వారి వల్ల పన్ను చెల్లింపుదారులపై భారం పడకుండా చూసేందుకు ప్రధాని రిషి సునాక్, హోం సెక్రటరీ జేమ్స్ క్లెవర్లీ ప్యాకేజీలో ఇది చివరి చర్యగా యూకే హోం ఆఫీస్ పేర్కొంది. కాగా గత ఏడాదిలో ఆవిష్కరించిన విస్తృత ప్యాకేజీలో భాగంగా తాజా చర్యను తీసుకున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ప్రారంభం నుంచి పలు వీసా నిబంధనలను కఠినతరం చేశారు.

వేసవి సన్నద్ధతపై మోదీ సమీక్ష

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: ప్రస్తుత వేసవి కాలంలో సాధారణం కంటే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందనే వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో ప్రధాని మోదీ అధ్యక్షతన పలు ప్రభుత్వ విభాగాల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయనే అంచనాల దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో అవసరమైన మందులు, ఫ్లూయిడ్స్, ఐస్ ప్యాక్స్, ఓఆర్ఎస్, తాగునీరు తదితరాలపై సమీక్ష జరిపారు. ఆస్పత్రులలో సరిపడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఉద్యోగాల్లో వసూళ్ల 'సోర్సింగ్'!

నిరుద్యోగుల ఆశలే అవకాశంగా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల అక్రమ దందా

» శాఖాధిపతులతో కలిసి వసూళ్లు?

» నోటిఫికేషన్ లేకుండా నియామకాలు

» భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో.. ఒక్కొక్కరి నుంచి 2 లక్షల వసూలు

» 11 నెలలకే ఉద్యోగం పోతుండడంతో రోడ్డున పడుతున్న నిరుద్యోగులు

భూపాలపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల ఆశలను అవకాశంగా మలచుకొని కొన్ని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు దందాలకు పాల్పడుతున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఏర్పడిన ఖాళీల్లో ప్రభుత్వం నేరుగా నియామకాలు చేపట్టకుండా ఏజెన్సీల మాటున శ్రమ దోపిడీకి తెర తీస్తే.. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి అక్రమంగా డబ్బులు గుంజుతూ వారి జీవితాలతో ఆటలాడుతున్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కొంతకాలంగా సాగుతున్న ఈ అక్రమ వసూళ్ల పర్వం తాజాగా తారాస్థాయికి చేరింది. శాఖను బట్టి, ఉద్యోగాన్ని బట్టి ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల దాకా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు వసూలు చేస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఏజెన్సీలే కాకుండా ఆయా శాఖలకు చెందిన శాఖాధిపతులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, నేతల పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండు జిల్లాల్లో గత ఏడాది కాలంలో ఇలా 600మందికిపైగా ఔట్‌సోర్సింగ్ నియామకాలు దొడ్డిదారిన జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఏజెన్సీల ముసుగులో కొంతమంది నిర్వాహకులు సంబంధిత అధికారులకు ముడుపులు ముట్టజెప్పి ఇష్టారీతిన నియామకాలు జరిపారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టరేట్లు కేంద్రంగా సాగుతున్న ఈ అనైతిక దందాలో కొంత మంది ఉద్యోగులే కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా జిల్లా పాలనలో కీలక స్థానంలో ఉన్న ఓ ఉన్నతోద్యోగి పాత్ర ఉందంటున్నారు. ఆ ఉద్యోగి ఏకంగా బినామీ పేరుతో ఓ ఏజెన్సీనే నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఏ శాఖల్లో ఖాళీలు ఏర్పడుతున్నాయో ముందుగానే సంబంధిత విభాగాధిపతులు, ఏజెన్సీలకు సమాచారమిస్తూ ఈ వసూళ్ల పర్వంలో కీలక పాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు కూడా తమ బినామీ ఏజెన్సీల సహాయంతో శాఖాధిపతుల దన్నుతో వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. శాఖాధిపతుల వ్యక్తిగత సహాయకులు కూడా ఈ అక్రమ వసూళ్ల పర్వంలో భాగస్వాములుగా ఉన్నట్లు తెలుస్తోంది.

వసూళ్ల దందా సాగుతోందిలా..

భూపాలపల్లి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలు, ఆస్పత్రుల్లో సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికపై నియమిస్తున్నారు. ఇందుకుగాను స్థానికంగా నిరుద్యోగులై ఉండి మ్యాన్‌పవర్ సప్లై అనుభవం కలిగిన సంస్థలను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలుగా ఎంప్యానల్ చేస్తోంది. ఇలా ఎంప్యానల్ అయిన ఏజెన్సీల్లో టెండర్ ప్రక్రియ ద్వారా ఎవరు తక్కువ కమిషన్ కోట్ చేస్తే వారికి.. సిబ్బంది నియామకాల కోసం ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అయితే ఒకటి రెండు ఖాళీలు ఉన్న శాఖలకు సంబంధించి మాత్రం ఆయా విభాగాధిపతులు నేరుగా భర్తీ చేసుకుంటున్నారు. దీంతో ఈ తరహా నియామకాల్లోనే భారీ మొత్తంలో ముడుపులు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం దక్కించుకుంటే భవిష్యత్తులో ఉద్యోగం పర్మినెంట్ అవుతుందని నిరుద్యోగులకు నిర్వాహకులు ఆశ చూపిస్తున్నారు. దీంతో ఏజెన్సీలు అడిగిన సొమ్మును ముట్టజెప్పి నిరుద్యోగులు ఉద్యోగం పొందుతున్నారు. తీరా 11 నెలలకు ఒప్పందం ముగియగానే రూ.లక్షలు ముట్టజెప్పిన నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారు. అటు ఏజెన్సీల కాంట్రాక్టు వ్యవధి కూడా ముగుస్తుండడం, కొత్తగా వచ్చే ఏజెన్సీలు తిరిగి పాతవారిని విధుల్లోకి తీసుకునేందుకు మళ్లీ ముడుపులు కోరడం, లేదంటే రెండు మూడు నెలల పాటు వేతనాలను మినహాయించుకొని ఇవ్వడం చేస్తున్నాయి.

శాఖాధిపతులు నియమించినా..

చాలా శాఖల్లో శాఖాధిపతులే నేరుగా సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికపై నియమించుకొని వారి పేర్లను ఏజెన్సీలకు అప్పగిస్తున్నారు. అయితే ఈ సిబ్బంది తమకు మామూలు చెల్లించలేదనే సాకుతో వివిధ కారణాలు చూపుతూ వారికి ఏజెన్సీ ద్వారా చెల్లించాల్సిన వేతనాలను ఐదారు నెలలపాటు చెల్లించకుండా వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో నిరుద్యోగులు చేసేదేమీలేక ఏజెన్సీలు అడిగిన మొత్తాన్ని సమర్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైద్య కళాశాలకు అవసరమైన తాత్కాలిక సిబ్బంది నియామకాలలోనూ జిల్లాకు చెందిన ఓ ప్రజా ప్రతినిధి సహా ఆయన అనుచరులుగా చెప్పుకొంటున్న మరికొందరు కూడా ముడుపులు పుచ్చుకొని తమకు అనుకూలంగా ఉన్న ఏజెన్సీలతో బేరసారాలాడుతున్నట్లు తెలిసింది. అయితే ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల పనితీరుపై అధికార యంత్రాంగం పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఉల్లంఘనలు, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. భూపాలపల్లి జిల్లాలో మొత్తం 53 ఏజెన్సీలు రిజిస్ట్రేషన్ చేసుకోగా, ఇందులో 33 ఏజెన్సీలు ఎంప్యానల్‌లో చోటు దక్కించుకున్నాయి. ఇందులో ఒకటి రెండు మినహా మిగతా ఏజెన్సీలన్నీ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందినవే. నిబంధనల ప్రకారం పొరుగు జిల్లాలకు చెందిన ఏజెన్సీలు వాటికి సంబంధించిన కార్యాలయాలను స్థానికంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారుల అండదండలతో కేవలం కాగితాలపై తప్పుడు చిరునామాలు సృష్టించి ఉద్యోగుల నియామకాలు జరుపుతున్నాయి. ఏజెన్సీలకు సంబంధించి ఎంప్యానల్‌మెంట్ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి వ్యవహరిస్తున్నారు. ఏజెన్సీల లావాదేవీలు, వేతనాలు, పీఎఫ్ చెల్లింపుల లాంటి కార్యకలాపాలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

సరిహద్దులపై నిఘాకు.. అంతర్రాష్ట్ర పోలీస్ వాట్సాప్ గ్రూప్!

- ఎన్నికల నేపథ్యంలో సమాచార మార్పిడి
- తెలంగాణలో 145 కంపెనీల కేంద్ర బలగాలతో బందోబస్తు
- నోటిఫికేషన్‌కు ముందే పట్టుబడుతున్న నోట్ల కట్టలు
- సోషల్ మీడియా పోస్టింగ్స్‌పై ప్రత్యేక నిఘా
- తమిళనాడు ఎన్నికలకు తెలంగాణ బలగాలు

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోకి డబ్బు, మద్యం అక్రమ రవాణా కట్టడికి తెలంగాణ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సరిహద్దు జిల్లాల కమిషనర్లు, ఎస్పీలు.. పొరుగు రాష్ట్రాల సరిహద్దు జిల్లా పోలీసు అధికారులు, కేంద్ర బలగాల అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. నిరంతరం, సత్వర సమాచార మార్పిడికోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. పోలీసులతోపాటు రెవెన్యూ, ఇతర విభాగాల అధికారులను ఆ గ్రూపులో చేర్చారు. కాగా.. తెలంగాణలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు 145 కంపెనీల కేంద్ర బలగాలు రంగంలోకి దిగుతున్నాయి. ఇప్పటికే 60 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్ర వ్యాప్తంగా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నాయి. దశల వారీగా మిగతా బలగాలు బందోబస్తు విధుల్లోకి వచ్చి, చేరనున్నాయి. ఎన్నికల నాటికి కేంద్ర బలగాలతోపాటు సరిహద్దు రాష్ట్రాల నుంచి పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో భాగస్వామ్యం చేయనున్నారు. మార్చి 16న లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నిర్వహిస్తున్న తనిఖీల్లో ఇప్పటి వరకు సుమారు రూ.50 కోట్లు విలువైన నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర విలువైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో జరిపిన తనిఖీల్లో మొత్తం రూ. 45 కోట్లు విలువైన నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు పట్టుబడగా.. ఈ సారి ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే.. రూ.50 కోట్ల సొత్తు పట్టుబడటం గమనార్హం.! నోటిఫికేషన్ వెలువడ్డ తర్వాత నగదు ప్రవాహం మరింత ఎక్కువగా ఉంటుందనే అంచనాల నేపథ్యంలో రాష్ట్రంతోపాటు, రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 466 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రాష్ట్ర సరిహద్దుల్లో 85 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. నోటిఫికేషన్ వెలువడ్డ తర్వాత ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్‌పోస్టుల సంఖ్య మరింతగా పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది తనిఖీల తీరు, పట్టుబడుతున్న నగదు ఇతరాత్ర వాటిని ఉన్నతాధికారులు పర్యవేక్షించేందుకు వీలుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేశారు. మరోవైపు ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా పోస్టింగ్స్‌పై పోలీసులు నిఘా పెట్టారు. కాగా, ఈ నెల 19న తమిళనాడులో జరగనున్న లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు తెలంగాణ నుంచి 2 వేల మంది పోలీసులను తరలిస్తున్నారు.

గిగ్ వర్కర్లకు భద్రత ఏది?

అమలు కాని 5 లక్షల ప్రమాద బీమా.. ప్రభుత్వానికి సహకరించని కంపెనీలు

- గిగ్ వర్కర్ల వివరాలివ్వకుండా అలసత్వం
- 3 నెలల్లోనే 12 మంది మృత్యువాత
- కంపెనీల నిర్లక్ష్యంతో అందని పరిహారం



హైదరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): యాప్‌లో ఇష్టమైన ఆహారం బుక్ చేస్తే చాలు... పగలు, రాత్రి, ఎండ, వాన.. తేడా లేకుండా డెలివరీ బాయ్స్ సదా సిద్ధంగా ఉంటారు. కోరిన చోటికి వెళ్లాలన్నా.. ఆయా కంపెనీల యాప్‌ల్లో మీట నొక్కడమే తరువాయి... బైక్ ట్యాక్సీతో మన ఇంటి ముందు ప్రత్యక్షమవుతారు. అంతేనా.. కూరగాయలు, కిరాణా సామగ్రి, పచ్చళ్లు, పార్సిళ్లు.. ఇలా బయట అడుగు పెట్టకుండానే అన్నింటినీ మన గుమ్మం వద్దకు తెచ్చేస్తుంటారు. వీరి ద్వారా రెస్టారెంట్లు, డెలివరీ కంపెనీలు భారీగా లాభాలు గడిస్తుండగా.. సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం కోట్లాది రూపాయల ఆదాయాన్ని పొందుతున్నాయి. కానీ.. విధి నిర్వహణలో వీరు ప్రాణాలు కోల్పోతున్నా.. సదరు కంపెనీలు పట్టించుకోవడం లేదు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నా.. కంపెనీలు తమ ఉద్యోగుల వివరాలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఫలితంగా మృతుల కుటుంబాలకు పరిహారం అందడం లేదు.

రాష్ట్రంలో 4.25 లక్షల మంది

ఆహార, నిత్యావసరాల డెలివరీ యాప్‌లు, ఆటోమొబైల్ ట్రాన్స్‌పోర్టు యాప్ కంపెనీల్లో తాత్కాలిక ఉపాధి పొందే వారే 'గిగ్' వర్కర్స్ రాష్ట్రవ్యాప్తంగా 4.25 లక్షల మంది ఇలా ఉపాధి పొందుతుండగా.. వీరిలో 3లక్షల మంది రాజధాని హైదరాబాద్‌లోనే ఉన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 85 లక్షల మంది ఈ రంగంపై ఆధారపడి ఉండగా.. 2030 నాటికి వీరి సంఖ్య 4 కోట్లు దాటుతుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ మేరకు వీరి సంక్షేమం, భద్రతపై చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సోషల్ సెక్యూరిటీ కోడ్‌ను సిద్ధం చేసి రాష్ట్రాలకు ప్రత్యేక ఆదేశాలు జారీచేసింది. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా సంస్థలు చేసే ప్రతి డెలివరీపై 2శాతం లెవీని వసూలు చేసి, ఆ నిధులను గిగ్ వర్కర్స్ సంక్షేమం కోసం వినియోగించాలి. కానీ ఇప్పటిదాకా రాజస్థాన్ మినహా ఏ రాష్ట్రం కూడా ఈ దిశగా చర్యలు తీసుకోలేదు. కేంద్రం సూచించిన విధంగా సోషల్ సెక్యూరిటీ కోడ్‌ను తెలంగాణలో అమలు చేయాలని ఇక్కడి సంఘాలు గతంలో పలు మార్లు అప్పటి ప్రభుత్వాన్ని కోరినా.. స్పందన కనిపించలేదు. అయితే, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే బీమా సౌకర్యంతోపాటు సోషల్ సెక్యూరిటీ వెల్ఫేర్ బోర్డు వేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. చెప్పినట్టుగానే అధికారంలోకి వచ్చిన తర్వాత గిగ్ వర్కర్స్ సంఘం ప్రతినిధులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి.. తెల్ల రేషన్ కార్డు లేకపోయినా రూ.10లక్షల వైద్య బీమా, రూ.5లక్షల ప్రమాద బీమా అందించాలని కార్మిక, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గిగ్ వర్కర్స్ వివరాలు ఇవ్వాలని గత ఏడాది డిసెంబరు 30న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా.. ఆయా కంపెనీలు ఇప్పటికీ స్పందించలేదు. దీంతో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. మరోవైపు.. ఆయా కంపెనీలు సైతం గిగ్ వర్కర్స్ సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయి. "గత మూడు నెలల్లో హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 12 మంది గిగ్ వర్కర్స్ మరణించారు. వీరికి ప్రభుత్వం నుంచి, కంపెనీల నుంచి ఎలాంటి పరిహారం అందలేదు. వర్కర్స్ వివరాలు ఇవ్వని కంపెనీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి" అని గిగ్ వర్కర్స్ జాతీయ కార్యదర్శి షేక్ సలావుద్దీన్ డిమాండ్ చేశారు.

గెస్ట్ లెక్చరర్ల గోస!

- పదేళ్లుగా చాలీచాలని వేతనంతో విధులు
- రాష్ట్ర వ్యాప్తంగా ఇబ్బందుల్లో రెండు వేల మంది
- క్రమబద్ధీకరించాలని ప్రభుత్వానికి వేడుకోలు

జనగామ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కరువైంది. పదేళ్లుగా పని చేస్తున్నా సరైన వేతనాలు లేక, ఉద్యోగం ఉంటుందో... ఊడుతుందో.. తెలియక బిక్కుబిక్కుమంటూ పాఠాలు బోధిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బోధన సిబ్బంది కొరతను అధిగమించేందుకు పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్ల విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా పీరియడ్ ప్రాతిపదికన వేతనాలు అందిస్తామని చెప్పి నియామకాలు చేపట్టింది. కాంట్రాక్టు, పార్ట్‌టైం లెక్చరర్ల మాదిరిగానే గెస్ట్ లెక్చరర్లను కూడా ఓపెన్ నోటిఫికేషన్, ఇంటర్వ్యూ, డెమో, పీజీ మెరిట్ మార్కుల ఆధారంగా త్రీమెన్ కమిటీ ఎంపిక చేసింది. గత ఏడాది బీఆర్ఎస్ ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్లను తొలగిస్తున్నట్లు ప్రకటించడంతో వారందరూ కోర్టును ఆశ్రయించారు. గెస్ట్ లెక్చరర్లకు అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో వారందరూ ఇంకా విధుల్లో కొనసాగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2వేల మంది గెస్ట్ లెక్చరర్లుగా పని చేస్తుండగా.. ఒక్కో పీరియడ్‌కు రూ.390చొప్పున వేతనం అందజేస్తున్నారు. సాధారణ సెలవులు, పండుగ రోజులు, ఇతరత్రా సెలవు దినాల్లో వీరికి వేతనం ఉండదు. ఈ లెక్కన నెలకు కేవలం 26రోజుల వేతనం మాత్రమే వస్తుంది. ఇక, పండుగలతో పాటు వేసవి సెలవుల్లో వీరికి వేతనమే రాని పరిస్థితి. ఈ లెక్కన ఏడాదికి 6 నుంచి 8 నెలల జీతాన్ని మాత్రమే వారు పొందుతున్నారు. నెలకు గరిష్ఠంగా 72 పీరియడ్ల పాటు పాఠాలు బోధిస్తే వేతనంగా రూ.28,080 మాత్రమే వస్తోందని, పెరిగిన నిత్యావసర ధరలు, రవాణా ఖర్చులు, ఇతర కుటుంబ అవసరాలకు ఆ మొత్తం సరిపోవడం లేదని గెస్ట్ లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ప్రభుత్వ కాలేజీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. తమను మాత్రం విస్మరించిందని మండిపడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.42,000, వర్సిటీల్లో పనిచేసే వారికి రూ.50,000 చొప్పున వేతనం అందిస్తామని గతంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ మేరకు తమను క్రమబద్ధీకరించాలని గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారు. ఈ విషయమై ఇటీవలే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో పాటు పలువురు మంత్రులను కలిసి విన్నవించారు. గెస్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలి. పీరియడ్ల వారీగా కాకుండా నెల నెలా నిర్దిష్ట వేతనం అమలు చేయాలి. 12నెలల వేతనం చెల్లించాలి. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా నెలకు రూ.42వేల కనీస వేతనం చెల్లించాలి. ఆటో రెన్యూవల్ ఇవ్వాలి. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి' అని గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామెర ప్రభాకర్ కోరారు.

పామేడు అడవుల్లో వైమానిక దాడులు!

- 30 చోట్ల దాడులను ఖండిస్తూ మావోయిస్టు పార్టీ లేఖ

చర్ల, ఏప్రిల్ 11: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడు అడవుల్లో ఈనెల 7వ తేదీన నక్సల్స్ లక్ష్యంగా వైమానిక దాడులు జరిగాయని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. గురువారం ఈ మేరకు మావోయిస్టు పార్టీ బస్తర్ డివిజన్ కమిటీ నేత గంగ పేరుతో లేఖ విడుదలైంది. 7వ తేదీన రాత్రి 11 గంటల సమయంలోనూ రాకెట్ దాడులు జరిగినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. పామేడులోని పాలగూడ, ఇట్టగూడ, జిలోర్‌గట్ట, గొమ్మగూడ, కంచాల గ్రామాల అడవుల్లో 30 చోట్ల ఈ దాడులు జరిగాయని తెలిపారు. ఈ రాకెట్లు పడ్డ చోట.. 100-200 మీటర్ల పరిధిలో వన్యమృగాలు చనిపోయాయని, చెట్లు ధ్వంసమయ్యాయని వివరించారు. వైమానిక దాడుల వల్ల గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారని, పోలీసులు-పారామిలటరీ బలగాలు చేస్తున్న 'కాగర్' దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

దేవుడిని అర్చిస్తూనే.. తుది శ్వాస!

- ఆలయంలో పూజారికి గుండెపోటు.. అక్కడే మృతి
- ఖమ్మం జిల్లా వేపకుంట్ల గ్రామంలో ఘటన



చక్రవర్తిచార్యులు (ఫైల్)

రఘునాథపాలెం, ఏప్రిల్ 11: నిత్యం భగవంతుడి అర్చనలో గడిపే ఓ ఆలయ పూజారి, దేవుడిని అర్చిస్తూనే తుదిశ్వాస విడిచారు. తీవ్రమైన గుండె పోటుతో శ్రీరామచంద్రస్వామి విగ్రహ పాదాల చెంతనే కన్నుమూశారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో ఈ ఘటన జరిగింది. మధిరకు చెందిన నల్లాని చక్రవర్తిచార్యులు (70) ఇరవై ఏళ్ల క్రితం తన కుటుంబ సభ్యులతో వేపకుంట్లకు వచ్చి స్థిరపడ్డారు. అప్పటి నుంచి గ్రామంలోని రామాలయంలో పూజలు చేస్తున్నారు. చక్రవర్తిచార్యులు ప్రతిరోజు గుడిలోకి రాగానే మైక్‌లో దేవుడు పాటలు పెట్టి.. తాను ఇంటికి వెళ్లేటప్పుడు బంద్ చేస్తారు. బుధవారం సాయంత్రం ఎప్పటిలాగే ఆయన రామాలయానికి వెళ్లారు. మైక్‌లో పాటలు పెట్టి సాయంకాలం పూజ ప్రారంభించారు. రాత్రి 8.30గంటలు దాటినా గుడిలోని మైక్ బంద్ కాకపోవటంతో స్థానికులు గుడిలోకి వెళ్లారు. అప్పటికే పూజారి చక్రవర్తిచార్యులు దేవుడి పాదాల ముందు విగతజీవిగా పడి ఉన్నారు.

తిరుమలలో నకిలీ ఐఏఎస్

- జాయింట్ సెక్రటరీ హోదాలో దర్శనానికి లేఖ
- ఫిర్యాదుతో అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరుమల, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): తాను ఐఏఎస్ అధికారినంటూ శ్రీవారి దర్శనానికి లేఖ సమర్పించిన ఓ నకిలీ ఐఏఎస్‌ను తిరుమల పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. గుంటూరుకు చెందిన నరసింహమూర్తి బుధవారం తిరుమలకు వచ్చాడు. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ సెక్రటరీ హోదాతో ఉన్న గుర్తింపుకార్డును చూపి 11వ తేదీకి నాలుగు ప్రొటోకాల్ వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు జారీ చేయాలని సిఫార్సు లేఖను సమర్పించాడు. అనుమానించిన టీటీడీ ఈవో కార్యాలయ సిబ్బంది విజిలెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. నరసింహమూర్తిని అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ అని తేలడంతో తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో నరసింహమూర్తి ఐఏఎస్ అధికారే కాదని స్పష్టమైంది.

రైతు, యువత గోడు పట్టించుకోని మోదీ

- ప్రజా సమస్యలు వదిలేసి మోదీని కీర్తిస్తున్న మీడియా
- అధికారంలోకి రాగానే రైతు రుణాలు మాఫీ: రాహుల్

జైపూర్, ఏప్రిల్ 11: దేశంలో రైతులు, యువత, మహిళల గోడు పట్టించుకునే వారే లేరని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. రైతులు కనీస మద్దతు ధర కోసం డిమాండ్ చేస్తున్నారని, యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, మహిళలు ధరా ఘాతాన్ని భరించలేకపోతున్నారని అయితే, వీరెవరి గోడునూ పట్టించుకునే వారే లేరని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజస్థాన్‌లోని బికనీర్ లోక్‌సభ నియోజకవర్గంలో జరిగిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించారు. దేశంలో నెలకొన్న ప్రధాన సమస్య నిరుద్యోగమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య రక్షణే ప్రస్తుత ఎన్నికల ప్రధాన అజెండా అని అన్నారు. 15-20 మంది నియంత్రణలో ఉన్న మీడియా 24 గంటలూ మోదీని కీర్తించడమే పనిగా పెట్టుకుందని రాహుల్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేయబోయే మొదటి పని కుల గణన చేపట్టడమేనని ఆయన స్పష్టం చేశారు. రైతు రుణాల మాఫీని పట్టించుకోని మోదీ... బిలియనీర్ల అప్పులను మాత్రం మాఫీ చేస్తున్నారని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. దేశానికి అగ్నిపథ్ అక్కర్లేదని తమ ప్రభుత్వం దానిని రద్దు చేస్తుందని తెలిపారు. ప్రస్తుత ఎన్నికలు దేశంలోని పేదప్రజలకు, 22-25మంది బిలియనీర్లకు మధ్య జరుగుతున్న యుద్ధమని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 12 ఏప్రిల్ 2024

ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో పీహెచ్‌డీ

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు ఉన్నాయి. ఫుల్ టైం ప్రోగ్రామ్‌నకు ఇన్‌స్టిట్యూషనల్ ఫెలోషిప్ అర్హత ఉన్న రీసెర్చ్ స్కాలర్స్, సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ రీసెర్చ్ స్కాలర్స్, స్పాన్సర్డ్ రీసెర్చ్ స్కాలర్స్ అప్లయ్ చేసుకోవచ్చు. పార్ట్ టైం ప్రోగ్రామ్‌కు ప్రాజెక్ట్ స్టాఫ్, అకడమిక్ ఫ్యాకల్టీ మెంబర్లు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ అర్హులు.

విభాగాలు: ప్లానింగ్, ఆర్కిటెక్చర్, బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో పీజీ (ఆర్కిటెక్చర్/అర్బన్ డిజైన్/ప్లానింగ్/బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్) పూర్తిచేసి ఉండాలి. కనీసం 70 శాతం మార్కులతో బీఈ(సివిల్ ఇంజనీరింగ్)/బీఆర్క్/బీ ప్లానింగ్ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల బోధన/రీసెర్చ్/ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించినవారిని పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. రీసెర్చ్ రైటప్‌నకు 20, ప్రజంటేషన్ ఆఫ్ రీసెర్చ్ ఇంట్రెస్ట్‌కు 30, ఇంటర్వ్యూ స్కోర్‌కు 50 మార్కుల వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రిటెన్ టెస్ట్ సిలబస్ తదితర వివరాలను త్వరలో ప్రకటిస్తారు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 8
- **అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** మే 10
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** మే 21, 22
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 24
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** మే 31
- **చిరునామా:** రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, సర్వే నెం.4/4, ఐటీఐ రోడ్, విజయవాడ-520008
- **వెబ్‌సైట్:** www.spav.ac.in

నిఫ్టెమ్‌లో ఎంటెక్, ఎంబీఏ

హరియాణాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ అంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్)- ఎంటెక్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్/నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. సంస్థ నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్ అందిస్తారు.

ఎంటెక్

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఫుడ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్లాంట్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం సంబంధిత సబ్జెక్టులతో బీఈ/బీటెక్/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. ఎంపిక ప్రక్రియలో ముందుగా గేట్ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి మొత్తం 30 ప్రశ్నలు; అభ్యర్థి ఎంచుకొన్న సెక్షన్ నుంచి 70 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం గంటన్నర.

సెక్షన్లు: ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్; ఫుడ్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ప్రాసెస్ ఇంజనీరింగ్, బయో కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్; ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ అంత్రప్రెన్యూర్‌షిప్; ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ; అగ్రికల్చర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ.



ఎంబీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీని స్పెషలైజేషన్ ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. క్యాట్/మ్యాట్/సీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. లాజికల్ రీజనింగ్/డేటా ఇంట్రప్రిటేషన్ నుంచి 15, క్వాంటిటేటివ్ అనాలిసిస్ నుంచి 15, వెర్బల్ ఎబిలిటీ/రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **గేట్/క్యాట్/మ్యాట్/సీమ్యాట్ స్కోర్ ఆధారంగా మెరిట్ లిస్ట్ విడుదల:** మే 17
- **నాన్ క్యాట్/మ్యాట్/సీమ్యాట్ అభ్యర్థులకు ఎంట్రెన్స్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** మే 30
- **ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 3
- **గేట్ అభ్యర్థులకు కౌన్సెలింగ్:** మొదటి రౌండ్ - మే 20 నుంచి 22 వరకు; రెండో రౌండ్ - మే 27 నుంచి 29 వరకు; మూడో రౌండ్ - జూన్ 3 నుంచి 5 వరకు
- **ఎంటెక్‌లో మిగిలిన సీట్ల వివరాల వెల్లడి:** జూన్ 7
- **నాన్ గేట్ అభ్యర్థులకు ఎంట్రెన్స్ టెస్ట్:** జూన్ 17
- **నాన్ గేట్ అభ్యర్థుల ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** జూన్ 19
- **నాన్ గేట్ అభ్యర్థులకు కౌన్సెలింగ్:** జూన్ 20 నుంచి 23 వరకు
- **వెబ్‌సైట్:** www.niftem.ac.in

యూపీఎస్సీ ఐఈఎస్/ఐఎస్ఎస్ఈ 2024

ఎకనామిక్స్/స్టాటిస్టికల్ సర్వీసుల్లో జూనియర్ టైం స్కేల్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన ఇండియన్ ఎకనామిక్ సర్వీస్/ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహిస్తోంది. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లో 18 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 30 పోస్టులు చొప్పున మొత్తం 48 పోస్టులు ఉన్నాయి.

అర్హత: ఎకనామిక్ సర్వీస్‌కు పీజీ(ఎకనామిక్స్/అప్లయిడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనామెట్రిక్స్); స్టాటిస్టికల్ సర్వీస్‌కు డిగ్రీ(స్టాటిస్టిక్స్/మేథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్) లేదా పీజీ(స్టాటిస్టిక్స్/మేథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం సడలింపు వర్తిస్తుంది.

పరీక్ష వివరాలు

- ఇందులో రాత పరీక్ష, వైవా-వోస్ అనే రెండు పార్ట్‌లు ఉంటాయి. రాత పరీక్షకు 1000 మార్కులు, వైవాకు 200 మార్కులు నిర్దేశించారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్‌లు కూడా ఉంటాయి.
- ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌కు నిర్వహించే రాత పరీక్షలో జనరల్ ఇంగ్లీష్, జనరల్ స్టడీస్ సబ్జెక్టులకు ఒక్కోదానికి 100 మార్కులు; జనరల్ ఎకనామిక్స్-1, జనరల్ ఎకనామిక్స్-2, జనరల్ ఎకనామిక్స్-3 సబ్జెక్టులకు ఒక్కోదానికి 200 మార్కులు నిర్దేశించారు. ఒక్కో సబ్జెక్టుకు 3 గంటల సమయం ఇస్తారు.
- ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌కు నిర్వహించే రాత పరీక్షలో జనరల్ ఇంగ్లీష్, జనరల్ స్టడీస్ సబ్జెక్టులకు ఒక్కోదానికి 100 మార్కులు, మూడు గంటల పరీక్ష సమయం కేటాయించారు. స్టాటిస్టిక్స్-1(ఆబ్జెక్టివ్), స్టాటిస్టిక్స్-2(ఆబ్జెక్టివ్) సబ్జెక్టులకు ఒక్కోదానికి 200 మార్కులు, రెండు గంటల పరీక్ష సమయం నిర్దేశించారు. స్టాటిస్టిక్స్-3(డిస్క్రిప్టివ్), స్టాటిస్టిక్స్-4(డిస్క్రిప్టివ్) సబ్జెక్టులకు ఒక్కోదానికి 200 మార్కులు, మూడు గంటల పరీక్ష సమయం నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200(మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **ఐఈఎస్/ఐఎస్ఎస్ఈ 2024 ఎగ్జామ్ తేదీ:** జూన్ 21
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in/, upsconline.nic.in

టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

తెలంగాణ ఎకానమీ

తెలంగాణ పారిశ్రామికరంగం
చిన్నతరహా పరిశ్రమలు



సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి సంస్థలను చిన్నతరహా సంస్థలు అంటారు. అంటే పెద్ద, మెగా సంస్థల నిర్వచనంలోకి రాని సంస్థలన్నీ చిన్నతరహా సంస్థలని అర్థం. 2006లో చేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి చట్టం ప్రకారం చిన్నతరహా సంస్థల నిర్వచనాలను తెలుసుకుందాం.

సూక్ష్మ సంస్థలు(మైక్రో యూనిట్స్): ఉత్పత్తి సంస్థ అయితే భవనాలు, యంత్ర పరిజ్ఞానంపై చేసిన పెట్టుబడి గరిష్ఠంగా రూ.25 లక్షలు, సేవాసంస్థ అయితే యంత్ర పరికరాలపై చేసిన పెట్టుబడి గరిష్ఠంగా రూ.10 లక్షలు ఉంటే వాటిని సూక్ష్మ సంస్థలు అంటారు. అయితే 2020 జూలై 1 నుంచి ఆత్మనిర్భర భారత్‌లో భాగంగా పై అంశాలపై సూక్ష్మ సంస్థల గరిష్ఠ పెట్టుబడి, గరిష్ఠ వార్షిక లావాదేవీల మొత్తాన్ని రూ.5 కోట్లుగా మార్చారు.

చిన్న సంస్థలు(స్మాల్ యూనిట్స్): ఉత్పత్తి సంస్థ అయితే భవనాలు, యంత్ర పరిజ్ఞానంపై చేసిన పెట్టుబడి రూ.25 లక్షల కంటే ఎక్కువగా ఉండి, గరిష్ఠంగా రూ.5 కోట్లు, సేవాసంస్థ అయితే రూ.10 లక్షల కంటే ఎక్కువగా ఉండి గరిష్ఠంగా రూ.2 కోట్లు పెట్టుబడి గల సంస్థలను చిన్నసంస్థలు అంటారు. 2020 జూలై 1 నుంచి పై అంశాలపై చేసిన పెట్టుబడి గరిష్ఠంగా రూ.10 కోట్లు, గరిష్ఠ వార్షిక టర్నోవర్ రూ.50 కోట్లుగా మార్చారు.

మధ్యతరహా సంస్థలు(మీడియం యూనిట్స్): భవనాలు యంత్ర పరిజ్ఞానంపై చేసిన పెట్టుబడి ఉత్పత్తి సంస్థ అయితే రూ.5కోట్ల కంటే ఎక్కువగా ఉండి గరిష్ఠంగా రూ.10 కోట్లు, సేవాసంస్థ అయితే యంత్రపరికరాలపై చేసిన పెట్టుబడి రూ.2 కోట్ల కంటే ఎక్కువగా ఉండి గరిష్ఠంగా రూ.5కోట్లు గల సంస్థలను మధ్యతరహా సంస్థలు అంటారు. 2020 జూలై 1 నుంచి పై అంశాలపై గరిష్ఠ పెట్టుబడి రూ.50 కోట్లు, గరిష్ఠ వార్షిక లావాదేవీల మొత్తం రూ.250 కోట్లుగా ఉన్న సంస్థలను మధ్యతరహా సంస్థలు అంటున్నారు.

ప్రాధాన్యం

- ఆర్థికవ్యవస్థలో చిన్నతరహా సంస్థలు అనేక కోణాల్లో తమ ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. తక్కువ పెట్టుబడితో ఆరంభించడానికి అవకాశం ఉన్నందున ఎక్కువమంది వీటిని ప్రారంభిస్తారు. ఫలితంగా సంపద వికేంద్రీకరణకు అవకాశం ఉంటుంది. దేశంలో ఉన్న మొత్తం పారిశ్రామిక సంస్థల్లో 95 శాతం చిన్నతరహా సంస్థలే ఉన్నాయి. చిన్నతరహా సంస్థలు శ్రమ సాంద్రత పద్ధతిని పాటించడం వల్ల ఎక్కువమందికి ఉపాధి లభించి ఆదాయ సమపంపిణీకి అవకాశం ఉంటుంది. దేశంలో వ్యవసాయరంగం తరవాత ఎక్కువమందికి చిన్నతరహా సంస్థలే ఉపాధిని కల్పిస్తున్నాయి. దేశంలో దాదాపు పదికోట్లమంది ఈ రంగంలో ఉపాధి పొందుతున్నారు. చిన్నతరహా సంస్థలను గ్రామాల్లోనూ, వెనుకబడిన ప్రాంతాల్లోనూ స్థాపించడానికి అవకాశం ఉన్నందున సంతులిత ప్రాంతీయాభివృద్ధికి అవకాశం ఉంటుంది. చిన్నతరహా పరిశ్రమల ఫలనకాలం తక్కువగా ఉన్నందున ద్రవ్యోల్బణాన్ని అరికట్టే అవకాశం ఉంటుంది. శ్రామిక, యాజమాన్య సంబంధాలు చిన్నతరహా పరిశ్రమల్లో సామరస్యంగా ఉండి పారిశ్రామిక వివాదాలు తక్కువగా ఉంటాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో 40 శాతం మొత్తం ఇండియా ఎగుమతుల విలువలో 45 శాతం చిన్నతరహా పరిశ్రమల వాటా ఉండటం గమనార్హం.
- పై ప్రాధాన్యం దృష్ట్యా చిన్నతరహా పరిశ్రమలకు వస్తువులను రిజర్వు చేయడం, సబ్సిడీలు ఇవ్వడం ద్వారా, పన్నుల మినహాయింపుల ద్వారా ప్రభుత్వం వాటి అభివృద్ధిని ప్రోత్సహిస్తూ ఉంటుంది. అయితే సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల అమలులో భాగంగా చిన్నతరహా సంస్థలకు వస్తువులను రిజర్వు చేయడం తగ్గించారు.
- తెలంగాణలో 2015, 2023 జనవరి మధ్య 19,139 చిన్నతరహా సంస్థలు స్థాపితమయ్యాయి. దాదాపు 3.5 లక్షల మందికి ఉపాధిని సృష్టించాయి. తెలంగాణలో చిన్నతరహా పరిశ్రమలు ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, నల్లగొండ, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలో కేంద్రీకృతమయ్యాయి.


తెలంగాణలో చిన్నతరహా పరిశ్రమలు విస్తరించిన తీరు

- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, నల్లగొండలో 20001-88590 సంస్థలు రిజిస్టర్ కాగా సంగారెడ్డి, మహబూబ్‌నగర్, సూర్యాపేట, ఖమ్మం, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్‌లలో 10001-20,000ల సంస్థలు రిజిస్టరై ఉన్నాయి. కాగా కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, వికారాబాద్, నాగర్‌కర్నూలు, మహబూబాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం, వరంగల్ రూరల్, పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల, ఆదిలాబాద్‌లలో 5001 - 10,000ల సంస్థలు రిజిస్టరయ్యాయి. ఇక నిర్మల్, కుమురంభీమ్, జయశంకర్, ములుగు, జోగులాంబ గద్వాల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో 1368-5,000ల వరకు సంస్థలు రిజిస్టరై ఉన్నాయి.
- తెలంగాణ ప్రభుత్వం చిన్నతరహా సంస్థలను పలురకాలుగా సహాయం చేస్తూ ప్రోత్సహిస్తున్నది. 2017లో స్థాపించిన తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్ బ్యాంకేతర ద్రవ్యసంస్థలా చిన్నతరహా సంస్థలకు సహాయం చేస్తున్నది. ఖాయిలాపడిన చిన్నతరహా సంస్థలను పునఃనిర్మించే ప్రక్రియలో భాగంగా దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో ఇలాంటి సంస్థలు ఏర్పాటుచేశారు. చిన్నతరహా సంస్థలు తీసుకున్న బ్యాంకు రుణాలు నిరర్థక ఆస్తులుగా మారకుండా ఈ సంస్థ ద్రవ్యసహాయం చేస్తున్నది. 2017 నుంచి 2022 వరకు రాష్ట్రంలో 442 సంస్థల సమస్యలను విచారించి 52 సంస్థలకు రూ.500.28 లక్షల సహాయం అందించింది. ద్రవ్యేతర వ్యూహాత్మక సహాయాన్ని కూడా అందించే కార్యక్రమాలను ఈ సంస్థ ఆరంభించింది. 2022లో చిన్నతరహా పరిశ్రమల వ్యాపారం-పెట్టుబడి అంశాల్లో పరస్పర సహకారానికి థాయ్‌లాండ్‌కు సంబంధించిన థాయ్ ట్రేడ్.కామ్, తెలంగాణ రాష్ట్ర గ్లోబల్ లింక్‌ల మధ్య తెలంగాణ టీ-హబ్ ద్వారా అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రధానంగా ఫుడ్ ప్రాసెసింగ్, కలప సంబంధిత పరిశ్రమలపై దృష్టిపెట్టే ఉద్దేశంతో ఈ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రాష్ట్రానికి చెందిన చిన్నతరహా సంస్థలు జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ లిస్ట్‌లో చేరే ప్రక్రియలో సలహాలు ఇచ్చేవిధంగా జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో కూడా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకోసం అవసరమైన ద్రవ్య సహాయానికి సిడ్బి(స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - ఎస్ఐడీబీఐ)తో కూడా అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఒక ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్‌ను సిడ్బి ఏర్పాటుచేసింది. ఉచితంగా మూడు సంవత్సరాలపాటు రాష్ట్రానికి చెందిన చిన్నతరహా సంస్థలను క్రమసంఖ్యలో చేర్చడం కోసం జస్ట్ డయల్‌తో కూడా ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకోవడం జరిగింది. రాష్ట్రానికి చెందిన చిన్నతరహా సంస్థలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమ్మకందారులు, కొనుగోలుదారులతో సంబంధాలు కలిగి ఉండటం కోసం 2019లో టీ.ఎస్.గ్లోబల్ లింకర్‌ను ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు తెలంగాణ నుంచి ఏడువేల సంస్థలు.. మొత్తం 3.5లక్షల సంస్థలు ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. 2023 జనవరి 8 నుంచి 10 వరకు జరిగిన ఇండస్ ఫుడ్ ఎక్స్‌పోలో చిన్నతరహా పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ద్వారా 'తెలంగాణ రాష్ట్ర పెవిలియన్'ను ఏర్పాటు చేశారు. కేంద్రం నిధులు అందిస్తున్న ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమాలను రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు అమలుపరుస్తుంది. ఈ పథకం ద్వారా 2022-23(2022 డిసెంబరు వరకు)లో రాష్ట్రంలో 422 సంస్థలకు రూ.2137.13 లక్షల సహాయం అందింది. సహాయం పొందిన సంస్థల్లో 36.7 శాతం సంస్థలు రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో ఉండటం గమనార్హం.



డా.ఎం.ఎ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.


లిటిల్స్



దేవుడు ప్రతిచోటా...

గురువు దగ్గర శిష్యులంతా గుమికూడారు. పాఠం చెబుతూంటే పిల్లలందరూ శ్రద్ధగా వింటున్నారు. పాఠం మధ్యలో ప్రతి చోటా దేవుడుంటాడని గురువు అన్నాడు. 'నిజమా గురువుగారు' అంటూ ఓ పిల్లవాడు అడిగాడు. 'అవును' అన్నాడు గురు. 'అయితే.. నీలో నాలో కూడా దేవుడు ఉన్నాడా?' అని అడిగాడు ఆ విద్యార్థి. 'ఇది ముమ్మాటికీ నిజం. నీలో నాలోనే కాదు. ప్రతి ప్రాణిలో దేవుడున్నాడు. ఆయన లేని చోటు లేదు' అంటూ గురువుగారు సెలవిచ్చారు.

ఒకరోజు ఐదుమంది పిల్లలు అడవికి కట్టెలు తీసుకురావటానికి వెళ్లారు. కట్టెల మోపులతో ఇంటికి వస్తోంటే ఒకటే అరుపులు. పక్కకు జరగండి.. అంటూ కేకలు వేస్తున్నారు. ఎదురుగా ఏనుగు పరిగెత్తుకొస్తోంది. నలుగురు పిల్లలు దూరంగా పరిగెత్తారు. ఒక పిల్లవాడు మాత్రం దారిలోనే నిలబడ్డాడు. పిల్లలు అరిచినా పక్కకు వెళ్లలేదు. 'దేవుడు అన్ని చోట్లా ఉన్నాడు. ఏనుగులోనూ దేవుడు ఉన్నాడు. ఇక్కడే ఉంటా'నన్నాడు. వెంటనే ఏనుగు వచ్చి తొండంతో ఆ బాలుడిని కిందపడేసింది. ఆ పిల్లవాడికి దెబ్బలు తగిలాయి. వైద్యుడు వచ్చి వైద్యం చేశాడు. అంతలోనే గురువుగారు తన శిష్యులతో పాటు ఆ విద్యార్థి దగ్గరకు వచ్చాడు. 'ఎందుకు నాయనా.. ఇలా చేశావు. ఏనుగుకి అడ్డం వచ్చావంట'అని అడిగారు. ఏడుస్తూనే.. 'మీరే చెప్పారు కదా గురువుగారు. ప్రతి ప్రాణిలో దేవుడు ఉంటాడని చెప్పారు కదా!' అన్నాడా విద్యార్థి. 'పిచ్చివాడా.. ఏనుగులో దేవుడున్నాడు. అదే సమయంలో మావటి వాడు నిన్ను పక్కకు వెళ్లమని కేకలు వేశాడు. మావటివాడిలో కూడా దేవుడు ఉన్నాడు. నువ్వు అతని మాట విని ఉంటే ఏమీ అయ్యేది కాదు' అన్నాడు. 'గురువుగారు తప్పుగా అర్థం చేసుకున్నా.. క్షమించు' అన్నాడు ఆ విద్యార్థి. 'నీదేమీ తప్పులేదు నాయనా. నా పాఠం నీకు అలా అర్థమైంది. అనుభవమే నీకు అన్నీ నేర్పుతుంది' అంటూ ఆశీర్వదించాడు గురువు.



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 279

	8						2	
9			2			1		8
		7	8			9		
			5		2		6	
4								1
	7		6		9			
		9			6	3		
8		1			5			6
	3						4	

సుడోకు - 278 సమాధానం

7	8	9	4	5	6	3	1	2
6	2	1	9	7	3	5	8	4
3	4	5	8	1	2	9	6	7
9	5	3	2	8	7	1	4	6
1	6	2	3	4	5	8	7	9
8	7	4	1	6	9	2	5	3
5	9	6	7	2	1	4	3	8
2	1	8	6	3	4	7	9	5
4	3	7	5	9	8	6	2	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.